ఓమ్

ఆదర్శ జననీ జనకులు

(శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వామి శతజయంత్యుత్సవ సందర్భమున ప్రకాశితము)



శ్రీరామస్వామి, శ్రీమతి సుశీలాదేవి గార్లు
(శ్రీవిద్యాప్రకాశానందస్వాములవారి తల్లిదండ్రులు)

రచయిత్రి

శ్రీమతి వై. ఓంకార వివేకచూడామణి

Scanned with CamS

ఓమ్

ఆదర్శ జననీ జనకులు

(శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వామి శతజయంత్యుత్సవ సందర్భమున ప్రకాశితము)

రచయిత్రి

శ్రీమతి వై. ఓంకార వివేకచూడామణి

2013

Scanned with CamS

ఆదర్శ జననీ జనకులు

శ్రీమతి వై.ఓంకారం

ప్రథమ ముద్రణ : 2013

ప్రతులు : 500

వెల : రూ. 75/-

ప్రతులకు :
శ్రీమతి వై. ఓంకారం
పుట్టపర్తి.
ఫోన్ నెం. 08555-288934
సెల్ నెం. 78939 40966

డి.టి.పి. & ప్రింటింగ్:
శ్రీవారి గ్రాఫిక్స్,
తిరుపతి.
సెల్: 99484 34277

శ్రీ తండ్రిగారు

"బ్రహ్మశ్రీ" తూనుగుంట్ల-రామస్వామి, బి.ఏ,బిఎల్, గారు

తమ పుత్రుని ఆధ్యాత్మిక విద్యకై గురుదేవుల చరణ
సన్నిధి కల్పించిన, క్రియావేదాన్తి

Scanned with CamS

శ్రీ తల్లిగారు

శ్రీమతి తూనుగుంట్ల-సుశీలాదేవిగారు,

తమ పుత్రుని సన్న్యాస స్వీకారమునకు మహానందముతో

అనుజ్ఞ ఇచ్చిన ఆదర్శ గృహిణీమతల్లి



శ్రీ తండ్రిగారి మరియు తనయుల యొక్క గురుదేవులు

శ్రీశ్రీశ్రీ సద్గురు మహర్షి మలయాళ స్వాములవారు,

వారి తురీయాశ్రమనామధేయం, అసంగానందగిరి స్వాములవారు,

(శ్రీ వ్యాసాశ్రమం, ఏర్పేడు, చిత్తూరు జిల్లా)

Scanned with CamS

ఈ మహనీయులు తమ ఆశ్రమములో, అనాథులకొరకు శరణాలయము, స్త్రీల ఉన్నతికై కన్యాగురుకులమును, సంస్కృత విద్యా వ్యాప్తికై సంస్కృత ఉన్నత పాఠశాలను, ఆత్మ విద్యా వ్యాప్తికై బ్రహ్మవిద్యాపాఠశాలను స్థాపించి, సంఘమునకు మహోపకారమొనర్చిన కరుణామయులు,

వారు మలయాళదేశీయులు గాన ప్రజలు మలయాళస్వామి, అని పిలుచుట కలవాటుపడి ఆపేరే శాశ్వతనామధేయమై నిలిచినది.

తనయులు

శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు

శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

కాళహస్తి,

ఈ మహనీయులు, "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అని తలచినవారై తమ ఆశ్రమములో ఉచిత నేత్రవైద్యాలయమును"త్రినేత్ర భక్తకన్నప్ప" పేరిట 1993 లో స్థాపించి ప్రజలకు మహోపకారమొనర్చిన కరుణామూర్తి మరియు, 108, గీతాజ్ఞానయజ్ఞములను, అనేక గీతా సప్తాహములను, జయప్రదముగ నెరవేర్చి, ప్రజలకు ఆత్మతత్త్వమును తేటతెల్లముగ బోధించి, "విద్యాప్రకాశానంద" అను నామధేయమును సార్థక పరచిన సుపుత్రులు.

నివేదన

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

'మాతృదేవో భవ, పితృదేవోభవ' అని వేదానుశాసనం. తల్లినీ, తండ్రినీ దేవతలుగా భావించి ఆరాధించడం మన సంప్రదాయం. తల్లిదండ్రులు ప్రత్యక్షదేవతలు.

'ఆదర్శ జననీ జనకులు' - అన్న ఈ గ్రంథం రచించినవారు ఆత్మసోదరి శ్రీమతి ఓంకారమమ్మగారు. వారు గృహస్థాశ్రమానికి వన్నె తెచ్చిన శ్రీసుశీలా- రామస్వామి దంపతుల పుత్రిక, మరియు 'గీతామకరందం స్వామి' గా జగద్విఖ్యాతి గాంచిన శ్రీశుకబ్రహ్మాశ్రమ స్థాపకులు పూజ్య శ్రీ విద్యా ప్రకాశానందస్వాములవారి సోదరీమణి.

శ్రీరామస్వామిగారు మహర్షి-సద్గురు శ్రీమలయాళస్వాములవారు ముఖ్యశిష్యులు. తమ పుత్రడైన ఆనందమోహనుణ్ణి గురుదేవులకు దత్త పుత్రులుగా సమర్పించిన త్యాగధనులు. శ్రీమతి సుశీలాదేవిగారు కుమారుని సన్న్యాస స్వీకారానికి ఆనందంతో అనుమతి యిచ్చిన సాధ్వీమణి. ఇట్టి పవిత్ర చరిత్రుల గర్భంలో జన్మించిన ఓంకారమమ్మ గారికి బాల్యం నుండీ తల్లి దండ్రుల శిక్షణలో ఆధ్యాత్మికసంస్కారం అలవడింది. ఈ గ్రంథ రచన ఆ సంస్కారప్రభావమే.

1992లో నేను పూజ్య శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారి జీవిత చరిత్ర రచించినారు. 1998లో శ్రీ స్వాములవారు బ్రహ్మీభూతులయ్యారు. వారి శతజయంత్యుత్సవాలు 2013 ఏప్రెల్ 28 నుండి ఐదురోజులు ఘనంగా జరుగనున్నాయి. వారి జీవితచరిత్రలో 1992 తరువాతి

Scanned with CamS

సంఘటనలు గూడా చేర్చిన పరివర్ధిత సంస్కరణం ఇటీవలనే వెలువడినది.

శ్రీ స్వాములవారి శతజయంత్యుత్సవాలు శ్రీ శుక బ్రహ్మాశ్రమములో దేశం నలుమూలలనుండీ రానున్న సాధుపుంగవులు, వేలకొలది భక్తుల సమక్షములో జరుగనుండడం ముదావహం.

ఈ శుభసందర్భంలో శ్రీమతి ఓంకారమమ్మగారికి తమ తల్లి దండ్రుల ఆదర్శ జీవితచరిత్రను సంగ్రహరూపంలో నైనా ప్రకటించాలన్న అభిప్రాయం కలిగింది. వారి కలం కదిలింది. పూర్వం సందర్భానుగుణంగా వ్రాసి పెట్టుకున్న కొన్ని వృత్తాంతాలు, వచనరూపంలో అల్లిన కవితలు, ఇటీవలి సంఘటనలకు చెందిన అంశాలు చేర్చి " ఆదర్శజననీ జనకులు" అన్న పేరుతో ఈ గ్రంథాన్ని రూపొందించారు. ఎడపెడా గీత మున్నగు గ్రంథాలనుండి ప్రమాణశ్లోకాలను గూడా ఉదాహరించారు. శ్రీ విద్యా ప్రకాశానందస్వామీజీ రచనలు 'మానసబోధ', 'తత్త్వసారం' అనే గ్రంథాలనుండి సందర్భానుగుణంగా కొన్ని గేయవాక్యాలను ఇందులో ఉదహరించారు.

తల్లిదండ్రులపై నిక్కమైన భక్తి లేకపోతే ఇట్టి రచనలు వెలువడవు. పైగా పుట్టపర్తిలో ఉండడం వల్ల రచయిత్రి గారికి బాల్యంలో జననీజనకులు నుండి సంక్రమించిన సంస్కారం ద్విగుణీకృతమయింది.

దీనికి సంబంధించిన వ్రాతపతిని నాకు శ్రీ ఈశ్వర్‌గారి ద్వారా పంపించి సరిచేసి శతజయంత్యుత్సవాలలో ప్రకటించడానికి వీలుగా ముద్రించే ఏర్పాటు చేయమని అమ్మగారు కోరినారు.

వారి భక్తి శ్రద్ధలు నన్ను ఈ కార్యక్రమాన్ని త్వరలో పూర్తి చేయడానికి పురి కొల్పాయి. రచనలో వెనుకముందులుగా ఉన్న కొన్ని అంశాలను

క్రమంలో పెట్టవలసివచ్చింది. వారి భాషను నేను మార్చలేదు. కొన్ని చోట్ల కొన్ని సంఘటనలు పునరుక్తాలయ్యాయి. అవసరమైన మేరకు చిరుమార్పులు కావించాను.

దీనిని డి.టి.పి. చేసి సిద్ధం చేయవలసినదిగా తిరుపతిలోని శ్రీవారి గ్రాఫిక్స్ వారిని కోరగా వారు వెంటనే తమ వంతు కర్తవ్యం పూర్తి చేశారు. వారిని అభినందిస్తున్నాను.

చరాచర సుఖాభిలాషి శ్రీమలయాళస్వాములవారి గృహస్థ శిష్యులలో శ్రీ రామస్వామి దంపతులు అగ్రగణ్యులు కాగా వారి సన్న్యాసి శిష్యులలో శ్రీవిద్యాప్రకాశానందస్వాములవారు ప్రథమ గణనీయాలి.

మహనీయుల చరిత్రలు గ్రంథరూపంలో వస్తే లోకం బాగుపడే అవకాశముంటుంది. గ్రంథాలు రావాలంటే రచయితలు, రచయిత్రులూ అందుకై కృషి చేయాలి.

ఈ రచన పఠించడం ద్వారా శ్రీ మలయాళ సద్గురు దేవులనూ, శ్రీ విద్యాప్రకాశానందస్వామివారినీ, ఆదర్శమాతాపితలు శ్రీ సుశీలా రామస్వామి దంపతులను స్మరించినా, కీర్తించిన పుణ్యం దక్కుతుంది.

అట్టి పవిత్రకృషిని కొనసాగించి అటు తల్లి దండ్రులనూ, ఇటు శ్రీ సద్గురుమూర్తులను కీర్తించి తద్వారా పుణ్యధనం ఆర్జించిన ఓంకారమమ్మ గారికి జన్మ ధన్యమైనది.

అట్టి పుణ్యాన్ని భక్తులైన పాఠకులకు ఈ రచనద్వారా అందజేసిన శ్రీమతి ఓంకారమ్మ గారికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.

తిరుపతి

తేది- 01-04-2013 సముద్రాల లక్ష్మణయ్య

Scanned with CamS

పరిచయము

మా తండ్రిగారు పరమపదించి ఇప్పటికి దాదాపు 53 సం॥ కావచ్చుచున్నవి, ఇపుడు వీరి చరిత్ర వ్రాయవలసిన అవసరమేమి? అని పలువురకు ప్రశ్న ఉదయించవచ్చును.

తండ్రిగారి అనంతరం వారి వంశం ఇప్పుడు 5వ తరం జరుగుచున్నది. వారు దేశ విదేశాలలో వున్నారు. వారెవరికిని తాతగారిని గూర్చిన వివరణలు తెలియవు. కాన వారికి, భగవద్భక్తులకు, సాధనాపరులకు వారి చరిత్ర ఒకింత తెలుపనెంచి, ఈ చరిత్ర రచించుటయైనది. మరియు శ్రీ.తండ్రిగారు గీతాప్రబోధములను నిత్యజీవితములో కార్యాన్వితము గావించుకొని, నిష్కామ కర్మాచరణగ తాము చేయు దేశసేవ, సంఘసేవాకార్యక్రమములను, ఆధ్యాత్మికతతో మేళవించి అది ఒక అపూర్వయజ్ఞంగా ఆచరిస్తూ, ప్రజలలో దైవ విశ్వాసమును, కర్మమార్గ, జ్ఞాన మార్గములయందాసక్తిని పెంపొందించుచు ఆధ్యాత్మిక సోపానముల నధిగమించి ఏ విధముగా జన్మ రాహిత్యస్థితికి చేరుకొన్నారు? అనే విషయాన్ని తెలుపుటయే ఈ రచన యొక్క ముఖ్యోద్దేశ్యము.

వారు తాము ఆచరించే మార్గంలో ఎన్ని ఒడుదుడుకులు, జటిలసమస్యలు ఎదురైనను, లక్ష్యము భగవత్పాదారవిందములందే అర్పించి ధీరులై, స్థితప్రజ్ఞులై, అన్నిటిని అధిగమించి తమ ఆధ్యాత్మిక లక్ష్యాన్ని చేరుకొన్న మహనీయులు.

వారి కార్యాచరణలో నేను తెలిపిన విషయములు కడుతక్కువ మాత్రమే. నాకు తెలియనివి, నామేధస్సున కందనివి ఎన్నియో కలవు.

నేను వారి ఆఖరి సంతానమును, కాన నాకు బుద్ధి వచ్చే నాటికే వారి సేవాకార్యక్రమములు చాలావరకు పూర్తియైనవి.

తండ్రిగారు, నాకు పదిసంవత్సరముల వయస్సు వచ్చువరకును ఆభరణములు తగిలించలేదు. నా ఐదుగురి సోదరులలో నాకు దగ్గర వయసువారైన ఇరువురి సోదరులతో పాటు, నన్నును వారి కార్యక్రమములకు, స్వచ్ఛంద సేవలకు యూనిఫాం, స్కౌట్‌డ్రస్‌తో పంపెడివారు. ఆవయసులో వారి కార్యాచరణయొక్క అర్థములు, అంతరార్థములు తెలియక పోయినను ఆసక్తి, ఉత్సాహముతో పాల్గొనుచు సహకరించెడిదానను. ఆదృశ్యములు నా హృదయ ఫలకమున ముద్రితములైపోయినవి. వాటినే ఇపుడు గ్రంథరూపమున రచియించుట ఐనది. చిన్ననాడే నా వయసుకు తగిన దేశసేవా భాగ్యము లభించినందు లకు నేను మిగుల ధన్యురాలను.

ఇంతకు పూర్వం నేను ఏ రచనలు చేయలేదు. తల్లి-తండ్రుల మీదనుండే భక్తి, గౌరవములను పురస్కరించుకొని మాత్రమే, ఈ రచన సాగించుటయైనది.

కాన వ్రాసే విధానములోకాని, అర్థ భావములలో కాని ఏవైనను పొరపాట్లు దొర్లిన అవి పట్టించుకొనక వారి కార్యాచరణనే, ప్రధానముగ తీసుకొన మనవి చేయుచున్నాను.

ఇట్లు
తృతీయ పుత్రిక
వై. ఓంకార వివేక చూడామణి.

Scanned with CamS

విషయసూచిక

1. గణేశ ప్రార్థన 1
2. దైవప్రార్థన 2
3. అంకితం 4
4. పితృశ్రీ 5
5. పీఠిక 8
6. మాతృశ్రీ 10
7. శ్రీ ఆనందమోహనుని సన్న్యాసదీక్షా కార్యక్రమం-సంక్షిప్త వివరములు 18
8. పితృదేవుని అస్తమయం 25
9. మాతృదేవి అస్తమయం 28
10. మాతృదేవి స్మృతి 29
11. ఆదర్శ జననీజనకుల చరిత్ర – ఆధ్యాత్మిక ప్రవృత్తి 32
12. జననం 33
13. విద్యాభ్యాసం 34
14. ఉపనయనం 35
15. ప్రథమవివాహం 35
16. ద్వితీయవివాహం 36
17. ఉద్యోగము 36
18. జాతీయోద్యమము 40
19. సంఘసేవా కార్యక్రమములు 49

1. గోసేవ 49

2. పశుబలి 50

3. బాల్యవివాహములను నిషేధించుట. 51

4. పునర్వివాహములను ప్రోత్సహించుట 52

20. దీపావళి సందర్భం 53
21. వివాహపద్ధతులు 58
22. వంశసేవ 64
23. శ్రీ ఆనందమోహనులు 68
24. ఒకముఖ్య సంఘటన 68
25. పుత్రుని గురుదేవుల సన్నిధికి పంపుట 69
26. నిర్యాణఘట్టము 75
27. శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారి చరిత్రలో కొన్ని విశేషాలు 80
28. శ్రీ యోగవాశిష్ఠము 86
29. శ్రీ ఆనందమోహన్ సన్న్యాస స్వీకారం 87
30. శ్రీ విద్యాప్రకాశానందస్వామివారి జీవిత సంగ్రహము 93
31. శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి సన్న్యాస స్వీకార షష్ట్యబ్ది 96
32. ఆనందమోహన్ సంగ్రహచరిత్ర – గేయరచన 107

Scanned with CamS

బాల్యంలో ఆనందమోహన్

"ఓమిత్యేకాక్షరం బ్రహ్మ ధ్యేయం సర్వముముక్షుభిః"

ఓం ఓం ఓంకారరూపం త్ర్యహమితి చ పరం యత్స్వరూపం తురీయం
త్రైగుణ్యాతీతనీలం కలయతి మనసస్తేజ సింధూరమూర్తిమ్ ।
యోగీంద్రా బ్రహ్మరంధ్రే సకల గుణమయం శ్రీ హరేంద్రేణ సంగం
గం గం గం గం గణేశం గజముఖమభితో వ్యాపకం చిన్తయన్తి ॥

ప్రణవస్వరూపుడును, త్రిగుణాత్మకమగు ప్రకృతికి పరమైనవాడును, తురీయరూపుడును, మనస్సును ప్రకాశింపచేయు వాడును, తేజోరూపుడును ,సింధూరకాంతిగలవాడును, సకలకల్యాణ గుణమయుడును, గజముఖుడును, సర్వవ్యాపియునగు విఘ్నేశ్వరుని యోగులు బ్రహ్మరంధ్రమున పరబ్రహ్మైక్యము కొరకై ధ్యానించుచున్నారు.

పితాఽహమస్య జగతో మాతా ధాతా పితామహః ।
వేద్యం పవిత్ర మోంకార ఋక్సామ యజురేవ చ ॥గీత-9-17

మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేక మక్షరమ్॥గీత-10-25

దైవప్రార్థన

యో బ్రహ్మాణం విధదాతి పూర్వం
యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై ।
తం హి దేవ మాత్మ బుద్ధి ప్రకాశం
ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే ॥

ఎవరు సృష్టికి పూర్వం బ్రహ్మదేవుని సృజించిరో, ఎవరా బ్రహ్మదేవునకు, వేదములను గూడ నొసంగిరో, అట్టి తేజోవంతులును మనోబుద్ధులను ప్రకాశింపజేయువారును అగు పరమాత్మను ముముక్షువగు నేను శరణు పొందుచున్నాను.

యన్మాయా వశవర్తి విశ్వమఖిలం బ్రహ్మాది దేవాసురాః
యత్సత్త్వాదమృషేవ భాతి సకలం రజ్జ్వాం యథాహేర్భ్రమః ।
యత్పాదప్లవ ఏక ఏవ హి భవామ్భోధేఽస్తితీర్షావతాం
వన్దేఽహం తమశేషకారణవరం రామాఖ్యమీశం హరిమ్ ॥

ఎవని యొక్క మాయకు లోబడి బ్రహ్మాదిదేవతలతో కూడిన ఈ ప్రపంచమంతయు వర్తించుచున్నదో, త్రాటియందు పాము గోచరించుచున్నట్లు, ఎవని యొక్క ఉనికిచే ఈ సమస్త ప్రపంచము సత్యముగ తోచుచున్నట్లున్నదో, సంసార సముద్రమును దాట దలంచువారికి ఎవరి పాదపద్మములు ఏకైక నావయై విలసిల్లుచున్నవో, సమస్తమునకు కారణమైనవారును, రాముడను పేరు కలవారును, జగదీశ్వరుండును అగు అట్టి శ్రీ హరికి నమస్కరించుచున్నాను.

గీతాంజలి

గీతా కల్పతరుం భజే భగవతా
కృష్ణేన సంరోపితం
వేదవ్యాస వివర్ధితం శ్రుతిశిరో
బీజం ప్రబోధాంకురమ్ ।
నానాశాస్త్ర రహస్య శాఖమరతి
క్షాంతి ప్రవాళాంకితం
కృష్ణాంఘ్రిద్వయ భక్తి పుష్పసురభిం
మోక్షప్రదం జ్ఞానినామ్ ॥

తా ॥ భగవంతుడగు శ్రీ కృష్ణునిచే నాటబడినదియు, శ్రీ వేదవ్యాస మునీంద్రులచే వృద్ధి నొందింపబడినడియు, ఉపనిషత్తులే విత్తనములుగ గలదియు, ప్రబోధమను అంకురముతో నొప్పునదియు, సకల శాస్త్ర రహస్యములను కొమ్మలు గలదియు, అనాసక్తి, క్షమ యను చిగుళ్ళతో గూడినదియు, శ్రీ కృష్ణ భగవానుని పాదపద్మముల యెడల భక్తి యను సుగంధముచే శోభించునదియు, జ్ఞానులకు మోక్షమొసగునదియు నగు గీతా కల్పవృక్షమును నేను సేవించుచున్నాను.

Scanned with CamS

అంకితము

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ"

"త్యాగేనైకే అమృతత్వమానశుః"

అను శ్రుతి వాక్యములను తలచినవారై

తమ ప్రఖ్యాతి వహించిన న్యాయవాద వృత్తిని

అవలీలగ త్యజించి

నిష్కామ కర్మాచరణగ

మాతృదేశసేవ, సంఘసేవ, సాధుసత్పురుషుల సేవచే తమకాయమును, కాలమును, ధన్యమొనర్చుకొని వానప్రస్థులై, ఆదర్శదంపతులై కాళహస్తి క్షేత్రమున ఆత్మారామ ఆశ్రమమున భగవద్ధ్యాననిష్ఠులై, తమ తుది జీవితమును పుణ్యప్రదముగ గడిపి, ఆ సచ్చిదానంద పరబ్రహ్మమును చేరిన ప్రియ జననీజనకులకు భక్తి పూర్వక నమస్సుమము లర్పించుచు ఈ చిన్ని పొత్త మంకిత మొనర్చుచున్నాను.

ఇట్లు

తృతీయ పుత్రిక

వై. ఓంకార వివేక చూడామణి.

గేయరచన

పితృశ్రీ

భారతదేశ స్వాతంత్ర్యమునకై
దేశసేవచేయ, ఘన న్యాయవాద
వృత్తి త్యజించిన "త్యాగ ధనుడ" వీవు.

సంఘ సంస్కరణకై అహోరాత్రములు
అఖండ కృషి సల్పి
"ఆదర్శ ప్రాయుడ" వైతి వీవు.

సత్య ధర్మ నిరతుడవై, "పరోప
కారాయ ఇదం శరీర మనుచు" చేసితివి
దీనజనసేవ, అర్పించితివి నీ "సర్వస్వమును".

నిష్కామ కర్మాచరణుడవై, పరమ
పురుషార్థము బడసి
"కర్మయోగి" వైతి వీవు.

భూమాత గోమాత వేద
మాతల సేవ యొనరించి
"ధన్య చరితుడ" వైతి వీవు.

"రామ" అనుచు, తారక
నామము మది తలచుచు
"స్వామి" అనగ, విరాగియై నామ

Scanned with CamS

ధేయమును, సార్థక పరచినావు
"మహర్షి" మలయాళ సద్గురుల
భక్తితో సేవించి మోక్ష
సామ్రాజ్యమును చేపట్టినావు.

వానప్రస్థము కోరి, చేరితివి
కాళహస్తి క్షేత్రము, నిర్మించి
తివి, ఆత్మారామాశ్రమంబు
నివసించితివి, భగవద్ధ్యాన తత్పరుడవై.

అది, మార్చి 23-1960, సం॥
ఏకాదశి పవిత్ర దినం, ఉ, 8. గం
సుప్రభాత సమయాన
ఓంకార ధ్యానమ్మున

ఆ, సచ్చిదానంద పర
బ్రహ్మములో "మిళిత" మైతి వీవు.

గీత॥ ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాం గతిమ్ ॥

ఆంధ్రదేశం, ఒక మహానాయకుని, త్యాగిని, ఆధ్యా
త్మిక తత్త్వవేత్తను కోల్పోయింది. ప్రజావాహిని
అశ్రుతర్పణముల నర్పించింది.

ఈ చరిత్ర శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు
శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల వారి
జననీ జనకుల చరిత్ర

వారియొక్క నిష్కామ కర్మాచరణ, చిత్తశుద్ధి, దైవప్రీతి, త్యాగనిరతిని భక్తకోటికిని, సాధనాపరులకును, వారి వంశీయులకును ఒకింత తెలుప నెంచి ఈ చరిత్ర రచించుట యైనది.

ఈ గ్రంథములో వాడిన గీతాశ్లోక తాత్పర్యములు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి స్థూలాక్షరీ భగవద్గీత నుండి సేకరించబడినవి.

మరియు మానసబోధ, తత్త్వసారము, రామాయణ రత్నాకరములనుంచి కొన్ని పద్యములు, శ్లోకములు సంగ్రహించబడినవి.

Scanned with CamS

పీఠిక

ఆదర్శ జననీజనకులు

ఈ చరిత్ర భగవదనుగ్రహం పొందిన చరిత్ర. ఈ చరిత్రను పార్శిల్‌గా కట్టి చీరాలవద్ద వేటపాలెం, అనే గ్రామంలో సాంబశివరావు అనే ఒక బాబా భక్తుని పూజాగృహంలో వుంచి మరునాడు చూడగా, పార్శిల్ విప్పకనే పేజీ పేజీకి సుగంధభరితమైన విభూతి చాలా ఎక్కువగా ప్రసాదించబడినది. ఇది భగవాన్ సత్యసాయి నిండు ఆశీస్సులతో జరిగినది. తదుపరి చూచిన ప్రతి ఒక్కరు విభూతిని స్వీకరించారు. ఆ పరిమళం ఒక సంవత్సరం వరకు వున్నది. ఇప్పటికీ కొన్ని పేజీలలో లోపలిభాగంలో విభూతి కనుపిస్తుంది. ఆ గృహయజమాని పూజా గృహంలో బాబా నిలువెత్తు పోటో వున్నది. ఏ పర్వదినం వస్తే ఆ రూపంతో ఆ పోటో విభూతితో డిజైన్ చేయబడినట్లు దర్శనమిస్తుంది. తదుపరి, పర్వదినానికి, ఆ విభూతియే అవతారంగా మారిపోతుంది. ఉదాహరణకు-

శివరాత్రికి - శివుని జటాజూటరూపం

దసరాకి - అమ్మవారి రూపం, కుంకుమరూపధారిణి

ముక్కోటికి - మహావిష్ణురూపము

క్రిస్మస్ - ఏసుక్రీస్తురూపం

ఈ విధంగా అన్నిరూపాలు తానే అని తెలుపుట. ఇది ఎంత అద్భుతమైన లీలా ప్రదర్శనయో ప్రజలు గ్రహించగలరు.

ఆ యా పర్వదినములలో చాలా ఎక్కువగా తేనె కూడ స్రవిస్తుంది. హరి! ఓం, తత్సత్

సాయి బాబా ప్రణాం అల్లా ఈశ్వర్ రాం
షిరిడీ బాబా ప్రణాం సబ్ ఘర్‌కే దేయి రాం
ఓ మేరి ఆత్మారాం స్ఫురణకరో మేరీ రాం
లేలో మేరే ప్రణాం పరమశాంత ప్రియ రాం

భారతభూమి కర్మభూమి, త్యాగభూమి, యోగభూమి, యాగభూమి.

రత్నగర్భ యని పేరు మోసినది భారతదేశం-జ్ఞానతేజోవిలసితులగు ఆధ్యాత్మిక రత్నములను, త్యాగశీలురను, నిష్కామ సేవాపరాయణులను, సాధుసత్పురుషులను కన్న కడుపుగాన భారతదేశమునకా పేరు ఎంతయేని తగియున్నది. అటువంటి మహనీయులు తాము తరించి ఇతరులకు మార్గదర్శకులగుచున్నారు.

" జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" మరియు
"త్యాగేనైకే అమృతత్వ మానశుః"

అను శ్రుతివాక్యముల ననుసరించి దేశసౌభాగ్యముకొరకు తమ ధన, మాన, ప్రాణములనర్పించిన త్యాగశీలురెందరో కలరు. అటువంటి మహనీయులలో నొకరు,

స్వర్గీయ, "బ్రహ్మశ్రీ" తూనుగుంట్ల-రామస్వామి, బి.ఏ.బి.ఎల్.గారు వారు సత్యధర్మపరాయణులు. శాంతిప్రేమ జీవనులు.

నిష్కామ కర్మాచరణగ -

దేశసేవ, సంఘసేవ, సాధు సత్పురుష సేవ యొనరించి జన్మధన్యత గాంచినవారు. 1885వ సం॥న రేపల్లె తాలూకా భట్టిప్రోలు గ్రామమున జన్మించినారు. బి.ఏ.బి.ఎల్. పట్ట భద్రులై తెనాలిలో ప్రఖ్యాత న్యాయవాదిగ నుండిరి.

Scanned with CamS

వారు వైదిక ధర్మజీవులు, వేదవిజ్ఞానమునందు సునిశిత పండితులు. అంతేగాక లోకమున వేదప్రతిపాదిత ధర్మజీవితమును, ఆదర్శముగ గడిపి తద్వారా పరమపురుషార్థము నొందుటే లక్ష్యముగా గలవారు. కావుననే తమ సత్యజీవితమునకును, ఆధ్యాత్మిక ప్రవృత్తికిని, లాయర్ వృత్తి అడ్డు రాగా దానిని అవలీలగ త్యజించి, దేశస్వాతంత్ర్యమునకు పాటుపడిరి. మరియు వేదప్రదిపాదిత ధర్మజీవితమున కనుకూలముగ సంఘమును సంస్కరించుటలో గణనీయమైన కృషి సల్పిరి.

మాతృశ్రీ

వారి ధర్మపత్ని భర్త అడుగుజాడలలో ధర్మార్థ, కామ, మోక్ష చతుర్విధ పురుషార్థములను తు.చ. తప్పక పాటించిన ఉత్తమ గృహిణి. వారి దాంపత్యము శబ్దార్థములవలె విడదీయరానిది. పాలూ, నీరు కలిసిన విధముగ అన్యోన్యత గాంచినది. అన్ని సేవారంగములయందును వారు చంద్రచంద్రికలవలె అవినాభావరూపులై మెలగిరి.

మా తండ్రిగారు ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత భాషలయందు బహుప్రవీణులు. పూర్వ జన్మసుకృతం వలన వారు విద్యార్థి దశనుండియే, పలువురు మహనీయులు రచించిన వేదాన్త గ్రంథములను ఉపనిషత్తులను, భగవద్గీతకు వ్యాఖ్యలను పఠించిరి. లోకమాన్య బాలగంగాధర తిలక్ రచించిన భగవద్గీతకు వ్యాఖ్య వారిని అమితముగా ఆకట్టుకొన్నది.

గీతా గ్రంథపఠనము చేసిన తరువాత వారు తమ జీవనవిధానంలో భగవద్గీతను ప్రమాణగ్రంథముగ తీసుకొని, దానిలోని సాధనలను ఆచరించుచు, వారి జీవనవిధానమే, భగవద్గీతకు భాష్యమా? అన్నట్లుగ తమని తాము తీర్చిదిద్దుకొన్నారు.

ఆ రోజులలోనే శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారు రచించిన శుష్కవేదాన్త తమో భాస్కరం, పాతంజల యోగశాస్త్రం, ఓంకారము, వివేకచూడామణి, ధర్మసేతువు మొదలుగాగల గ్రంథములను పఠించి, వారిని సేవించి, వారిని తమకు తగిన గురువుగ ఎన్నుకొనిరి. తదాదిగ వారి ఆధ్యాత్మిక ప్రవృత్తులు ద్విగుణీకృతములైనవి. ఇటువంటి ఆధ్యాత్మిక సంపత్తి పూర్వజన్మ సుకృతం వలననే కలుగునని గీత ప్రబోధించుచున్నది.

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ గీత-7-3

తా॥ అనేక వేలమంది మనుజులలో ఏ ఒకానొకడో మోక్షసిద్ధికై యత్నించుచున్నాడు. అట్లు యత్నించువారైన అనేకమందిలో ఏ ఒకానొకడు మాత్రమే నన్ను వాస్తవముగ తెలిసికొన గల్గుచున్నాడు.

వారు నవ విధ భక్తి మార్గములలో సేవను, ఆత్మనివేదనను ఎన్నుకొన్నవారై, సేవా మార్గములో ప్రవేశించిరి. తల్లి, తండ్రులు వివాహ మొనరించినను, లక్ష్యము భగవత్పాదారవిందములకే అర్పించి నిరాడంబరులై, కుటుంబమునంతను ఆధ్యాత్మికనియమనిష్ఠలతో తీర్చి దిద్ది గృహమును తపోవనము రీతి మలచిరి.

ఒకసారి సద్గురు మలయాళస్వాములవారు వారి గృహమునకు విచ్చేసిన సందర్భమున, ఆధ్యాత్మిక నియమ, నిష్ఠలతోగూడిన వారి గృహమును తిలకించి, అమందానందభరితులై,

"నివృత్తరాగస్య గృహం తపోవనమ్"

అనగ కోరికలు, ఆడంబరములు లేనివానియొక్క గృహము తపోవనముతో సమానమనియు, మరియు వారిని మహాజ్ఞానియైన

Scanned with CamS

జనకమహారాజుతో పోల్చి, తమరు సంసారమును, "తామరాకుమీది నీటి బొట్టు చందమున" నడుపుచున్నారనియు శ్లాఘించినారు.

శ్రీ, "మహర్షి" మలయాళస్వాములవారు శ్రీ వ్యాసాశ్రమ సంస్థాపకులు. వారు తిరుపతిలోని గోగర్భములో 12 సం॥ కఠిన తపశ్చర్యగావించి తపస్సిద్ధి పొందిరి. తదుపరి కొంతకాలమునకు ఆశ్రమమును స్థాపించ దలచినవారై, ఆంధ్రప్రజల భాగ్యవశమా? అన్నట్లుగా తిరుపతి, శ్రీకాళహస్తి మధ్యప్రదేశమైన "ఏర్పేడు" అను గ్రామంలో పర్వతశ్రేణి సమీపమున 1926లో "శ్రీ వ్యాసాశ్రమము" అను పేరిట ఆశ్రమమును స్థాపించిరి.

వారు కేరళ దేశీయులు, స్వభాష మలయాళము. స్వభాషయందేకాక సంస్కృత భాషయందును బహుప్రావీణ్యమును పొందిరి. వారి నామధేయం వేలప్ప. సామాన్యకుటుంబములో జన్మించినను, పూర్వ జన్మసుకృతం వలన వారు చిన్ననాటినుండియే, ఆధ్యాత్మిక భావములతో నుండెడివారు. 8 సం॥ ప్రాయములోనే గంటల తరబడి ధ్యాన నిష్ఠలో నిమగ్నులగుట అందరిని ఆశ్చర్యపరచెడిదట.

వారి గురుదేవులు శ్రీనారాయణ గురుదేవులు, నారాయణ గురుదేవుల శిష్యులైన శ్రీ సిద్ధ శివలింగప్ప స్థాపించిన ఆశ్రమములో చిన్నతనంనుండి శ్రీ వేలప్ప గురుకులవాసం చేస్తూ గీత, ఉపనిషత్తులు, వేదాంత గ్రంథాలు అభ్యసించారు. ఆధ్యాత్మిక శిక్షణ, సాధనలు పొందారు.

18 సం॥ ప్రాయములో వారు తీవ్రవైరాగ్యముతో తల్లి తండ్రులకు, తదితరులకు చెప్పకనే గృహము వీడి, పాదచారియై, దేశసంచారము గావించుకొనుచు అనేక పుణ్యక్షేత్రములను, పుణ్యతీర్థములను

సేవించుకొనుచు కొంతకాలమునకు ఆంధ్రుల పుణ్యక్షేత్రమైన తిరుపతి మహాక్షేత్రమును చేరిరి. ఈ యాత్ర పాదయాత్ర గాన కొన్ని సంవత్సరముల పాటు సాగినది.

అచట తిరుపతిలోని గోగర్భము తమ తపస్సాధనల కనుకూలమైన ప్రదేశముగ నెంచినవారై, అచటి ఆకులలుములతో చిన్నకుటీరము నేర్పరచుకొని ఇంచుమించు 13 సం॥ పాటు కఠిన తపశ్చర్య గావించిరి.

యాత్రికులెవరైనను గోగర్భ దర్శనమునకు వచ్చినవారు తీవ్ర తపో నిష్ఠలోయున్న శ్రీ స్వామిని చూచి కరుణార్ద్ర హృదయులై, తమ వెంట తెచ్చుకొన్న పండో, ఫలమో, తినుబండారమో శ్రీ స్వామికి అచ్చట సమర్పించి పోవుచుండెడివారు. లేని రోజు నిరాహారమే. ఈ విధముగానే 12 సం॥ల తపశ్చర్య కొనసాగి శ్రీ స్వామి తపస్సిద్ధి పొందినారు. వారి తపో ఏకాగ్రత ఆకలి దప్పులను మరపించినది. ఒకానొక సందర్భమున శ్రీవేంకటేశ్వర స్వామియే ప్రసాదం అందజేసినారని వారి చరిత్ర తెలుపుచున్నది.

ఈ దేశపర్యటన, యాత్రా సందర్శన కాలంలోనే వారు సంఘ స్థితిగతులను, ప్రజల మనస్తత్వాలను, అనాథలయొక్క దుఃస్థితిని, స్త్రీల పరిస్థితి, నిరక్షరాస్యతను సమగ్రముగ పరిశీలించినవారై, దేశ శ్రేయస్సును కోరి, వారి పరిరక్షణకై వారు తమ ఆశ్రమములో అనాథలకు శరణాలయమును, స్త్రీల ఉన్నతికై కన్యా గురుకులమును, సంస్కృత విద్యా వ్యాప్తికై ఉన్నత సంస్కృత పాఠశాలలను, ఆత్మ విద్యా వ్యాప్తికై బ్రహ్మ విద్యా పాఠశాలలను, కుల, మత వ్యవస్థల కతీతంగా స్థాపించి, వారికి తగిన విద్యా బుద్ధులతోపాటు, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక శిక్షణలనొసగి ఉన్నతులుగ తీర్చి దిద్దుచున్నారు.

వారు కర్మయోగి, వారి తపఃఫలమును ఈ విధముగ సంఘాభివృద్ధికి

Scanned with CamS

ధారపోసిన కరుణామయులు. సంఘసేవయే సర్వేశ్వరసేవ అని తలచినవారు.

సర్వభూతస్థ మాత్మానం సర్వ భూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥ గీత 6-29

తా॥ ఆత్మైక్యము నొందిన యోగి, సమస్త చరాచర ప్రాణికోట్లయందు సమదృష్టిగలవాడై, తన్ను సర్వభూతములందున్నవానిగను, సర్వభూతములు తనయందున్నవిగను చూచుచున్నాడు.

వారి కరుణా పరిపూర్ణ హృదయం జాతి, కుల, మత వ్యవస్థల కతీతమై, సర్వవ్యాపకమై, శరచ్చంద్రబింబమైనది.

వారు మలయాళ సంస్కృత భాషలయందేకాక ఆంధ్రభాష యందును మిగుల పాండిత్యము పొందిరి. అనేక వేదాన్త గ్రంథములు తెలుగులో రచించిరి. 1919లో రచించిన మొదటి గ్రంథం శుష్క వేదాన్త తమో భాస్కరం. అసలు వేదాన్తమును నిరూపిస్తూ శుష్కవేదాన్తులకు కనువిప్పు కలిగించిన గ్రంథం, ప్రజాదరణపొంది శ్రీవారి కీర్తిప్రతిష్ఠలు పెంపొందించిన గ్రంథం.

వారి తురీయాశ్రమ నామధేయం "అసంగానందగిరి స్వామి". మలయాళ దేశీయులుగాన ప్రజలు "మలయాళస్వామి" అని పిలుచుట కలవాటుపడి ఆపేరే శాశ్వతనామధేయముగ నిలిచిపోయినది.

వారి తల్లి తండ్రుల నామధేయం నొట్టియమ్మ, కరియప్పలు. వారి జన్మస్థానం కేరళ రాష్ట్రంలోని గురువాయూరికి సమీపమున ఎన్గండ్యూరు అనే గ్రామం.

ఆ మహనీయులే, తండ్రిగారికీ, మరియు వారి తనయులకూ గురుదేవులు మహర్షి సద్గురు శ్రీమళయాళస్వాములవారు,

ఓం, గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥

యస్యాత్మభూతస్య గురోః ప్రసాదాత్
అహం విముక్తోఽస్మి శరీర బంధనాత్ ।
సర్వోపదేష్టుః పురుషోత్తమస్య
తస్యాంఘ్రిపద్మం ప్రణతోఽస్మి నిత్యమ్ ॥

తండ్రిగారు వారు తరించినదియే కాక తమ తృతీయ పుత్రులు ఆనంద మోహనుని ఆధ్యాత్మిక శిక్షణకై "మహర్షి" శ్రీ సద్గురు మళయాళస్వాములవారి చరణ కమలసన్నిధికి సమర్పించిరి. వారును ద్విగుణీకృతోత్సాహముతో గురుసన్నిధి చేరి అనేక కఠిన నియముల నాచరించుచు 12 సం॥లు కఠిన తపశ్చర్య గావించిరి.

ఈ సాధనా కాలములోనే వారు, శ్రీ, గురుదేవుల కోర్కెమేరకు, యోగవాశిష్ఠ మహాగ్రంథమునకు తెలుగు అనువాద మొనర్చినారు. ఆ గ్రంథమును శ్రీ వ్యాసాశ్రమమువారు ముద్రించినారు. మరియు వారు బుద్ధగీతను కూడ అనువదించినారు.

శ్రీ ఆనందమోహనులు 1933 లో బందరు (మచిలీపట్నం) నోబుల్ కాలేజీలో తమ 17 వ ఏటనే బి.ఏ. గణిత శాస్త్రంలో పట్టభద్రులైరి. బందరు నోబుల్ కాలేజీవారు పెట్టిన భగవద్గీత, బైబుల్ పోటీపరీక్షలో ప్రథమ, ద్వితీయ స్థానములను గెలుచుకొనిరి. బైబిల్, ఖురాన్ లో కూడ బహుమతులు పొందారు. వారు విద్యార్థి దశలోనే అనేక సంవత్సరములు అపక్వాహారమును

Scanned with CamS

సేవించుచు, గాయత్రీ మహామంత్రము, పంచాక్షరీమంత్రము జపించుచు, తమ విద్యార్థి దశ అతి పవిత్రముగ, ఆదర్శముగ గడిపినారు. శ్రీ భగవద్గీత, కఠోపనిషత్ వారికి కంఠపాఠములు, అనేక వక్తృత్వ, రచనా వ్యాసంగము లందును, రాట్నము, తకిలీనూలు, వడుకు పోటీ యందును, స్వర్ణ, రజత, పతకములను బృహద్గ్రంథ రాజములనేకము, బహుమతులుగా గెలుచుకొనిరి. వారు ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత, హిందీ భాషా కోవిదులు.

వారు కాశీలోని విద్యాపీఠమునందు "కోవిద్" అనే హిందీ, డిగ్రీ కోర్సు చదువుచున్నరోజులలో ఆ విద్యాపీఠములో కాంగ్రెస్ సమావేశము(1935)లో జరిగినది. ఆ సమావేశమునకు శ్రీ గాంధీ మహాత్ముడు, వల్లభబాయ్ పటేల్, రాజేంద్రప్రసాద్ మున్నగు నాయకులందరు విచ్చేసిరి. అపుడు గాంధీ మహాత్ముని బస యొద్ద, ఆనందమోహనులను అధికారులు వాలంటీరుగ ఏర్పరచినారు. ఆసమయమున గాంధీగారి దినచర్య, గీతాపారాయణం, నూలు వడకుట, క్రమశిక్షణ స్వయముగ గాంచుట తటస్థించినది. అది వారి నెంతో ఆకర్షించినది. అది వారి భావిజీవితమునకు ఆదర్శవంతమైనది. మరియు ఆ విద్యాపీఠమునందు వీరి సంపాదకత్వమున "తపోభూమి" అను మాసపత్రిక ప్రాచీన పద్ధతిలో వ్రాతప్రతులుగ ప్రారంభింప బడినవి. వారిని గూర్చిన మరికొన్ని వివరములు ముందు చరిత్రలో తెలుపబడినవి.

12 సం॥ తపస్సిద్ధి అనంతరం గురుదేవులు వారికి తమ వ్యాసాశ్రమములో సనాతన సన్యాస,వైదిక పద్ధతి ననుసరించి పంచాహ్నికాగ్ని హోత్ర విధిని (ఐదుదినములు) సన్యాస దీక్షా కార్యక్రమమును, 1947-సర్వజిన్నామ సంవత్సర ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు జరిపిరి.

తదుపరి కొంతకాలమునకు వారు శ్రీకాళహస్తీశ్వర సన్నిధి, పవిత్ర

స్వర్ణముఖి తీరాన శ్రీ శుకబ్రహ్మాశ్రమమను పేరిట ఆశ్రమమును 1950-విరోధినామ సంవత్సరంలో గురుదేవుల ఆశీస్సులతో స్థాపించిరి. వారు తమ ఆశ్రమములో ఈశ్వరాలయము, గీతాభవనముతోపాటు, "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అని తలచి ఉచిత నేత్ర వైద్యాలయమును, శ్రీ త్రినేత్ర భక్త కన్నప్ప పేరిట స్థాపించి సంఘమునకు మహోపకారమొనర్చిన కరుణామూర్తి, మరియు వారు భగవద్గీతకు 1100, పేజీలుగల ఎనలేని గొప్పవ్యాఖ్యను గీతామకరందమను పేరుతో రచించారు. 108, గీతా మహాజ్ఞాన యజ్ఞములను, అనేక గీతాసప్తాహము లను, గీతా ప్రవచనములను, సరళరీతిని, ఉపమానకథలతో ప్రబోధములు చేసినారు. మరియు వేదాంతగ్రంథములను క్రోడీకరించి, పంచరత్నా కరములనుపేరిట ఐదు బృహద్గ్రంథములను రచించారు. వేదాంత భేరి అను మాసపత్రిక ద్వారా అనేక ఆధ్యాత్మిక ప్రబోధలు ప్రజలకు అందజేయుచున్నారు. ఆనాటి ఆనంద మోహనులే తురీయాశ్రమమున, శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములుగా, తమ గీతాప్రబోధలద్వారా జ్ఞాన భాస్కరులుగా ఆంధ్ర, తమిళ, కర్నాటక, తెలంగాణ రాష్ట్ర వాసులకు సుపరిచితులు.

తండ్రిగారి శిక్షణలో తల్లిగారు అపర గార్గి, మైత్రేయి, మదాలసల వలె ఆత్మ తేజాన్ని పొందినారు.

సాధారణముగ స్త్రీలు తమ తనయులు పట్టభద్రులై విదేశములకేగి, ధనమార్జించి, కీర్తిప్రతిష్ఠలు పొందగా, ఘనమైన సంబంధములు తెచ్చి, కట్న కానుకలతో వివాహముచేయ సంకల్పించుచుందురు. కాని ఈ మహాతల్లి "అధ్యాత్మ విద్యా విద్యానాం", అనియు, మరియు "చదువులన్ని చదివి చావంగనేటికి చావులేని చదువు చదువ వలయు", అని తలచినవారై తమ తనయుని ఆధ్యాత్మిక శిక్షణకై గురుదేవుల యొద్దకు పంపుటకును,

Scanned with CamS

సన్యాస దీక్షకును, మహదానందముతో అనుజ్ఞ ఇచ్చిన ఉత్తమ జనని.

(భారతీయ వైశ్య పత్రిక నుండి సంగ్రహింపబడినది)

శ్రీ, ఆనంద మోహనుని సన్న్యాసదీక్షా కార్యక్రమం సంక్షిప్త వివరములు.

ప్రథమ దినము - 1947 వ సం॥ జూన్-29 సర్వ జిన్నామసం॥ ప్రథమ దినము - తీర్థయాత్ర, ఆషాఢ శుద్ధ ఏకాదశి, హిందువులకు మహాపర్వదినము (తొలి ఏకాదశి) సన్యాసులకు చాతుర్మాస్యారంభము. ఈ దినము బ్రహ్మముహూర్తమున ప్రతి గ్రహీత బ్రహ్మచారి ఆనంద మోహన్‌గారు గురుదేవుని యనుజ్ఞను బడసి, కొందరు భక్తులు సన్యాసులు హరేరామ మంత్రోచ్చారణ సహితులై, వెంటరాగా కాలినడకన శ్రీవ్యాసాశ్రమమునుండి బయలుదేరి, 8 మైళ్ళ దూరమున నున్న శ్రీ కాళహస్తి పుణ్యక్షేత్ర తీర్థమునకు యాత్ర చేసిరి. ఆనాడు స్వర్ణముఖి పావన తోయముల స్నానమాచరించి, శ్రీ సత్యజ్ఞాన ప్రసూనాంబా సమేత శ్రీ కాళహస్తీశ్వరుని సందర్శించి, ఆ దినమంతయు ఆ క్షేత్రమున గడిపి, ఆ రాత్రికి తమ స్వస్థల ప వ్యాసాశ్రమమునకు హరేరామ మంత్ర స్మరణ బృందముతో తిరిగి వచ్చిరి.

రెండవ దినము - మాతృదేవి యనుజ్ఞ, ఉదయం 9.30 మొదలు 10.30 మధ్య సింహలగ్నమున బ్రహ్మచారి ఆనందమోహన్ తమ గురుదేవులు, ఆచార్యులు, యతులు, పండితులు, భక్తులు, భక్తురాండ్రు, సంస్కృత కళాశాలా విద్యార్థులతో కూడిన మహా సమావేశమునకు ప్రదక్షిణ నమస్కారమొనర్చి ఆ సభామధ్యమున నిలచియున్న తన తల్లియగు శ్రీమతి సుశీలాదేవిగారికి సాష్టాంగ వందన మొనర్చి ఆమె నిట్లు ప్రార్థించెను.

మాతః సన్యాస మిచ్ఛామి, దేహ్యనుజ్ఞాం శుభాం హి మే ।
సన్యాసేనైవ నిర్వాణమితి వేదాన్తనిశ్చయః ॥

ఈ ప్రార్థనకు తల్లి తన యంగీకారము నిట్లొసంగెను

1. సాధువత్స, త్వయా ప్రోక్తం
యథేచ్ఛసి తథా కురు ।
యతః సన్న్యసనాత్తాత!
సఫలం జన్మ మామకమ్ ॥

2. పితరం మాం చ లోకాంశ్చ
స్వాత్మానం వంశమేవ చ ।
పితౄన్ దేవాం స్తథా సర్వాన్
ఉద్ధర త్వం గుణాంబుధే ॥

ఓ పరిశుద్ధాత్మ స్వరూపులారా! నా పుత్రడు ఆనందమోహన్ తాను సన్యాసాశ్రమమును స్వీకరింపనిచ్చగించి ఇందుకై విధిననుసరించి తల్లి యైన నా అనుమతి అవసరమని కోరినందున అట్టి నా అనుమతిని నేనిపుడు హృదయపూర్వకముగ మహదానందముతో నొసగుచున్నాను. మాతాపితరులకు తెలియకగాని, వారి సమ్మతి లేకగాని, వెడలిపోయి సన్యాసమును స్వీకరింపబోవువారి విషయముననే తల్లితండ్రుల యంగీకారము అవసరము కావచ్చును. గౌతమ బుద్ధుడు, ఆదిశంకరులు రమణ మహర్షి, ఇంక మరికొందరు మహనీయులు తమ జననీ జనకుల యంగీకారమును బడయలేక గృహములనుండి వెడలిపోయిరి. వీరిలో ఆదిశంకరులు కొన్ని ఉపాయములను పన్ని ఎంతయో కష్టముతో తల్లిని ఒప్పించవలసివచ్చెను. కాన అట్టి వారి విషయమై, సన్యాస స్వీకారమునకు వారి తల్లిదండ్రుల స్వేచ్ఛా పూర్వక అనుమతి అవసరమని భావింపబడెను.

అయితే నా కుమారుని అనేక జన్మార్జిత పుణ్యకర్మ పరిపాకవశమున, ద్వాదశవత్సరముల క్రిందటనే తల్లితండ్రులమైన మేము మా కుమారునకు

Scanned with CamS

స్వామి వివేకానందుని జీవితరహస్యములను బోధించి బుద్ధిపూర్వకముగ వానిని సన్యాసమునకు ప్రేరేపించి గృహమునుండి సాగనంపితిమి.

న కర్మణా, న ప్రజయా ధనేన
త్యాగేనైకే అమృతత్వ మానశుః ॥

అను శ్రుతి వాక్యమును బట్టి జీవన్ముక్తిసుఖము నిచ్చు సన్న్యాసము యొక్క మహిమను ఏనాడో మాబిడ్డకు మేము బోధించితిమి.

నేడు ప్రేషోచ్చారణ పూర్వకముగ జరుగు నాకుమారుని పరమహంస విద్వత్సన్యాస స్వీకార సమయమున, పూర్వము ద్వాదశాబ్దముల క్రిందట మేమొసంగిన యనుమతిని తిరిగి ఈ సుదినమున బ్రహ్మానందముతో ధ్రువపరచి మేము కృతకృత్యుల మగుచున్నారము.

ధన్యా మాతా, పితా ధన్యో
గోత్రం ధన్యం కులోద్భవః ।
ధన్యా చ వసుధా దేవీ
యత్ర స్యాద్గురుభక్తతా ॥

ఈ వాక్యము మా యందు సార్థకమైనదని ఎవరైన భావించినచో, ఆ యోగ్యత మా సద్గురు సార్వభౌమ సకల చరాచర సుఖాభిలాషి ప్రేమానంద స్వరూపపరమహంస పరివ్రాజకాచార్య వర్య, శ్రీ వ్యాసాశ్రమ స్థాపక, ఉపనిషదుద్యాన కేళీకలకంఠ, శ్రీ అసంగానందగిరిమలయాళస్వాములవారి నిర్హేతుక జాయమాన కరుణా కటాక్ష లబ్ధము గాక అన్యమేమై యుండనోపు?

శ్రీవారి పాద సరోజములకు ప్రణమిల్లుచు నా కుమారుని విద్వత్సన్యాసమునకు విధి ననుసరించి నేనిప్పుడీయవలసిన యనుజ్ఞను నా హృదయ పూర్వకముగ నొసగి ధన్యనగుచున్నదానను.

నా యొక్క ఈ జన్మలోనేగాక శత సహస్ర జన్మలలో సహితము నేను చేయగల పవిత్ర కార్యము ఇంతకన్న ఏది యుండగలదు? కరుణామయుండగు సర్వేశ్వరుం డనుగ్రహించుగాక!

పుత్రరత్నమా! ఈ సన్యాస స్వీకారం వలన స్వామి వివేకానందవలె నీవును తరించి, “తథా సర్వాన్ ఉద్ధర త్వం గుణాంబుధే” అన్నట్లు ఇతరులను గూడ తరింపజేసియు, నీ సద్గురుమూర్తి యొక్క(ఋణ) విమోచనము కావించియు, నీ జన్మసఫలమొనర్చు కొనెదవుగాక!

ఓం త త్స త్

ఈ ప్రకారముగ తల్లిగారి అనుమతి బడసిన పిమ్మట, ప్రతి గ్రహీత దేవతాదర్శన ప్రాయశ్చిత్తాది విధులద్వారా పవిత్రతను సంపాదించుకొనెను.

మూడవదినము :- అగ్ని ప్రతిష్ఠాపన, అష్టశ్రాద్ధములు

మూడవ దినము గణపతి పూజ, విష్ణుప్రభృతి దేవతా పూజనం, నవగ్రహ పూజ, హెూమము జరిగిన పిమ్మట అష్టనాందీముఖ శ్రాద్ధములు, ఎవరెవరిని గూర్చి చేయబడెననగా !

1. బ్రహ్మ విష్ణు మహేశ్వరాణాం దేవశ్రాద్ధః
2. దేవర్షి బ్రహ్మర్షి క్షత్రియర్షి ప్రభృతానాం ఋషిశ్రాద్ధః
3. వసు రుద్రాదిత్యానాం దివ్యశ్రాద్ధః
4. సనకసనందనాదీనాం మనుష్యశ్రాద్ధః
5. పృథివ్యాది పంచమహా భూతానాం చక్షురాది రేకాదశః కరణాం చ భూతశ్రాద్ధః
6. పితృ, పితామహ, ప్రపితామహానాం పితృశ్రాద్ధః

Scanned with CamS

7. మా పితృపితామహ, ప్రపితామహానాం మాతృశ్రాద్ధః

8. స్వస్యవా -ఆత్మనో, అన్తరాత్మా, పరమాత్మనోవా ఆత్మశ్రాద్ధః

ఈ ప్రకారముగ, ప్రతిగ్రహీత ఆనంద మోహన్ దేవ ఋషి పితృ మనుష్య భూతాది సర్వులకు తాను చేయవలసిన తుది కర్మకాండను జరిపి, సజీవులైయున్న తన తల్లితండ్రులకు కూడ వారి సమక్షమునందే వారికి శ్రాద్ధములు జరిపి పిండప్రదానము చేసియుండుటేగాక, తుదకు తన శ్రాద్ధమునుకూడ తానే జరుపుకొని సర్వులయొక్క కర్మ ఋణ విమోచనము చేసుకొన్న సంఘటనలు అచ్చట సమావేశమైయున్న భక్తకోటిని పులకాంకిత శరీరులుగ నొనర్చి వేసెననుటలో సందియము లేదు. అటు పిమ్మట బ్రహ్మాండ తర్పణ మొనర్చ బడెను.

నాల్గవదినం - మంత్రదీక్ష, మౌనము, ఉపవాసము.

ఐదవరోజు - తురీయాశ్రమ స్వీకారము, ప్రేషోచ్ఛారణ తదుపరి నూతన నామకరణం (సన్యాసమును స్వీకరించారు) గురుదేవులు నూతన నామధేయమును -శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి అని యొసగి, దండ కమండల పాదుకాద్వయ, కాషాయవస్త్రములను సమర్పించి ధరింపచేసిరి.

తదుపరి యోగపట్టా ఇవ్వబడెను.

అనగ సన్యాసాధికారము-దేవాలయప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, శంకుస్థాపన, మంత్రోపదేశ అధికారము మొదలగాగల పవిత్ర కార్యాధికారముల నొసగుట.

అహం సర్వేషణాం త్యక్త్వా యుష్మచ్ఛరణ మాగతః ।
త్రాహి మాం సర్వ లోకేశ గతిరన్యా న విద్యతే ॥

సన్యస్తం మే జగన్నాథ పాహి మాం మధుసూదన ।

అహం సర్వాభయం దత్వా భూతానాం పరమేశ్వర !
యుష్మచ్ఛరణ మాపన్నః పాహి మాం పురుషోత్తమ ॥

అని ప్రార్థించెను.

విష్ణుహస్తే యథా చక్రం, శూలం శివకరే యథా ।
ఇంద్రహస్తే యథా వజ్రం, తథా దండ భవాద్య మే ॥

నాల్గవ, ఐదవ, దినముల యొక్క కార్యక్రమము, మంత్ర మంత్రార్థాలు చాలా వున్నవి. ఇది పీఠికగాన, క్లుప్తంలో క్లుప్తంగా తెలుపబడినది. కాన ఈ ప్రకరణమును ముగించుచున్నాను.

ఈ విధముగ ఈ కార్యక్రమము ఐదుదినములు సశాస్త్రీయముగ పవిత్రముగ జరుపబడెను. తల్లితండ్రులు ఇష్టపూర్వకముగ జరిపించు ఈ పవిత్ర కార్యక్రమము తిలకించుటకు భక్తులు, భక్తురాండ్రు అనేకమంది అనేక తావులనునుండి విచ్చేసి, ఆనందాశ్చర్యసంభ్రమములతో తిలకించి ధన్యులైరి ।

శ్రీ సద్గురువుల యాహ్వానమునను సరించి, విజయవాడ, మద్రాసు, బెంగుళూరు, బౌరంగిపేట, కడప, కాళహస్తి, రాజంపేట, ప్రొద్దుటూరు, నెల్లూరు, గుంటూరు, చిత్తూరు, తిరుపతి మున్నగు అనేక ప్రాంతములనుండి ముఖ్య భక్తులందరు ఈ మహాక్రతువునకు విజయము చేసి ఐదు దినములు నిలిచి సన్యాసగ్రహణ కర్మజ్ఞాన కలాపము నంతను స్వయముగ వీక్షించి శ్రీ స్వాములవారి బోధామృతమును గ్రోలి సంతృప్త మానసులై స్వస్థలములకు వెడలిపోయిరి.

ఓం తత్సత్

Scanned with CamS

ఈ ఆధ్యాత్మిక విద్య సామాన్యమైన చదువుల వంటిది కాదు. పూర్వజన్మ సుకృతం, స్వయంకృషి, దైవప్రీతి, ఆత్మానుభూతి, దైవకృప, ఇవన్నియు తోడైననే కాని ప్రాప్తించనేరదు.

బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే ।
వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥ గీత 7.19

అనేక జన్మలయొక్క అంత్యమున మనుజుడు జ్ఞానవంతుడై, సమస్తము వాసుదేవుడే యను సద్బుద్ధిని గల్గి నన్ను పొందుచున్నాడు. అట్టి మహాత్ముడు లోకములో చాలా అరుదు అని గీతావాక్యము.

తండ్రిగారు వారు తరించి పుత్రుని తరింపచేసినారు. ఆ పుత్రుడు లోకోత్తర మహాత్కార్యములను నెరవేర్చి, సంఘమునకు మహోపకార మొనగూర్చినారు.

శ్రీ ఆనందమోహనుల సన్యాస దీక్షా సమయములో శ్రీమలయాళగురుదేవులు నిండు సమావేశములో ఈ విధముగ ప్రవచించినారు.

తల్లితండ్రులు, బుద్ధిపూర్వకముగ తనయునకు ఆధ్యాత్మిక ప్రబోధనలు, ఆధ్యాత్మిక శిక్షణ గరపి సన్యాస స్వీకారమునకు మహదానందముతో అనుజ్ఞ ఇచ్చిన ఘట్టము చరిత్రలోనే జరగలేదనియు, ఇది చరిత్రలోనే "సువర్ణాక్షరములతో" లిఖించదగ్గ సన్నివేశమనియు నొక్కి వక్కాణించిరి.

సహజముగ తల్లితండ్రులు పుత్రులను సన్యాసమునకు ఒప్పుకొనరు. మరియు శంకరాచార్యులవారు మొదలు అనేక మంది

మహనీయులు అనేక ఉపాయములతో సన్యాసమునకు శ్రమ పడవలసి వచ్చినదనియు, తనకును ఇటువంటి భాగ్యము కలుగక తల్లితండ్రులకు చెప్పకనే గృహము వీడి వచ్చిన సందర్భమును గుర్తుచేసిరి.

1950 సం॥తో, తండ్రిగారు తలపెట్టిన కార్యములన్నీ నిర్విఘ్నముగ నెరవేరినవి. దేశసేవ, సంఘసేవా కార్యక్రమములు పూర్తియైనవి.

వారు వృద్ధులైన కారణముగా వానప్రస్థాశ్రమములో వుండాలనుకొని 1951, ప్రాంతములో పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి తీరాన, శ్రీ శుకబ్రహ్మాశ్రమ సమీపమున మూడు ఎకరముల మామిడితోటను సొంత వ్యయముతో ఏర్పరచుకొని, అందు ఆత్మారామ ఆశ్రమమును అందులో సుశీలా మందిరమను పేరిట చిన్న కుటీరమును నిర్మించుకొని భగవద్ధ్యాన నిష్ఠులై కాలం గడుపుచుండిరి.

పితృదేవుని అస్తమయం

అది 1960, మార్చి-23, పవిత్ర ఏకాదశి దినమున వారికి భగవానుని పిలుపు అందినది. ఉదయం 8 గం॥ల సమయం విభూతి స్నానమాచరించి, విభూతి రేఖలు ధరించి మూడు పర్యాయములు ప్రణవోచ్చారణతో వారు తమ భౌతిక కాయాన్ని విడనాడి పరమాత్మ సన్నిధికేగిన ధన్యజీవులు. వారు 75, సం॥లు కాలం మాత్రమే జీవించినారు. వారి ఏకాదశి మరణమే, వారి ఉన్నతిని, పవిత్రతను చాటుచున్నది.

ప్రయాణకాలే మనసాఽచలేన భక్త్యా యుక్తో యోగబలేన చైవ ।
భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ స తం పరం పురుషముపైతి దివ్యమ్॥
గీత 8-10

Scanned with CamS

తా॥ ఎవడు భక్తితో కూడుకొనినవాడై, అంత్యకాలమునందు యోగ బలముచే ప్రాణవాయువును భ్రూమధ్యమున బాగుగ నిలిపి, ఆ పిదప సర్వజ్ఞుడైన పురాణపురుషుని ఎడతెగక చింతించునో, అతడు దివ్యస్వరూపుడైన సర్వోత్తముడగు ఆ, పరమాత్మనే పొందుచున్నాడు.

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్మామనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాం గతిమ్ ॥

గీత 8.13

ఎవడు ఆత్మను గూర్చిన ఏకాగ్రచింతనము గలవాడై ఓర్పు, అను అక్షరమును ఉచ్చరించుచు శరీరమును వదలునో అతడు సర్వోత్తమ స్థానమును పొందుచున్నాడు.

తండ్రిగారి అనంతరం తల్లిగారు 27 సం॥ కాలం జీవించినారు. వారు ఆత్మారామ ఆశ్రమములోనే వాన ప్రస్థజీవితమును, ధైర్యముగ, ఆదర్శముగ గడుపుచు, ఆశ్రమవాసులకు తల్లియై తగిన సలహాల నందించుచు, భక్తజనులకు బోధలు సలుపుచు, అపరశారదామాతవలె తన తుది జీవితమును పుణ్యప్రదముగ గడిపిన ఆదర్శ గృహిణీమతల్లి.

తదుపరి అది 1987, సం॥ జూన్ 1వ తేదీ పంచమీ తిథి సూర్యభగవానుడు తన సర్వకళలను లోకాన ప్రసరిస్తున్న శుభసమయం మధ్యాహ్నం 1 గంట.

అగ్నిర్జ్యోతి రహఃశుక్ల షణ్మాసా ఉత్తరాయణమ్ ।
తత్ర ప్రయాతా గచ్ఛన్తి, బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥ గీత 8.24

అగ్ని, ప్రకాశము, పగలు, శుక్లపక్షము, ఆరు నెలలుగ ఉత్తరాయణము ఏమార్గము నందు గలవో, ఆ మార్గము నందు వెడలిన

బ్రహ్మవేత్తలగు జనులు ఆ పరబ్రహ్మమునే పొందుచున్నాను.

ఆ మహాతల్లి, 90, సం॥ వృద్ధురాలు కృష్ణ కృష్ణ నామోచ్చారణతో, ఆ, నందనందనుని పాద సన్నిధికి చేరిపోయినారు. వారి ఆరాధ్యదైవం, బాలమురళీకృష్ణుడు. అంతిమసమయంలో భగవన్నామము నోట పలకటమే, జన్మరాహిత్యస్థితిని తెలియచేయుచున్నది.

అన్తకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేబరమ్ ।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥

గీత 8-5

తా॥ ఎవడు మరణకాలమునగూడ నన్నే స్మరించుచు, శరీరమును విడిచి పోవుచున్నాడో, అతడు నా స్వరూపమును పొందుచున్నాడు. ఇట సంశయము లేదు అని గీతా వాక్యము.

ఈ విధముగ ఈ జననీజనకులు నిష్కామ కర్మమార్గమున భగవత్కృపను పొందిన ధన్యజీవులు. చరితార్థులు.

అట్టి మహిమాన్వితులు, సర్వవ్యాపకుడగు భగవంతునికి, జననీ జనకులకు పాఠకులకు వందనము లాచరించుచు పీఠికను ముగించు చున్నాను.

పరమ సాధ్వీమతల్లి (సాధు) మాతృ సుశీలాదేవి భర్త ధర్మ కార్యాలకెల్ల తోడునీడయై, త్యాగియై, విరాగియై, ఆదర్శియై, వెన్నంటి "సహధర్మ చారిణి" నామమునకే, వన్నె తెచ్చె, శోభగూర్చె,

ఒక సద్గురువునకు తల్లియైన, ఈ మహాతల్లి భర్త తదనంతరం వారి అడుగుజాడల్లో, ఆ ఆశ్రమములోనే 27 సం॥ వానప్రస్థ జీవితకాలమును, ధైర్యముగ, శాంతముగ గడుపుచు, మహిళాలోకానికి

Scanned with CamS

మణిపూసయై, ఆశ్రమవాసులకు అమ్మయై తగిన సలహాలనందించుచు, భక్త జనులకు బోధలు సలుపుచు, సాధు సత్పురుషుల ఆదరించుచు, అతిథి అభ్యాగతులకు అన్నపూర్ణయై, ఆదర్శమునకు శారదా మాతయై, ఓర్పునకు భూ మాతయై 90, సం॥లు వృద్ధాప్య దశలో అనేక శారీరక బాధలున్నను చిరునవ్వు చెదరనీక భక్తజనులను కుశలప్రశ్న లరయుచు, ఆదర్శ జీవితము గడిపిన సాధుచరిత, సుశీల అను, నామధేయమును సార్ధక పరచిన ఉత్తమ గృహిణీమతల్లి.

"మహర్షి" మలయాళ సద్గురువులను భక్తితో సేవించిన పరమభక్తురాలు.

మాతృదేవి అస్తమయం

అది భవవైద్యులు స్వామి గాని, భౌతిక వైద్యులుకాని ఆశ్రమములో లేని సమయం.

1987, జూన్ -1 వ తేదీ,మధ్యాహ్నం 1 గం, సూర్యభగవానుడు తన సర్వకళలను లోకాన ప్రసరిస్తున్న శుభ సమయం, ఆ, మహాతల్లి కృష్ణ కృష్ణ నామోచ్చారణతో, ఆనంద నందనుని పాద సన్నిధికి చేరిపోయినారు.

అందరికి మాతయై, భూమాత ఒడిలోన ఒదిగి పోయె,
భక్తుల కన్నీరు కాల్వలాయె। ఆ, దృశ్యము భరించలేని భాస్కరుడు
అస్త్రాద్రికి ఒరిగి పోయె, మహా తల్లి శాశ్వత సమాధికి చేరిపోయె,

యం యం వాపి స్మరన్‌భావం త్యజత్యన్తే కలేబరమ్ ।
తం తమేవైతి కౌన్తేయ సదా తద్భావభావితః ॥ గీ. 8-6

అర్జునా! ఎవడు మరణకాలమున, ఏ ఏ భావమును

చింతించుచు(లేక రూపమును) దేహమును వీడునో, వాడట్టి భావన యొక్క స్మరణముచే గలిగిన సంస్కారము గలిగియుండుటవలన ఆయా రూపమునే పొందుచున్నాడు.

మహిళాలోకం కన్నీటి తర్పణము అర్పించినది.

శ్రీ మాతృదేవి స్మృతి

కాయమ్ము వీడి, కమలాక్షునితో
    కలసిపోయె,
గిరిధారి ఒడిలో చేరిపోయె, జనన
    మరణ చక్రభ్రమణమున
సుదూరమైతివి, ఇల
    ధన్యురాలివమ్మ నీవు ధన్యురాల !

సద్గుణములె, ఆ భూషణములుగ
    ధరియించిన భాగ్యశాలి
చెంతచేరు భక్తులను ప్రేమతో
    పలకరింతువు
సద్విషయము లెన్నియొ తెలిపి
    వారల నానందపరతువు
అట్టి అమ్మ ఏది? ఇపుడు
    అమ్మకై విలపించితి !

కన్నీరు కారె, నాదు సోదరులార !
    తెలుపరె,

Scanned with CamS

అమ్మ ఎచట? మన అమ్మ ఎక్కడ?
నీవైన తెలుపవె, సోదరీ !

విశ్వ మంతయు వ్యాపించి
ప్రకాశించుచున్న
ఆ, అమరజ్యోతి, ఆ విశ్వ
జ్యోతిలో
మిళితమైన నీవు, ప్రకాశించు
చున్నావమ్మ
నీకిదె, నా వందన శతమ్ములు

అమ్మకు నా నమస్కారములు
ఇ. సరోజినీదేవి, పుట్టపర్తి ఆశ్రమం
8-7-87, మండలారాధన సందర్భమున పంపిన స్మృతి

తత్త్వసారము

గీత విద్యను చదువుకోరన్నా
అద్దానియందున ఉపనిషత్తుల సారముందన్నా
గీత వాక్యము స్మరణ చేయుచు
గీత బోధను ఆచరించుచు
కృష్ణవాణిని మదిని దలచుచు
బ్రహ్మధామము చేరు రయమున

తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురుని చెంతన నిజముగ లాభముందన్నా ॥

రచన - విద్యాప్రకాశానంద

మానస బోధలోని పదము

భువిలోన జీవుడు
మోక్షంబు నొందుటకు
గీతబోధయె చాలు మనసా!
గీత తత్త్వము నెల్ల
క్షుణ్ణముగ తెలుసుకొని
భవసాగరము దాటు మనసా!
సంసార కూపమున
దిక్కు తోచకయుండి
విలపించుటేలనో మనసా!
గురుపాదముల బట్టి
తత్త్వంబు తెలుసుకొని
తప్పించు కో ఓయి మనసా!

రచన - విద్యాప్రకాశానంద

Scanned with CamS

ఆదర్శ జననీ జనకులు - చరిత్ర

ఆధ్యాత్మిక ప్రవృత్తి

స్వర్గీయ,"బ్రహ్మశ్రీ" తూనుగుంట్ల-రామస్వామి బి.ఏ.బి.యల్, గారు శ్రీమతి సుశీలాదేవిగారు మా జననీ జనకులు.

వారు వరమ వవిత్రులు, పూజ్యులు, చిరస్మరణీయులు, ఆదర్శదంపతులు.

ఆధ్యాత్మిక భావములు కల వారు నిష్కామ కర్మమార్గమున భగవత్కృపను పొందదలచినవారై, సేవామార్గమును చేపట్టిరి.

ధ్యానేనాత్మని పశ్యన్తి కేచిదాత్మాన మాత్మనా ।
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే ॥ గీత 13-25

ఆత్మను కొందరు శుద్ధమగు మనస్సుచే ధ్యానయోగము ద్వారా తమయందు గాంచుచున్నారు. అట్లే, మరికొందరు సాంఖ్యయోగముచేతను, ఇంక కొందరు కర్మయోగము చేతను చూచుచున్నారు(అనుభూత మొనర్చుకొనుచున్నారు).

వారు ఆచరణలో కర్మయోగమును ఎన్నుకొన్నారు. అదియే, భగవత్ప్రేమకు పరాకాష్ఠ. దేశసేవయే మాతృసేవగా, సంఘసేవయే సర్వేశ్వర సేవగా, దీన జనసేవయే పరమాత్మసేవగా దృఢముగా విశ్వసించినారు. "పరోపకారార్థం ఇదం శరీరం" అని తలచి దేశాభ్యుదయమునకు తమ జీవితకాలము పాటుపడినారు.

మత్కర్మకృన్మత్పరమో మద్భక్త స్సంగవర్జితః ।
నిర్వైర స్సర్వభూతేషు యస్స మామేతి పాండవ ॥ గీత 11.55

తా॥ ఎవడు, నా కొరకే కర్మచేయునో(లేక దైవసంబంధమైన కర్మల నాచరించునో) నన్నే పరమ ప్రాప్యముగ నమ్మియుండునో, నా యందే భక్తి కల్గియుండునో, సమస్త దృశ్య పదార్థములయందును సంగము (ఆసక్తిని, మమకారమును విడిచివేయునో) సమస్త ప్రాణులయందును ద్వేషము లేక యుండునో, అట్టి వాడు నన్ను పొందుచున్నాడు.

జనకుడు మున్నగు మహనీయులు కర్మమార్గము చేతనే మోక్షమును పొందినట్లు భగవద్గీత బోధించుచున్నది. కావుననే వారి పేరు గీతయందును, గీతా మాహాత్మ్యము నందును వినుతికెక్కినది.

కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః ।
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ॥ గీత 3-20

తా॥ జనకుడు మున్నగువారు నిష్కామ కర్మమార్గము చేతనే మోక్షమును పొందిరి. జనులను సన్మార్గమున ప్రవర్తింపచేయు నుద్దేశ్యము కొరకే నీవు కర్మలను చేయుటకే తగియున్నావు.

జననము

తండ్రిగారు 1885వ సం॥న రేపల్లె తాలూకాలోని భట్టిప్రోలు గ్రామమునందు సదాచార సంపన్నులు, సద్వంశీయులు, భగవద్భక్తి తత్పరులు అగు కీ॥శే॥ తూనుగుంట్ల-నాగభూషణం, నాంచారమ్మ పుణ్యదంపతులకు ద్వితీయ పుత్రరత్నమై జన్మించిరి. శ్రీ నాగభూషణంగారు గొప్ప శివభక్తులు. శివపూజా కైంకర్యముల నొనర్చుచు, శివనామస్మరణ సదా గావించుచు, తమ విధ్యుక్త ధర్మములను నిర్వర్తించుకొనుచుందురు. రుద్రాక్షలు వారి కంఠాభరణములు, తల్లి నాంచారమ్మగారు కరుణామయి,

Scanned with CamS

సాధుసత్పురుషులను సేవించుచు నిత్యాన్నదాత్రియై, భర్త ధర్మకార్యాలలో చేదోడువాదోడుగ వర్తించుచు, తమ నిత్య విధులను నెరవేర్చుకొను చుందురు. అట్టి వారి గృహమున-

"శుచీనాం శ్రీమతాం గేహే"

అను గీతా సూక్తి ననుసరించి తండ్రిగారు జన్మించుటచేత వారికి చిన్ననాటినుండియే అనేక దైవగుణములు అభివృద్ధి అగుచు వచ్చినవి. తత్కారణమున వారు భగవదన్వేషణ చిత్తులై, విద్యార్థి దశనుండియే పలువురు మహనీయులు రచించిన వేదాన్త గ్రంథములను, స్వామి రామతీర్థులు, వివేకానంద, రమణమహర్షి, శివానంద మొదలుగాగల మహనీయుల గ్రంథములును, భగవద్గీతకు వ్యాఖ్యలను పఠించుచు వచ్చిరి.

భగవద్విశ్వాసము కలవారు పఠించుటయేకాక, క్రియారూపమును దాల్చుచు సాధనలు చేయుచు వచ్చిరి. ఆధ్యాత్మిక గ్రంథ పఠనము చేసినవారు.

"యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి" మరియు,
"అంతశ్చరతి భూతేషు గుహాయాం విశ్వమూర్తిషు" అని గ్రహించారు

విద్యాభ్యాసము

వారి బాల్యవిద్య రేపల్లె యందును, బి.ఏ. బందరు నందును, బి.యల్. డిగ్రీని మద్రాసు పచ్చియప్ప కళాశాలయందును అభ్యసించిరి. వారు ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత భాషలయందు బహుప్రవీణులు, వేదవేదాంగ పారంగతులు. వారు అతి గంభీరులు. వారి నేత్రములు కార్యదక్షతను, కార్యదీక్షను సూచించుచుండును.

ఉపనయనము

తల్లి తండ్రులు వారికి 9 సం॥ ప్రాయములోనే ఉపనయన సంస్కారము గావించిరి. తదాదిగ వారు గాయత్రీమంత్రోచ్చారణ గావించుచు పరిశుద్ధాంతరంగులైనారు.

ఓమ్

ప్రథమ వివాహము

తండ్రి శ్రీ నాగభూషణంగారు తమ పుత్రులు రామస్వామిగారికి 1907 లో ఒంగోలు వాస్తవ్యులు శ్రీ నల్లమల్లి రామానుజం బి.ఏ., బి.ఎల్. గారి పుత్రిక సౌందర్యవతియైన రంగనాయకమ్మ అనే కన్యతో వివాహం జరిపారు.

మరుసంతవ్సరం వారికి పండంటి పుత్రరత్నం, మేలిమి బంగారు ఛాయను ధిక్కరిస్తూ జన్మించాడు. బంధుమిత్రులందరూ అమందానంద భరితులైనారు. కాని విధి కాటేసింది. ఆ తల్లికి పురిటిలోనే, సూతికావాతం సోకి పిల్లవాని ఏడవరోజు స్వర్గస్థురాలైంది. బంధుమిత్రులు ఎంత ఆనందించారో అంతకు వదిరెట్లు క్రుంగిపోయారు. జరగరానిది జరిగిపోయింది. పిల్లవాడు తల్లిపాలకు నోచుకోలేదనే బాధ, అందరిని కలచివేసింది. ఆ తల్లి పిల్లవానిని కంటారా చూచుకోనేలేదు. కడుపారా పాలివ్వనేలేదు. విధిరాతకు అందరు విధిని నిందించారు. ఇక చేసేదేమీ లేక వారి పూర్వజన్మసంబంధం అంత వరకే వున్నదేమో అని సరిపెట్టుకొన్నారు. శ్రీనాగభూషణంగారు పిల్లవానిని, అమ్మమ్మ, తాతయ్య సంరక్షణలో అయిదారు సంవత్సరాలుంచారు. తిరిగి వారి వివాహమైన తదుపరి పిల్లవానిని తెచ్చుకొన్నారు. ఆ పిల్లవానిపేరే "రంగనాథం". పెరిగి

పెద్దయి వాడు బి.ఏ.బియిడ్. కోర్సు చదివి, స్కూల్‌టీచర్‌గా చేరాడు. వాడి క్రమశిక్షణ. సత్యసంధత గ్రహించిన స్కూల్‌యాజమాన్యం తదుపరి హెడ్‌మాస్టర్‌గా, కాలేజీ లెక్చరర్‌గా, కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్నతపదవుల్లో నియమించింది. అన్నింటినీ బాధ్యతతో నిర్వహించి రిటైరైనాడు. ఇంచుమించు నూరు సంవత్సరాలు ఆరోగ్యంగా జీవించి హఠాన్మరణం పొందాడు. తల్లి, తన తనయునకు తన ఆయుష్షునిచ్చి సర్వదా కాపాడింది. వారి తుది దశవరకు వారి శరీరకాంతి ఇసుమంతయైనను తగ్గలేదు.

ద్వితీయ వివాహము

1907 వ సం॥రంలో రామస్వామిగారికి తల్లితండ్రులు తిరిగి వివాహము నిశ్చయించారు. మచిలీపట్టణ వాస్తవ్యులు, శ్రీరామ భక్తాగ్రేసరులు, బి.ఏ, పట్టభద్రులు ఐన శ్రీ గోకవరపు ఉమామహేశ్వరరావుగారి ద్వితీయపుత్రిక సుశీలాదేవి అను కన్యనిచ్చి వివాహము గావించిరి. శ్రీ ఉమామహేశ్వర రావుగారు, భక్తి పరులైన తండ్రిగారిని అల్లునిగ బడసి ధన్యులైరి. కాలక్రమేణ వారికి ఐదుగురు పుత్ర సంతానము, ముగ్గురు, పుత్రికా సంతానము కల్గిరి. ఆ కాలము“సంతానమే సౌభాగ్యమని” ఎంచిన కాలము.

ఉద్యోగము

వారు 1909 నుండి 1921 వరకు ఉద్యోగ ధర్మమును గుంటూరు జిల్లాలోని తెనాలి, బాపట్లలో ప్రఖ్యాత న్యాయవాదిగ నెరవేర్చిరి. ఆధ్యాత్మిక భావములు కల వారికి లాయర్ వృత్తి నచ్చనిదైనది. న్యాయమైన కేసులనే చేపట్టుచున్నను వారి కది అన్యాయ వృత్తిగనే తోచుచుండెడిది, అట్టి వారి

మనసులో అనేక దైవభావములు ఉత్పన్నములైనవి.

ప్రతి జీవి ఎన్ని జన్మలెత్తినను ఒకానొకనాడు హృదయ పరిపక్వము గావించుకొని ఆ భగవంతుని చేరవలసినవారే, తగిన కృషి సల్పి అది ఈ జన్మలోనే ఎందులకు పొందరాదు? నదులు ఎన్ని వంకరలు తిరిగినను, ఆ సముద్రుని చేరవలసినవే కదా!

ఆపూర్యమాణమచలం ప్రతిష్ఠం
సముద్రమాపః ప్రవిశన్తి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే
స శాన్తి మాప్నోతి న కామ కామీ ॥ గీత 2-70

తా॥ జలముచే సంపూర్ణముగ నిండింపబడినదియు, నిశ్చలమైనదియునగు సముద్రమును నదీజలము మున్నగునవి యేప్రకారము ప్రవేశించుచున్నవో, ఆ ప్రకారమే భోగ్యవిషయులన్నియు ఏ బ్రహ్మనిష్ఠుని పొంది(అతనిని వికృతము చేయలేక) అణగిపోవుచున్నవో, అతడే పరమ శాంతిని పొందునుగాని విషయాసక్తి కలవాడు కాదు. మరియు

“జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ”

గీత 2-27

పుట్టిన వానికి చావు తప్పదు. చచ్చిన వానికి పుట్టుక తప్పదు.

పునరపి జననం పునరపి మరణం
పునరపి జననీ జఠరే శయనమ్ ।
ఇహ సంసారే బహుదుస్తారే
కృపయా పారే పాహి మురారే ॥

Scanned with CamS

ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున
మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥ గీత 8-16

ఓ అర్జునా! బ్రహ్మలోకము వరకు గల లోకములన్నియు తిరిగి వచ్చెడి స్వభావము కలవి(అనగా వానిని పొందిన వారు మరల జన్మమెత్తవలసియే వచ్చును) నన్ను పొందినవారికి మరల జన్మమే లేదు.

ఈ విధముగ వారి మనోభావములు సాగినవి.

అట్టి, డోలాయమాన పరిస్థితిలో భారతమాత కన్నీరు వారి మానసిక తులాదండమును, ఆధ్యాత్మికం వైపునకే మొగ్గు చూపినది. పరదేశ హస్తగతమైన "మాతృభూమిని" రక్షింప మనసు ఆరాటపడినది. దేశసేవ, సంఘసేవ కార్యక్రమాలు చేపట్ట కృతనిశ్చయులైనారు.

అది 1921వ సంవత్సరం. స్వాతంత్రోద్యమము ద్విగుణీకృత మగుచున్న రోజులు, శ్రీ మహాత్మాగాంధి స్వాతంత్ర్యోద్యమమునకు, సర్వప్రజానీకమునకు పిలుపు నిచ్చియున్నారు."ఓ భారతీయులారా! మీమీ, స్వధర్మములను విడిచియైనను, మాతృభూమియైన భారతభూమిని రక్షించుకొనవలసిన సమయమాసన్నమైనది. లెండు! నడుం బిగించుడు, సాత్విక సమర రంగమున ప్రవేశించుడు" అని ఉద్బోధి గావించినారు.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" మరియు
"త్యాగేనైకే అమృతత్వమానశుః"

అను, శ్రుతి వాక్యములను తలంచినవారై, తండ్రిగారు తమ ప్రఖ్యాతి వహించిన న్యాయవాద వృత్తిని అవలీలగ త్యజించి, దేశమాత పరదాస్య నివృత్తికి (దేశ సేవకు) కంకణబద్ధులైరి.

అప్పటికి వారి సంతాన మంతయును 14 సం॥ముల లోపు వయసు వారే.

అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యు పాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥గీత 9-22

ఎవరు, ఇతర భావము లేనివారై నన్ను గూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లపుడు నాయందే నిష్ఠగలిగి యుండునట్టి వారియొక్క యోగక్షేమములను నేను వహించుచున్నాను.

అను గీతా వాక్యమును, దృఢముగ విశ్వసించినవారై సేవాకార్యక్రమములలో ప్రవేశించిరి.

వారు తమ ఆధ్యాత్మిక సాధనలకును, దేశసేవా కార్యక్రమముల కును, సంఘసేవకును, విజయవాడను కేంద్రముగ ఎన్నుకున్నవారై తమ మకామును విజయవాడలోని పవిత్ర కృష్ణవేణి నదీ తీరము, కనక దుర్గమ్మ ఆలయ సన్నిధికి మార్చుకొనిరి.

నూతన గృహమును నిర్మించుకొని దానికి "ఓంకారనిలయము" అని పేరు పెట్టుకొనిరి. వారు ప్రణవోపాసకులు, నిరాకార సచ్చిదానంద పరబ్రహ్మ వాచకమైన, ఓంకారమును సదా ధ్యానించుచుందురు. కాన వారి గృహమునకు ఓంకార నిలయమని, వారి రచనలకు ఓంకార గ్రంథమాలా ప్రచురణలనియు, వారి తృతీయ పుత్రిక కు ఓంకార వివేక చూడామణి అనియు నామధేయముల నిడిరి. దేవాలయములో నిత్య, దర్శన మును స్మరణీయము గావించుకొనిరి. మరియు వారి సంతానమునకును, సంతతికిని మహనీయుల పేరులను, పవిత్రగ్రంథముల నామధేయములనిడి ఆనందానుభూతిని పొందిరి.

Scanned with CamS

జాతీయోద్యమము

వారు జాతీయోద్యమములో శ్రీ గాంధి మహాత్మునితోను తదితర మహానాయకులతోను, ఉత్తర ప్రత్యుత్తరములను జరుపుచు, సభలు సమావేశముల నేర్పరచుచు, విదేశీ వస్త్రశాలల వద్ద పికిటింగ్‌లను జరిపించుచు, ఉద్యమాన్ని పటిష్ఠమొనరించిరి. మరియు జయ జయ నినాదములతో ప్రజావాహినిని ముందుకు నడుపుచు కదం త్రొక్కించినారు. ఈ సేవాకార్యక్రమములతో వారు ఆంధ్రప్రాంతమంతయు సంచరించి కార్యక్రమములను ఏర్పాటు చేసిరి.

మరియు వారి సంతానమునంతను, జాతీయ సేవలో, స్వచ్ఛంద సేవకులుగను, కార్యకర్తలుగను, తల్లిగారిని స్త్రీలతరపున వక్తగను పాల్గొనునట్లు నియమించిరి.

వారి దేశసేవ, సంఘసేవా కాలంలో వారి గృహము రాజకీయ నాయకులతోను, కార్యకర్తలు, సంఘసంస్కర్తలు, సాధుపుంగవులు, అతిథి అభ్యాగతుల ఆగమనములు కుటుంబసభ్యులతో కళ కళ లాడుచు, నిత్యకల్యాణమై యొప్పుచుండెడిది. వారి జాతీయ కార్యక్రమములన్నియు వ్రాయుట ప్రయాసగాన ముఖ్యమైన ఒకటి, రెండు, సంఘటనలు మాత్రమే వ్రాయుచున్నాను.

ఆ రోజులలో బ్రిటీష్ ప్రభుత్వం, మహానాయకులందరిని, ఏవో కొన్ని కుయుక్తులు పన్ని కారాగార బందీలుగ నొనర్చుచుండెడివారు. వీరిని బంధించవలెనని కుయుక్తులు పన్ని అరెస్టు వారెంట్ తెచ్చినారు. సత్యసంధులైన తండ్రిగారు తానే ముద్దాయిగా, తానే లాయర్‌గా వాదించుకొని తన సత్యవాదోపవాదములతో కోర్టును దద్దరిల్లచేసి, ప్రభుత్వం

వారిని నిశ్చేష్టులను, అచేతనులను చేసిన సందర్భముగ లెన్నియో కలవు. వారిని 27 సం॥ జాతీయోద్యమ సేవాకాలంలో బందీలు చేయవలెనెడి వారి కుయుక్తులు వమ్మైనవి.

1934 లో స్వాతంత్రోద్యమ సందర్భముగా, శ్రీ గాంధీ మహాత్ముడు విజయవాడ విచ్చేసిన సందర్భమున తండ్రిగారి కార్యదక్షతను, కార్యదీక్షను మిగుల ప్రశంసించిరి.

ఆ రోజున విజయవాడలోని మొగల్‌రాజపురంలో గాంధీ మహాత్ముని బహిరంగసభ ఏర్పాటైనది. అనేక పల్లె పట్టణములనుండి ప్రజలు గాంధీ మహాత్ముని సందేశం వినుటకు తండోపతండములుగ విచ్చేసిరి. బ్రహ్మాండమైన స్టేజి ఏర్పాటయినది. గాంధీగారు తదితర ప్రముఖులు స్టేజిమీద ఆసీనులైరి.

ఆ సభకు ప్రార్థనా గీతం, మా తృతీయ సోదరులు శ్రీ ఆనంద మోహన్‌గారు(ఈనాటి విద్యాప్రకాశానందగిరి స్వాములవారు) మాతృతీయ సోదరి, సరోజినీదేవిగారు పాడారు.

ఆ రోజులలో విజయవాడలోని మొగల్ రాజపురంలో హిందీప్రచార సభవారి హిందీ విద్యాలయమందు వీరిరువురు హిందీ "విశారద" కోర్సును, అభ్యసించుచున్నారు. కాన ఆ స్కూల్ విద్యార్థులు ఆ సభకు ప్రార్థనా గీతం జాతీయగీతం పాడుటకు ఏర్పాటు చేసినారు.

మొదట ప్రార్థనా గీతం,

"గాయియే గణపతి, జగవందిత శంకరసుత భవానీ నందన" అను గణపతి ప్రార్థనను వీరు పాడగ తదుపరి "భారత జనని తేరేజయ్, తేరె, జయహెూ" అనే, జన్మభూమిని గూర్చిన జయగీతి, తదుపరి

జాతీయగీతమైన "జనగణమన అధినాయక జయహే"

భారత భాగ్యవిధాతా, అను గీతికను అతిశ్రావ్యంగ బృందగానం చేశారు, స్టేజికి అటు ఇటు ఆరేసి మెట్లు అమర్చారు. ఆ మెట్లకు బారులు దీరి, ఈ విద్యార్థులు స్త్రీలు ఒక వైపు, పురుషులు ఒక వైపు నిలబడి ప్రార్ధనాగీతం గానం చేశారు. ఆ దృశ్యం మరపురానిది.

అపుడు నావయసు 9 సం॥ములు, ఆ సన్నివేశాన్ని ఆశ్చర్యంగా, ఆసక్తిగ గమనిస్తూ స్టేజికి దగ్గరగా వాలంటీర్‌డ్రస్‌లో యున్నాను. విద్యార్థులందరు తెల్లని ఖాదీ పైజమా, షర్టు, గాంధీటోపీ, బేడ్జీలు, జేబులకు చిన్న కాంగ్రెస్ జండా ధరించారు. విద్యార్థినులు జండా అంచు తెలుపు ఖద్దరు చీరెలు ధరించి స్టేజికి అటు ఇటు పూలమాల లమర్చినట్లుగా నిలబడినారు.

గాంధిగారు తమ ప్రసంగాన్ని గంభీరంగా మొదలు పెట్టినారు, సభానంతరం గాంధిగారు విద్యార్థులను ప్రశంసించారు, ఆనాటి సభ జయప్రదంగా ముగిసినది.

ఆధ్యాత్మిక భావములు కల తండ్రిగారు, నిరాడంబరులై తమ గృహములోని, వెండి, స్టీలు, ఇత్తడి మొదలుగా గల వస్తుసామగ్రిని తొలగించి, వాటి స్థానంలో మృణ్మయ పాత్రలను ప్రవేశపెట్టిరి.

విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాన్తి మధిగచ్ఛతి ॥ గీత 2-71

ఎవడు సమస్తమైన కోరికలను శబ్దాది విషయములను త్యజించి వానియందేమాత్రము ఆశ లేక ఆహంకార మమకార వర్జితుడై వర్తించునో అట్టివాడే పరమశాంతిని పొందుచున్నాడు.

తండ్రిగారు ఈ మృణ్మయపాత్రలను సంఘములోను ప్రవేశపెట్ట తలచినవారై ఒక కుమ్మరివానికి తగు శిక్షణ బోధించి అనేకమైన గృహపరికరములను అందమైన ఆకృతిలో, చిత్ర విచిత్ర రీతులతో తయారు చేయించిరి.

వాటిలో దేవతార్చన సామగ్రియైన అరివేణం, పంచపాత్ర, ఉద్ధరిణి, స్త్రీలకు పూలసజ్జ, కుంకుమ భరిణె, గంధపుగిన్నె, పన్నీరు బుడ్డి, తాంబూల సేవనానికి తమలపాకులపెట్టె, సున్నంసీసా, వక్కపొడి డబ్బా, మరియు వంటసామగ్రియైన ఇడ్లీగిన్నె, టిఫిన్‌కారియర్లు, తదితర సామగ్రి అంతయు, ఆకుమ్మరివాడు ద్విగుణీకృతోత్సాహంతో, రాజమహేంద్రవరపు ఎర్రమన్నుతో తయారుచేసి, అతి సుందరంగా నగిషీ పనితనంతో పాలిష్ పెట్టినాడు. అవి బంగారు వన్నెతో ధగ ధగాయమానంగా మెరసిపోవుచున్నవి.

గాంధిగారు విజయవాడ వేంచేసిన సందర్భమున, తండ్రిగారు ఆ వస్తుసామగ్రిని వారి చేతితో వేలంపాట పెట్టించినారు. గాంధిమహాత్ముని చేతితో వేలంపాట గాన ప్రజలు పాటధర పెంచేసినారు అవి అన్నియు, దాదాపు ఆనాటి వెండిధరకు అరగంట వ్యవధిలో అమ్ముడు పోయినవి.

మహామహులందరు మృణ్మయపాత్రలను గృహములో ప్రవేశపెట్టినారు గాన ప్రజలందరు ఆనాడు తమ గృహములో ప్రవేశపెట్టిరి. క్రొత్త ఒక వింతయని కొందరు, స్వల్ప వ్యయముతో గృహనిర్వహణ జరుపవచ్చని కొందరు, అది ఒక ప్యాషన్ అని కొందరు ప్రవేశపెట్టిరి.

ఆ కుమ్మరి వానికి ఆర్డర్స్ ఎక్కువై, అసిస్టెంట్సుని వేసుకోవలసిన అవసరం ఏర్పడింది. వాని జీవనోపాధి పెరిగినందులకు అతను మిగుల సంతసించినాడు. తండ్రిగారు (అమ్మకమునకు వచ్చిన) ఆ ధనమును కాంగ్రెస్ పార్టీ ఖర్చులకు సమర్పించినారు.

Scanned with CamS

ఈ విధముగా తండ్రిగారు నిరాడంబరతను తాము పాటించి సంఘములో కూడ ప్రవేశపెట్టిరి. పెద్దవారు ఏ కార్యము నొనర్చిన, తక్కినవారును ఆ కార్యమునే అవలంబింతురు, అని గీతావాక్యం.

యద్యదాచరతిశ్రేష్ఠ సత్తదేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥ గీత 3-21

గొప్పవాడే కర్మను చేయునో దానినే తక్కిన వారును చేయుదురు. అతడు దేనిని ప్రమాణంగా గైకొనునో తక్కినవారును దానినే అనుసరింతురు. పైన తెల్పిన 'వేలంపాట కార్యక్రమము విజయవాడలోని కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారి గృహఆవరణలో ఏర్పాటైనది.

తండ్రిగారు జాతీయోద్యమములో తలమునకలైనను, తమ ఆధ్యాత్మిక సాధనలను ఇసుమంతయైనను వదలక ద్విగుణీకృత మొనర్చుచునే యుండిరి. వారు తమ శయనమునకు కొయ్యతో చేసిన బల్లను మార్చు కొన్నారు.

వారు తమ ఆడంబరమైన లాయర్ దుస్తులను విడనాడి మూడు గజముల ఖద్దరు కొల్లాయి వస్త్రమును ఆజన్మదీక్షగ ధరించిరి. గృహస్థాశ్రమములోనే, అరిషడ్వర్గములను అరికట్టి, శమదమాదులను లోబరచుకొని, పంచేంద్రియనిగ్రహాన్ని పొంది, అపక్వాహారమును సేవించి, మౌనవ్రతమును పాటించి, ఈ జన్మమునందే జన్మరాహిత్య మోక్షసిద్ధికి అఖండ కృషి నల్పిరి. వారు ఏవిధముగ ఇంద్రియములను నిగ్రహించినారనగ,

యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః ।
ఇంద్రియాణీన్ద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ గీత 2-58

తాబేలు తన అవయవములను లోనికి ముడుచు కొనునట్లు, యోగి ఎపుడును తన ఇంద్రియములను ఇంద్రియార్థములగు విషయములనుండి సర్వత్ర వెనుకకు మరల్చుచున్నాడో, అపుడాతని జ్ఞానము మిగుల స్థిరమైనది యగును. అతడు స్థిత ప్రజ్ఞుడగును. ఈ విధముగా వారు కృతకృత్యులైరి.

సాధారణముగ, సాధకులు ఏకాంతప్రదేశముల కేగియు, పర్వతప్రాంతములకు, ఆశ్రమములకు వెడలియు, ఇంద్రియ నిగ్రహము బడసివచ్చి తిరిగి వారు వ్యవహారములలో ప్రవేశించుచుందురు. ఇది, కొంత సులభమార్గము. ఎందులకనగా! అక్కడ జిహ్వాచాపల్యము, మనశ్చాంచల్యము కలిగించు పదార్థములేవి ఎదురుగ నుండవు.

కాని, తండ్రిగారు పదిమంది సభ్యులుగల సంసారంలో వివాహాది శుభకార్యములు, బంధుమిత్రుల విందు వినోదములు, అతిథి అభాగ్యతుల ఆగమనములమధ్య తమ సాధనలను, ఏ మాత్రము త్యజించక నిశ్చల మనస్కులై ఆచరించుట సామాన్యమైన విషయము కాదు. అన్ని ఇంద్రియములలోకి జిహ్వేంద్రియము, గుహ్యేంద్రియము మహా బలవత్తరమైనవి. ఎంతయో ఆత్మ నిగ్రహము కావలెను. ఆ రెండు వారు అరికట్టిరి. వారి ఆఖరి సంతానం కలిగిన తరువాత ఆజన్మబ్రహ్మచర్యం అవలంబించిరి. అప్పటికి వారి వయసు 40 సం॥ మాత్రమే. వారు అపక్వాహారమును సప్తసంవత్సరములు పాటించిరి. అపక్వాహారమనగ నానపోసిన గోధుమలు, శెనగలు కలిసి రెండు గుప్పెళ్ళు తురిమిన పచ్చికొబ్బరి ఒక గుప్పెడు రెండు అరటిపండ్లు, మాత్రమే, బుట్టలు, బుట్టలు పండ్లు భుజించుట కాదు.

ఈ సాధనలన్నియు వారు గృహస్థాశ్రమములోనే నిర్వహించి నారనగ ఎంత నిగ్రహశక్తి కలిగియుండవలెనో పాఠకులు ఊహించగలరు.

Scanned with CamS

కావుననే మలయాళస్వాములవారు వారిని, వారి గృహములను సందర్శించి"నివృత్తరాగస్య గృహం తపోవనం" అని శ్లాఘించిరి.

యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ గీత 6-17

మితమైన ఆహారము, విహారము కలవాడును, కర్మలందు మితమైన ప్రవర్తన కలవాడును, మితమైన నిద్ర, జాగరణ కలవాడునగు మనుజునకు యోగము(అనగ జనన మరణాది సంసార) దుఃఖమును పోగొట్టునది అగుచున్నది.

తండ్రిగారు తమ జాతీయసేవ, సంఘసేవాకాలంలో 16 ఉత్తమ గ్రంథాలు రచించారు. వారు ఏ లౌకిక గ్రంథమును రచించినను, ఆధ్యాత్మికముతో మిళిత మొనర్చి అది ఒక అపూర్వ గ్రంథరాజముగ రచించుట వారి ప్రత్యేకత. వారి గ్రంథములు "ఓంకార గ్రంథమాలా ప్రచురణలు"గా ప్రచురించిరి. వారి తదనంతరం అవి రీప్రింట్ లేక కాల గర్భములో కలిసిపోవుట చాలా విచారకరము.

జాతీయోద్యమ సేవాకాలంలో ఖాదీ తత్త్వము, ఖద్దరు ప్రచార చరిత్ర అను రెండు గ్రంథములు రచించారు. అవి, రాట్నము మరియు ఖద్దరు యొక్క ప్రాశస్త్యం, ఆధ్యాత్మికమును మేళవించి అపూర్వగ్రంథరాజములుగా రచించారు. రాట్నము దానియొక్క ఇరుసు, ఆకులు, కదురు దానియొక్క సూత్రమును గూర్చి జ్ఞానపరంగా వ్రాసినారు. మరియు రాట్నము ఒడుకునపుడు వచ్చు కదురు యొక్క శబ్దాన్ని వారు ఓంకారనాదంగా భావించి మానసిక ధ్యానమొనర్చుకొనెడివారు. ఆ సందర్భములో వారు "ప్రణవపూజ" అను పూజా పుస్తకమును రచించినారు.

మరియు " భర్గా గౌరీ పూజా విధానం" అను పూజా పుస్తకమును రచించి, రాట్నమును గౌరీ దేవిగ భావించి బాహ్యపూజ, మానసిక పూజ యొనర్చుకొనవచ్చునని స్త్రీలను సమావేశపరచి పూజాకార్యక్రమము జరిపించిరి. ఈ పూజా కార్యక్రమము ఆరోజులలో విజయవాడలోని కొత్త గుళ్ళల్లో ఏర్పాటు చేసిరి. ప్రజలకు కరపత్రములద్వారా, పత్రికాముఖంగానూ ఆహ్వానము తెలియచేయబడెను.

స్వాతంత్ర్యోద్యమకాలంలో దాదాపు ప్రతిగృహమున రాట్నములతో నూలు ఒడికెడివారు. కాన విజయవాడలోని స్త్రీలు తమ తమ రాట్నములను, పసుపు, కుంకుమ, గంధములతో అలంకరించి, పుష్పహారములమర్చి కొత్తగుళ్ళలోని విశాలమండపముల, బహిరంగప్రదేశముల, బారులు తీరి కూర్చొనిరి. వారు పూజా కార్యక్రమమును మైకులో చదివి చేయించిరి. ప్రతిరాట్నమువద్ద, ధూప, దీప, నైవేద్య, మంగళ, దివ్య నీరాజనము లర్పింపబడినవి. ఈ కార్యక్రములో స్త్రీలు కార్తీకపున్నమినాటి పూజలకంటె, మిన్నగ ఉత్సాహముతో భక్తిప్రపత్తులతో, క్రమశిక్షణతో పాల్గొనిరి.

ఈ నూతన పవిత్ర కార్యక్రమమును తిలకించ విజయవాడ పౌరులనేకులు విచ్చేసి, ఆనందాశ్చర్యసంభ్రమములతో వీక్షించి పులకిత గాత్రులైరి. పూజానంతరం వారు భర్గాగౌరీపూజా మహిమను గూర్చి ఉపన్యసించిరి. ఈ సేవలో వారు పూజావిధాన పుస్తకమును ఆగంతుకులకు ఉచితముగ అందజేసిరి. ప్రసాద వినియోగానంతరం ప్రజలు ఈ కార్యక్రమమును వేనోళ్ల కొనియాడుచు గృహోన్ముఖులైరి.

ఈ విధముగ వారు ప్రతిసేవా కార్యక్రమమును (కర్మయోగమును) ఆధ్యాత్మికముతో మిళిత మొనర్చి, ప్రజలలో దైవ విశ్వాసమును కర్మ, జ్ఞాన,

Scanned with CamS

మార్గములందభిరుచిని పెంపొందించుచు వారిలో ఆధ్యాత్మిక చైతన్యమును ద్విగుణీకృత మొనర్చిరి. వారికి సర్వము బ్రహ్మమయముగ దర్శితమగు చుండును,

సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥ గీత 6-29

తా॥ యోగముతో కూడిన మనస్సు కలవాడు(ఆత్మైక్యము నొందిన యోగి) సమస్త చరాచర కోట్లయందును సమదృష్టికలవాడై, తన్ను సర్వభూతముల యందున్నవానిగను, సర్వభూతములు తనయందున్నవిగను చూచుచున్నాడు.

మరియు,

కర్మజం బుద్ధి యుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబన్ధ వినిర్ముక్తాః పదం గచ్ఛన్త్యనామయమ్ ॥ గీత 2-51

సమత్వ బుద్ధితో కూడిన వివేకవంతులు కర్మములనొనర్చుచున్నను వాని కలహమును త్యజించివైచి జనన మరణరూపమగు బంధము నుండి విడుదలను పొందినవారై దుఃఖ రహితమగు మోక్షపదవిని బొందుచున్నారు.

సంఘసేవా కార్యక్రమములు

1. గో సేవ

శ్రీరామస్వామిగారు సంఘసేవా కార్యక్రమములలో మొదట గోవధను నిషేధించుచు కార్యక్రమములు చేపట్టినారు.

నిమ్నజాతులవారి ఆహారమునకై గోవధ విపరీతముగ జరుగుచుండెడిది. దానిని అరికట్టుటకు వారు బహు కృషి సల్పినారు.

హిందూ ధర్మశాస్త్రంలో గోవు అతి పవిత్రమైనదిగ, పూజ్యమైనదిగ తెలుపబడినది. గోమహిమను గురించి శాస్త్రములలో అనేకవిధములుగ వర్ణింపబడినది. యజ్ఞయాగాది క్రతువులకు, పూజాభిషేకములకు, అన్ని పవిత్రకార్యములకు గోక్షీరములే ప్రధానములై యొప్పుచున్నవి, మరియు గోక్షీరములు ప్రజలకు, సాధుసత్పురుషులకు అనేక విధములుగ ఉపయోగపడుచు తల్లివలె కాపాడుచున్నవి. కావుననే గోవునకు గోమాత అని మాతృస్థానము లభించి పూజ్యమై యొప్పుచున్నది.

దిలీపమహారాజు గోమాత(నందినీ ధేనువు), విషయంలో ఒక చిన్న పొరపాటు గావించినందున గోశాపమును పొంది, తదుపరి శ్రీ వశిష్ఠమహామునీంద్రుల దివ్యదృష్టితో కారణ మరసి తన్నివారణకై, వారి ఆజ్ఞతో కొంతకాలము గోసేవ యొనర్చి శాపవిముక్తులైనట్లు, రఘువంశమహాకావ్యం తెలుపుచున్నది.

మరి ఈ ఎడతెగని హింసాత్మక చర్యవలన ఎంతపాపము సంభవించుచున్నదో చదువరు లూహించగలరు. వేదములు, "గో బ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు" అని,

Scanned with CamS

ప్రబోధలు సల్పినవి, మనము పూజానంతరం ఈ సంకల్పం రోజూ చెప్పుకొనుచునే యున్నాము. కాన వారు క్రియారూపంగా కార్యాచరణకి పూనుకొన్నారు. మరియు సభలు, సమావేశములద్వారా గోసంరక్షణకు దానములు సేకరించి, ఆ నిధిని ఆయా గోసంరక్షణశాలలకు అందజేసి కృతార్థులైరి.

2. పశుబలి

మరియు వారు యజ్ఞయాగాది క్రతువులలో పశుబలిని నిరాకరించినారు. ఈ రెండు కార్యములలో జీవకారుణ్యసంఘములద్వారా నిరాకరణోద్యమము సాగించినారు. శ్రీ మహాత్మాగాంధి, వినోభాబావే జీవహింసను వ్యతిరేకించారు. వేదములు "అహింసా పరమో ధర్మః" అని బోధించినవి. ఆ రోజులలో యజ్ఞయాగ క్రతువులలో పశుబలి (మేకలు, కోళ్ళు) విధిగ జరుపుచుండెడివారు.

శాస్త్రములలోని మంత్రములకు అనేక అంతరార్థములు కలవు. కొందరు యజ్ఞకర్తలు శాస్త్రములకు విపరీతార్థములు కల్పించుకొని పశు బలిని అమలు జరుపుచు, అమాయకజీవుల వధించుచు వాటి "వప"ను (కాలేయము) యజ్ఞశాలలో వండి భుజించుచుండిరి. ఇది ఎంతటి ఏహ్యమైన క్రూరాత్మకచర్య, యజ్ఞశాలలు రక్త భూయిష్ఠం. అమాయక ప్రాణుల ఆక్రందనం హృదయ విదారకం.

శాస్త్రములు సర్వప్రాణికోట్ల క్షేమమునే కోరుచున్నవి.

పురుష సూక్తం

" ఓం, తచ్ఛం యో రావృణీమహే,
గాతుం యజ్ఞాయ గాతుం యజ్ఞపతయే

దైవీ స్వస్తిరస్తు నః
స్వస్తిర్మానుషేభ్య :
ఊర్ధ్వం జిగాతు భేషజం
శన్నో అస్తు ద్విపదే రెండు పాదములు కలవారికి శుభమగుగాక!
శం చతుష్పదే" నాల్గు పాదముల వారికి శుభమగుగాక!

ఓం, శాంతిః శాంతిః శాంతిః

వేదములలో చెప్పిన పశువధ అనగ, మనయొక్క పశుగుణములు అనగ దుర్గుణములు వదులుట, అగ్నికి ఆహుతి యొనర్చి సద్గుణములను స్వీకరించుట(అలవరచుకొనుట) అని వారు అంతరార్థమును తెలియచెప్పిరి, శాన్తి మంత్రములను పఠించుచు జీవహింస చేయతగునా?

3. బాల్య వివాహములను నిషేధించుట

దేశ కాల పరిస్థితులవలన ఏనాడో మొదలైన ఈ బాల్య వివాహములు 50 సం॥ క్రితం వరకు ముమ్మరంగా సాగుచునే యుండెడివి. ఈ బాల్యవివాహములవలన ప్రజలు బహుఇక్కట్లుకు గురి ఐనను, పూర్వాచారములు, సంప్రదాయములు అనుచూ మూఢాచారములనే అను సరించుచు, తాము నిర్వహించ లేక కొంత, ఆనాటి సమాజానికి భయపడి కొంత బాధలను భరిస్తూ వచ్చిరి.

ఈ సేవలో వారు అనేక పల్లె పట్టణములు సంచరించి సభలు సమావేశములద్వారా వారికి శాస్త్రప్రమాణములను బోధించి, తగిన ధైర్యాన్ని చేకూర్చి కర్తవ్యాచరణులుగ తీర్చి దిద్దినారు. కొంతవరకు అరికట్టినారు. వారు ఆచరించి చూపినారు.

ఈ బాల్యవివాహములు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి శారదా చట్టం

Scanned with CamS

విధించి, 144 వ సెక్షన్ అమలు జరుపు వరకు సాగుచునేయుండెడివి. తర్వాత కాలంలో కొంత విద్యాభివృద్ధి, స్వతంత్రభావాలు పెంపొంది రూపుమాసినవి. (నిర్మూలమైనవి) 1960 వరకు ఈ వివాహాలు సాగుతునేయున్నవి. తదువరి స్త్రీలు విద్యారంగంలో ప్రవేశించి చైతన్యవతులైరి.

4. పునర్వివాహములను ప్రోత్సహించుట

ఈ బాల్య వివాహములలో విధి వశమున అనాథులైన బాలికలకు తిరిగి వివాహము చేయ సంకల్పించిన తల్లితండ్రులకు వారు చేయూతనిచ్చి వారి పుణ్యప్రదజీవితమునకు, పునర్వివాహమునకు సహాయ భూతులైనారు. విద్య నభ్యసించువారికి తగిన ఏర్పాట్లు చూపినారు.

5. అస్పృశ్యతా నివారణను బలపరచినారు.

6. దీనజనుల అభివృద్ధికి అనేక విధముల పాటు పడిరి.

7. ఆ రోజులలో వారు కొన్ని అత్యవసర సందర్భములలో గురుకులము నేర్పరచి, యువకులకు పౌరోహిత్య శిక్షణ ఏర్పాట్లు చేసి ప్రజల శుభాశుభకర్మలు, పితృ కార్యములందు సహాయభూతులై నిలిచారు.

8. మరియు సభలు, సమావేశములద్వారా ప్రజలకు విద్యా దాన మహిమను గురించి బోధించి, విరాళములను సేకరించి, ఆయా ఉచిత విద్యాసంస్థలకు ఆ కృషిని అందజేసిరి. ఆ సంస్థలవారును కృతజ్ఞతా పూర్వకంగా తండ్రిగారికి లేఖలు వ్రాసియున్నారు.

9. వారు మిత్రులద్వారా "భారతీయవైశ్య" అను మాసపత్రికను నెలకొల్పించి, తద్వారా అనేకబోధలు శాస్త్రప్రమాణంగా వ్యాసరూపంగా ప్రజలకు అందజేసి, ప్రజలలో నూతన చైతన్యమును నెలకొల్పినారు. అనాది

కాలంగా పాతుకుపోయిన మూఢవిశ్వాసాలను, దురాచారాలను దూరం గావించారు.

ఈ విధంగా వారు అనేకానేక సేవాకార్యములు చేపట్టి సంఘమునకు ఎనలేని సేవ చేశారు.

భూతసేవయె, దైవసేవన్నా
ప్రాణికోట్లకు సేవచేయుటె దేశపూజన్నా
ఒక్క ప్రాణికి హితము చేసిన
దేవదేవుని కొలిచినట్లే
భూతకోట్లకు చేయుసేవయె
విశ్వనాథుని సేవయగును ॥ త॥

తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురుని చెంత నిజము కనుగొని లాభముందన్నా.

శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి "తత్త్వసారము" నుండి సంగ్రహించబడినది.

దీపావళి సందర్భము

ఆధ్యాత్మిక భావములు కలవారు కాబట్టి నిరాడంబరులై తమ గృహములో అనేక మార్పులు చేసిరి.

దీపావళి సందర్భమున వారు తమ గృహములో ఆడంబరము, వినోదములైన, టపాసులు, కాల్చుటను మాన్పించినారు. ఆ దినము సాయంసమయమున ప్రణవపూజ యొనర్చెడివారు. ఓం, అను ప్రణవాక్షరమును 108 కుందులతో ఇత్తడిలో చేయించి, అందు దివ్యజ్యోతులు

Scanned with CamS

వెలిగించి ఆ జ్యోతి స్వరూపమునకు ప్రణవాష్టోత్తర శతనామములతో పూజగావించెడివారు. పూజానంతరం,

ఓం, అన్తర్జ్యోతి ర్బహిర్జ్యోతిః ప్రత్యగ్జ్యోతిః పరాత్పరః ।
జ్యోతిర్జ్యోతిః స్వయంజ్యోతి రాత్మజ్యోతి శ్శివోఽస్మ్యహమ్ ॥

బాహ్యాభ్యంతరముల ప్రకాశింపజేయు జ్యోతి స్వరూపుడును, ప్రత్యగాత్మయు, పరాత్పరుడును, (సూర్యాది) జ్యోతులకున్ను జ్యోతియు, ఆత్మ జ్యోతియునగు శివుడను నేను.

ఓం, ఆత్మజ్యోతిర్మనోజ్యోతిర్జ్యోతిశ్చక్షు స్స పశ్యతి ।
సబాహ్యాఽభ్యన్తరజ్యోతి స్సా జ్యోతి శ్శివముచ్యతే ॥

ఆత్మ జ్యోతి స్వరూపము, మనస్సున్ను జ్యోతిరూపమే, తనయొక్క జ్యోతిశ్చక్షువే (జ్ఞాననేత్రమే) సత్యమును గాంచుచున్నది(అట్లు జ్ఞాననేత్రము గలవాడే) బాహ్యాభ్యంతర జ్యోతిస్వరూపుడగుచున్నాడు. ఆ జ్యోతియే శివమని చెప్పబడును.

అని ధ్యానించుచు మంగళ నీరాజనము లర్పించెడివారు. తదుపరి ప్రణవతత్వము, నరకాసురవధను గురించి ఉపన్యసించెడివారు. నరకాసురవధ పురాణగాథగానేగాక, ఆధ్యాత్మిక అంతరార్థమును కూడ వివరించెడివారు. నరకాసురుడనగ, మనలోని అసురగుణములే నరకాసురుడని, అవి త్యజించుటే వధ అని తెలిపెడివారు. తదనంతరం ఈ టపాసులు కాల్చుటవలన సంభవించు ప్రమాదములు, ధనవ్యయమును గురించి తెల్పుచూ, ఆ ధనమును పవిత్ర కార్యములకు సద్వినియోగము చేయుడని బోధించెడివారు. దీపావళి సందర్భములోని వారి ప్రార్థనోపన్యాసము పాఠకుల కొరకు ఇందు పొందు పరచబడినది. వారి

అనన్య భక్తి, భాషా నైపుణ్యం, చదువరులు గ్రహించగలరు.

దేవా! భక్తవత్సలా! జ్యోతిః స్వరూపా!

నీవు అఘటిత ఘటనా ప్రవీణుడవు, నీ సంకల్ప విధానము మాకు అగమ్యగోచరము. నీ భక్తుని ప్రార్థనలోని గణ, యతి, ప్రాసలను, నీవు పాటించవుగదా! భాషా పటిమ నీ కవసరము లేదు కదా! భక్తుని హృదయాంతరాళమునందు పొంగి పొరలుచుండు రస మాధుర్యమునే నీవు గ్రోలుచుందువు. నీ కృపా పాత్రునకు జాతి, కుల మత, భేదములతో పనిలేదు.

(తదుపరి నామధేయం వాల్మీకి)

1. వృత్తిని గమనించితివా! అట్లయినచో వ్యాధుని యందేమి సదాచారము గలదు?
2. వయస్సును పాటించితివా? అట్లయినచో ధ్రువునకు, బ్రహ్మాండ కుటికాగ్రమున సమస్తలోక సామ్రాజ్యపదవినిచ్చి, యేల కాపాడితివి?
3. విద్యను పాటించితివా? అట్లయినచో గజేంద్రున కేమి విద్య కలదు?
4. సౌందర్యమును పాటించితివా? అట్లయిన కుబ్జ యందేమి సౌందర్యము కలదు ?
5. జాతి నేమైనా పాటించితివా? అట్లయిన విదురు నేల ప్రేమించితివి?
6. ధనమును లెక్క చేసితివా? అట్లయినచో నిరుపేదయైన కుచేలున కేపాటి భాగ్యము కలదు?

Scanned with CamS

7. పురుషార్థమును పాటించితివా? ఉగ్రసేనుని యందట్టిది ఏమి కలదు?

వారందరి నేల కాపాడితివి? భక్తి వలననేకదా!

కాబట్టి భక్తియే నీకు ప్రధానము. ఇందులకు పైన తెలిపిన వారందరు సాక్షులు.

ఈ విధంగా పూజా కార్యక్రమము ముగిసెడిది.

ఈ పూజాకార్యక్రమము ఇంటిముందు ఆవరణలో జరిగెడిది. కాన ఆరోజు ఆ వీధివారు, ముఖ్య బంధుమిత్రులు వేంచేసి ఈ పవిత్ర కార్యక్రమమును కన్నుల పండువుగ వీక్షించి, వారి సద్బోధలు శ్రవణానందము గావించి ఆచరించెడివారు. వాటిమీదవుండే భక్తి భావనతో ఆ రోజున ఆ వీధివారు, బంధుమిత్రులు టపాసులు కాల్చెడివారు కాదు. తదుపరి ప్రసాద వినియోగం జరిగెడిది. ఈ విధముగ వారి సత్ప్రవర్తన ప్రజలలో ఎంతో ఒకింత మార్పు తెచ్చెడిది.

వారు ఏ పూజ లొనర్చినను, ఏ సేవలు చేసినను, స్వార్థము కొరకుగాని, ప్రతిఫలం ఆశించిగాని చేయలేదు.

"లోకాస్సమస్తాః సుఖినో భవన్తు" అనియు ఆత్మ తృప్తి కొరకు మాత్రమే,

కాయేన మనసా బుధ్యా కేవలై రిన్ద్రియైరపి ।
యోగినః కర్మ కుర్వన్తి సంగం త్యక్త్వాఽఽత్మశుద్ధయే॥ గీత 5-11

(నిష్కామ కర్మ) యోగులు చిత్తశుద్ధికొరకై ఫలాసక్తిని విడిచి, శరీరము చేతను, మనస్సు చేతను, అభిమానము లేనట్టి ఇంద్రియముల

చేతను కర్మలను చేయుచున్నారు. మరియు,

బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మ కర్మ సమాధినా ॥ గీత 4-24

యజ్ఞమునందలి హోమసాధనములు, హోమద్రవ్యములు, హోమాగ్ని, హోమము చేయువాడు, హోమము చేయబడినది, అన్నియును బ్రహ్మస్వరూపములే యనెడి ఏకాగ్ర భావముతో ఆ యజ్ఞాది కర్మలను చేయువాడు బ్రహ్మమునే పొందగలడు.

ఓంకార మంత్రమును
శ్రద్ధతో భక్తితో
జపము చేయుము ఓయి మనసా!
ప్రణవ జపము చేత
పాపరాశంతయు
భస్మమై పోవును మనసా ॥ సం॥ గీత 46

మానసబోధ

అట్టివారియొక్క మహనీయత, త్యాగనిరతి, ఆధ్యాత్మిక ప్రవృత్తిని గుర్తించిన శ్రీ గొల్లపూడి సీతారామ శాస్త్రిగారు, మరియు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు మొదలగు ప్రముఖులు వారికి వ్రాయు లేఖలలోను, కరపత్రములు, వ్యాసములు మొదలగువాటిలో వారి నామధేయమునకు ముందు "బ్రహ్మశ్రీ" అను పదమును ఉద్ఘాటించుచు వ్రాయదొడగిరి, ఆ పదవినియోగమే, సర్వవ్యాపకమైనది.

వారు ఏ బిరుదులను, సన్మానములను ఆశించువారు, గ్రహించువారు కారు.

Scanned with CamS

భువిలోన జీవుని
ధన కీర్తు లెవ్వియు
రక్షించ జాలవు మనసా!
సత్యధర్మములు రెండు
ఎల్ల కాలములందు
కడ తేర్చు జీవుని మనసా!

– మానస బోధ

వివాహ పద్ధతులు

వారు తమ కుటుంబములో వివాహసందర్భమున కూడ అనేక మార్పులు చేసిరి.

సంఘంలోని ఈ వివాహ వ్యవస్థలో వారు కట్నకానుకలు, ఇచ్చిపుచ్చుకొనుట, అతిమర్యాదలు, ఆడంబరములను తొలగించినారు. వీటివలన అనేక అభిప్రాయభేదములు, మనఃస్పర్ధలు, కుటుంబకలహములు సంభవించి ప్రజలు అనేక బాధలకు గురి అగుట సర్వసాధారణముగ జరుగుచునే యున్నవి. వారు వైదిక ధర్మానికే ప్రాధాన్యము నొసగినారు.

1. వారు వివాహభోజనములలో పిండివంటలను మాన్పించిరి. అవి, భోగ వదార్ధములు, శ్రీ మహాత్మాగాంధి, వినోభాబావే, ఆడంబరములను, అనవసర వ్యయమును మానుమని ప్రవచించిరి.

2. వివాహములో వట్టుబట్టలును ధరించుటను కూడ వారు సమ్మతించలేదు. పట్టుబట్టలయొక్క హింసాత్మకమైన చరిత్ర తెలిసిన కరుణామయులెవ్వరు వాటిని ధరింపనొల్లరు.

వధూవరులు తాము స్వయముగ రాట్నములతో ఒడికిన నూలుతో, బట్టలు నేయించి, ఆ వస్త్రములు పసుపు నీటిలో తడిపి ఆరవేసి, ఆ మంగళకరమైన పవిత్రమైన బట్టలనే ధరింపచేసెడివారు.

3. వధూవరుల వివాహవినోదములైన పూలచెండ్ల ఆట బిందెలో ఉంగరపు వినోదముల స్థానంలో వారు వధూవరులచేత, రాట్నములతో నూలు ఒడుకు పోటీని, మరియు వివాహ ధర్మములను గురించి ఉపన్యసించుటను ఏర్పాటు చేసెడివారు, మరియు మంగళసూత్రములలో సచ్చిదానంద పరబ్రహ్మవాచకమైన ఓం ఓం అను ప్రణవాక్షరమును తెలుగు, సంస్కృతాక్షరములలో తయారు చేయించి సూత్రధారణ జరిపించెడివారు. సూత్రధారణ సమయమున భజంత్రీలకు బదులు, ఆహ్వానితులందరిచేతను పవిత్ర ప్రణవనామోచ్చారణ మూడు పర్యాయములు జరిపించినారు.

మంత్ర పుష్పములోని మంత్రార్థము

ఓం తద్బ్రహ్మ । ఓం తద్వాయుః । ఓం తదాత్మా ।

ఓం తత్సత్యమ్ । ఓం తత్సర్వమ్ । ఓ తత్పురోర్నమః ॥

ఓంకారమే బ్రహ్మస్వరూపము. ఓంకారమే వాయు స్వరూపము. ఆత్మస్వరూపము కూడ ఓంకారమే. ఆ ప్రణవమే సత్యస్వరూపము. సమస్తమునకు కారణస్వరూపము. తచ్ఛబ్ద వాచ్యుడగు పరమాత్మయు ఓంకారమే అట్టి ఓంకారమునకు నమస్కారము.

4. సనాతన పద్ధతిగ శుభలేఖలను తాళపత్రములపై ఘంటములతో లిఖింపచేసి ఆహ్వానితుల కందజేసినారు.

Scanned with CamS

పూర్వాచారములు, సంప్రదాయములనుచు. అనాదికాలంగా మూఢాచారములు పాతుకుపోయిన ఈ వివాహవ్యవస్థలో, ఇటువంటి మహత్తరమైన మార్పులు చేయుట సామాన్య విషయము కాదు. ఎంతో ఆత్మశక్తి స్థితప్రజ్ఞత్వం కావలెను.

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థిత ప్రజ్ఞ స్తదోచ్యతే ॥

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।
యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥

అర్జునా! నీ వేదిచేసినను, తినినను, హోమమొనర్చినను, దానము చేసినను, తపస్సు చేసినను దానిని నా కర్పింపుము.

ఓ, అర్జునా, ఎపుడు మనుజుడు తన మనస్సునందున్నట్టి కోరికలన్నిటిని సంపూర్ణముగ వదలివేయునో మరియు ఆత్మయందే ఆత్మచే (నిర్మలచిత్తముతో) నిరంతరము సంతుష్టిని బొందుచుండునో అపుడాతడు స్థితప్రజ్ఞుడని చెప్పబడును.

వారు తాము తలపెట్టిన మంచిమార్గములో ఎన్ని జటిల సమస్యలు ఉదయించినను, ధీరులై, స్థితప్రజ్ఞులై, అన్నిటిని అధిగమించి తమ లక్ష్యాన్ని చేరుకొన్న మహనీయులు. వారితో వియ్యమందినవారు సహితం వారి ఆచరణలను తలదా ల్చిన వారే.

ఈ విధముగ వారు ప్రతి లౌకిక కార్యమును ఆధ్యాత్మికముతో అన్వయించి, నూతన అధ్యాయమును, నూతన చైతన్యమును నెలకొల్పెడివారు.

ఈ సేవాకాలంలో వారు ఖాదీతత్వము, ఖద్దరు ప్రచారచరిత్ర, వైశ్యవిద్యాభానూదయము, ప్రహ్లాదగాంధి, మొదలగుగా గల 16 ఉత్తమగ్రంధాలవరకు రచించారు. వారి భాషానైపుణ్యం ద్రాక్షాపాకమువలె, మృదుమధురగంభీరమై యొప్పుచుండును. వారి వైదిక ధర్మప్రవచనములు మనోరంజకమై, శ్రోతలను ఆధ్యాత్మిక చైతన్యమున నోలలాడించుచు కర్తవ్యాచరణులగ చేయును.

వారు ఇంత దేశసేవ, సంఘసేవ యొనరించినను, ఏ పత్రికా ప్రకటనలు గావించుకొనలేదు. ఫోటోలు పబ్లిష్ చేయించుకొనలేదు. జీవిత చరిత్రలు వ్రానుకొని అచ్చువేయించుకోలేదు. శిలాఫలకములు చెక్కించుకొనలేదు. తమ పవిత్ర సేవను సర్వేశ్వరుడు మెచ్చిన చాలుననే తలపుగలవారు.

త్యక్త్వా కర్మ ఫలాసఙ్గం నిత్య తృప్తో నిరాశ్రయః ।
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః ॥ గీత 4-20

ఎవడు కర్మఫలమునందాసక్తిని విడనాడి నిరంతరము సంతృప్తి కలవాడై, దేనిని ఆశ్రయించక యుండునో అట్టివాడు కర్మలయందు ప్రవర్తించినను, ఒకింతైనను, చేయనివాడే అగును.

1947 లో స్వరాజ్య స్థాపన తదుపరి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ప్రకటన గావించినది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ప్రముఖులకు బహుమతులుగ స్థలములు, పొలములు పంపిణీచేయనున్నట్లును, అర్జీలు దాఖలు చేసుకోవలసినదిగా ప్రకటన గావించిరి.

వలువురు మిత్రులు తండ్రిగారి వద్దకు వచ్చి, వారిచ్చేది వదులుకోవటం ఎందుకండి? మేము అర్జీలు దాఖలు చేసినాము, మీరును

Scanned with CamS

దాఖలు చెయ్యండి అని బోధించారు. దానికి సత్యసంధులైన తండ్రిగారు ఈ విధంగా వారికి తెలియచేసినారు.

భారతీయ పౌరునిగ నేను నా ధర్మమును నెరవేర్చినాను. ప్రతిఫలం ఆశించి చేయలేదు.

"మాతృభూమి" సేవకొరకు నేను నా ఉద్యోగమునే త్యాగము చేసినాను. ప్రతిఫలమును ఆశించిన"కూలి" ముట్టినట్లే యగును. అది సేవ అనిపించుకొనదు. కాన ఈ విషయంలో నన్ను బలవంతపెట్టవద్దు. తిరిగి నా వద్దకు రానవసరంలేదు అని ఖచ్చితంగా చెప్పివేసినారు.

వారి ధర్మాచరణ నచ్చిన కొందరు తమ తమ అర్జీలను, ఉపసంహరించుకొన్నారు. ఈ విధముగ వారి ధర్మాచరణ ప్రజలలో అనేక మార్పులు తెచ్చెడిది.

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।
లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥ గీత 5-10

ఎవడు తాను చేయు కర్మలను, పరమాత్మకర్పించి సంగమును విడిచి చేయుచున్నాడో, అట్టివాడు తామరాకు నీటిచే అంటబడనట్లు పాపముచే నంటబడకుండును.

వారు క్రియావేదాన్తి. చదివిన మంచిని ఆచరణలో పెట్టెడివారు. గీతాప్రబోధాలన్నీ ఆచరణయోగ్యం గావించుకొన్నారు.

వారు సప్తసంవత్సరములు అపక్వాహారదీక్ష అవలంబించినదియే గ్గాక, కుటుంబ సభ్యులందరిచేతను కొంతకాలము పాటింపచేసిరి. వారు తమ గృహములో "నియమావళి" అనే బోర్డు పెట్టినారు. దాని ప్రకారం అందరు ఆచరించెడివారు.

వారు తమ గృహంలో ఉదయం 4 గంటలకు ఆశ్రమాలలో వలెనే జే గంట వాయించెడివారు. గృహసభ్యులందరు తమ తమ శయ్యలనుండి లేచి సమష్టి ప్రార్థన గావించెడివారు. స్నాన, జపములు గావించుకొని, ఒక అధ్యాయం గీతాపారాయణం, తదుపరి తమ నిత్యకార్యక్రమాలకు అనగా స్కూళ్ళు, కాలేజీలు, ఉద్యోగాలకు వెళ్ళెడివారు. ప్రతి దినము ఒక గంట రాట్నముతో ప్రతి ఒక్కరు నూలు ఒడికెడివారు. ఆ నూలు తోనే వారికి ప్రతి సంవత్సరమునకు సరిపడు బట్టలు నేయించి, (తయారుచేసి) ధరింప చేసెడివారు, విలాసదుస్తులను మాన్పించినారు.

శని, ఆదివారములు సమష్టిగా దేశసేవ, సంఘసేవా కార్యక్రమములలో కుటుంబ సభ్యులను పాల్గొనచేసెడివారు. మరియు తమ గృహములోనే కుటుంబసభ్యులకు ఆధ్యాత్మిక ప్రవచనములపై, వక్తృత్వపోటీని, రచనా వ్యాసంగమును నిర్వహించి శిక్షణ నొసగెడివారు. మరల రాత్రి పరుండబోవునపుడు సమష్టి దైవప్రార్థనతో దినకార్యక్రమము ముగిసెడిది. ఈ విధముగా వారు తమ గృహవాతావరణమును అతి పవిత్రముగ ఆశ్రమమురీతి మలిచిరి.

కావుననే శ్రీమహర్షి సద్గురు మలయాళస్వాములవారు వారి గృహమును స్వయముగ వీక్షించి, అమందానందభరితులై వారిని జనక చక్రవర్తితో పోల్చి 'నివృత్తరాగస్య గృహం తపోవనం' అని శ్లాఘించిరి.

ఇవి, అన్నీ నేను అతిశయోక్తి కొరకు వ్రాయుట లేదు. వారి కార్యాచరణలో నేను తెలిపిన విషయములు బహు తక్కువ మాత్రమే. నాకు తెలియనివి, నామేధ కందనివి ఎన్నియో కలవు. నేను ఆఖరి సంతానం.

ఈ చరిత్ర చదివిన కొందరు "ఎందుకు వచ్చిన కర్మ? లక్షణంగా

Scanned with CamS

ఉద్యోగం చేసికొనుచూ తిని కూర్చోలేక అని తలంచవచ్చును. కొందరు"మహద్భాగ్యం జన్మజన్మల సుకృతం" అని భావించవచ్చును. అది వారివారి చిత్తవృత్తి, అనుభూతి.

యోగి యైనవాడు ఆ పరమాత్మను చేరేవరకు ఉపశమించనేరడు. నదులు సముద్రునిచేరిననే కాని శాంతి చెందవు అని గీతావాక్యం.

వంశసేవ

1933 వ సంవత్సరంలో వారు తమ వంశమునకును కొంత సేవచేయ తలచినవారై, తమ వంశీయుల జన్మస్థానమైన రేపల్లె తాలూకాలోని భట్టిప్రోలు గ్రామంలో ఒక సమావేశమును (కాన్ఫరెన్స్) ఏర్పరచిరి. ఈ కార్యక్రమమునకు వారి వంశీయులందరు ఎక్కడెక్కడ ఏ ఏ తావులయందున్నది చాల శ్రమపడి అడ్రసులు సేకరించినారు. అడ్రసులు తెలిసిన వారికి ఆహ్వానములు అందజేసినారు. తెలియని వారందరికిని వార్తాపత్రికాముఖంగా ఆహ్వానము తెలియపరచినారు. ఈ కార్యక్రమమునకు దాదాపు వెయ్యి మందికి పైగా వంశీయులు హాజరయినారు.

కాన్ఫరెన్స్ ఐదు దినముల కార్యక్రమము. రాను ఒక దినము, పోను ఒక దినము ప్రయాణ సన్నాహములకు పోను, మధ్య మూడు దినములు సభలు, సమావేశములు జరిగినవి. వారు సేకరించిన వంశీయుల లిస్టు ప్రకారం స్టేజిమీద వారి వారి పేర్లు చదువబడినవి. వారు సభామధ్యమునుండి లేచి, తమ కుటుంబసభ్యులను సభకు పరిచయము, వరుసలు తెలియచేయుట జరిగినవి. ఈ కాన్ఫరెన్స్ వలన ఎన్నడును ముఖ పరిచయము లేని వంశీయుల నెందరినో దర్శించుకొనుట, పలకరించుకొనుట జరిగినది.

ఉదయము ఉపాహారము తదుపరి 8 గం॥ నుండి 11 గం॥ వరకు సభ 12 గం ॥ కు భోజన విశ్రాంతి తదుపరి 3 గం, నుండి 6 గం॥ల వరకు సభ సమావేశములు జరిగినవి. రాత్రి భోజనానంతరం, 8,నుండి 10 గం॥ వరకు సత్సంగము, హరికథాకాలక్షేపము, భజనతో దినకార్యక్రమం ముగిసెడిది. వచ్చిన వారందరికిని తండ్రిగారు భోజన, వసతి సౌకర్యములను చక్కగా ఏర్పరచినారు.

ఆ మూడు దినములు ఆనందము వెల్లివిరిసినది. ఎందువలన? అంతా ఐనవారే, అందరూ వంశీయులే, ఎదురు పడ్డవారందరు వరుసలు తెలియచేసికొనుట, కరచాలన ఆలింగనములు గావించుకొనుట, ఆనంద హార్షాతిశములతో అందరి ముఖకమలములు పున్నమినాటి చంద్రబింబములైనవి.

మహనీయులైన వారికి లోకమంతా తనవారే, లోకమంతా బంధువులే, అంతా బ్రహ్మస్వరూపమే, కావుననే వారి ముఖకమలము సర్వదా ఆనందానుభూతితో తేలియాడి పోవుచుండును.

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥ గీత 6-30

ఈ సందర్భములో తండ్రిగారు, తూనుగుంట్లవారి వంశచక్రమును, వంశచరిత్రను అచ్చువేయించి అందరికిని అందజేసిరి. వచ్చిన వారందరు ఇటువంటి కార్యక్రమము "న భూతో న భవిష్యతి" అని వేనోళ్ళ కొనియాడుచు గృహోన్ముఖులైరి.

Scanned with CamS

వారు తమ గృహములో ఆడంబరములను, అనవసర వ్యయమును తగ్గించుకొని, తమ విత్తమును దేశసేవ, సంఘసేవ, సాధుసేవ, వంశసేవా కార్యక్రమములకు సద్వినియోగపరచిన "త్యాగధనులు".

న కర్మణా, న ప్రజయా, ధనేన
త్యాగేనైకే అమృతత్వమానశుః ।

అను శ్రుతి వాక్యమును సార్థక పరచినవారు.

యుక్తః కర్మఫలం త్యక్త్వా శాన్తిమాప్నోతి నైష్ఠికీమ్ ।
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥ గీత 5-12

యోగయుక్తుడు (నిష్కామ కర్మయోగి) కర్మలయొక్క ఫలమును విడిచిపెట్టి(చిత్త శుద్ధివలన) ఆత్మ నిష్ఠాసంబంధమైన శాశ్వతమగు శాంతిని పొందుచున్నాడు. యోగయుక్తుడు కాని వాడు (ఫలాపేక్షతో కర్మలచేయువాడు) ఆశచే ప్రేరితుడై కర్మఫలమందానక్తి గల్గి బద్ధుడగుచున్నాడు.

ఈ సందర్భములో శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి మానసబోధలోని పదాలు ఇచ్చట ఉదహరింపబడుచున్నవి.

భువిలోన జీవుని
ధనకీర్తు లెవ్వియు
రక్షించ జాలవూ మనసా!

సత్యధర్మములు రెండు
ఎల్లకాలములందు
కడతేర్చు జీవుని మనసా!

94. ఏనాటి పుణ్యమొ
నరజన్మమిపుడు
ఏతెంచినది నీకు మనసా!
ఈ భవ్య జీవితము
సంపూర్తి కానపుడె
దైవాన్ని చేరుకో మనసా!

98. మరణించు సమయాన
బంధ్వాదులెవ్వరూ
వెంబడించరు నిన్ను మనసా!
నీవు చేసిన కర్మ
నీ వెంట వచ్చునని
బాగుగా తెలుసుకో మనసా!

ఆధ్యాత్మిక భావములు కల తండ్రిగారికి మనసులో ఒక కోరిక యుండెడిది. ఏమనగా !

తన పంచపుత్రులలో ఒకరిని పూర్తిగ ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశపెట్టి లోక కల్యాణ మొనర్చవలెనని. ఆ కోరికనే, వారు శ్లోకరూపములో ఆనాటి వంశ చక్రము మీద ముద్రించినారు.

ఏకేనాపి సుపుత్రేణ విద్యాయుక్తేన సాధునా ।
ఆహ్లాదితం కులం సర్వం యథా చంద్రేణ శర్వరీ ॥

ఒక్క చంద్రుడు ఆకాశమునంతను ప్రకాశింపచేయునట్లు సాధుసంపన్నుడైన సుపుత్రుడు ఒక్కడైనను వంశమునంతను ప్రకాశింపచేయుచున్నాడు. అట్టి ఆనందమోహనుని రాకకై ఈ వంశము నిరీక్షించుచున్నది అని తమ మనసులోని అభిప్రాయమును వ్రాసుకొన్నారు.

Scanned with CamS

శ్రీ ఆనంద మోహనులు

అన్నట్లుగ, వారి పంచ పుత్రులలో మధ్యముని పేరు ఆనందమోహన్. వారు చిన్ననాటినుండియు లౌకిక ఆధ్యాత్మిక రంగములందయందు ప్రథమశ్రేణిలో ఉండెడివారు, మరియు వక్తృత్వ, రచనా వ్యాసంగముల యందు అనేక బహుమతులు పొందిరి. వారు విద్యార్థి దశలోనే అనేక సంవత్సరములు అపక్వాహారమును సేవించుచు, గాయత్రీ మహామంత్రము, పంచాక్షరీమంత్రము జపించుచు, తమ విద్యార్థిదశను అతి పవిత్రముగ, ఆదర్శముగ గడిపిరి. మరియు భగవద్గీత, కఠోపనిషత్, పతంజలి యోగశాస్త్రం వారికి కంఠపాఠములు. బందరు నోబుల్ కాలేజివారు పెట్టిన భగవద్గీత, బైబులు పోటీలలో ప్రథమ ద్వితీయ స్థానములను గెలుపొందిరి వారినే తండ్రిగారు, శ్రీ సద్గురు మలయాళస్వాములవారి చరణకమలముల సన్నిధికి ఆధ్యాత్మిక శిక్షణకై శ్రీ వ్యాసాశ్రమునకు 1936 సం॥ మే నెల ఏకాదశి తిథి నాడు పంపిరి.

ఒక ముఖ్య సంఘటన

శ్రీఆనంద మోహనులు కాశీ విద్యాపీఠమునందు విద్యనభ్యసించు చున్న రోజులలో ఒక దినము వ్యాహ్యాళికి వెడలిరి. అచట కట్టివేయబడిన ఒక నావలో కూర్చొని వారు తమధ్యేయమును గూర్చి ఆలోచింపసాగిరి. తమ మిత్రులు కొందరు పై చదువులు చదువమని తమను ప్రోత్సహించిరి. తండ్రిగారు లౌకిక విద్యలు ముగించి, పారమార్థిక విద్యకై శ్రీ మలయాళ గురుసన్నిధికి చేరుమని శెలవిచ్చిరి. అట్టి సందిగ్ధావస్థలో ఒక అద్భుత సంఘటన జరిగినది.

ఇంతలో వారి సమీపమునకు ఒక గడ్డికుప్పలో, గంధ పుష్ప

పూజితమైన ఒక గ్రంథము అలల తాకిడికి వచ్చిచేరినది. అది ఏమి గ్రంథమో చూడతలచినవారై, ఆ గడ్డికుప్పను రెండుచేతులతో ఎత్తి తమ బోటులో వేసిరి. అది ఒక పవిత్ర గీతా గ్రంథము, సంస్కృత లిపిలోనున్నది. శ్రీఆనంద మోహనులు ఆనంద పరవశులైరి. తమ సంశయము నివారణ ఐపోయినది. భగవానుడు తమను ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించి, గీతాప్రబోధాలను జగతికి చాటమని ప్రబోధించినట్లు వారి మనసున ప్రేరణ జరిగినది. అది భగవానుని అద్భుత లీలా ప్రకటన. వెంటనే వారు కృత నిశ్చయులై, గీతాగ్రంథరాజమును చేతబూని తమ విద్యార్థి బసకు పయనమైరి. గీతాగ్రంథమునకు, గీతాచార్యునకు వందన సమర్పణ గావించిరి.

తదువరి విద్య ముగించుకొని, కాశీవిశ్వేశ్వర దర్శనము గావించుకొని స్వగృహమునకు విజయవాడ చేరిరి. తనయుని రాకచూచి తండ్రిగారు ఆనందభరితులైరి.

జన్మసుకృతం వున్న మహనీయులకు భగవంతుడు ఈ విధముగ తమ కృపాకటాక్షమును వెల్లడించి సహకరించునని ఈ సంఘటన ద్వారా విశదమగుచున్నది.

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥ గీత 12-8

నాయందే మనస్సును స్థిరముగ నిలుపుము. నాయందే బుద్ధిని ప్రవేశపెట్టుము, పిమ్మట నాయందే నివసింతువు, సందేహము లేదు.

పుత్రుని గురుదేవుల సన్నిధికి పంపుట

1936, వ సం॥ మే-17వతేదీ, ఏకాదశి పవిత్రదినం. ఆ దినం శ్రీ ఆనంద మోహనులు తల్లితండ్రుల అనుమతితో గురుకులవాస

Scanned with CamS

మొనర్చుటకును, పరిపూర్ణ సాధనలు చేయుటకొరకు, పూర్ణ నివృత్తికొరకు శ్రీ మహర్షి సద్గురు మలయాళస్వాములవారి సన్నిధికి శ్రీ వ్యాసాశ్రమము చేరిరి.

అచట గురు సన్నిధిలో అనేక కఠిన సాధనలతో వారి 12 సం॥ల తపశ్చర్య నిర్విఘ్నముగ పరిసమాప్తమైనది. ఈ సాధనా కాలంలోనే వారు గురుదేవుల కోర్కెమేరకు " యోగ వాశిష్ఠ మహాగ్రంథము"నకు తెలుగు అనువాద మొనరించిరి. మూలగ్రంథము శ్రీ వాల్మీకీ విరచితము. ముప్పై రెండువేల(32,000) శ్లోకములతోకూడినది. దానినుండి 6, 000 శ్లోకములు ముఖ్యమైనవి సంగ్రహించి "జ్ఞానవాశిష్ఠముగా" ముద్రించిరి. మరియు వారు బుద్ధ గీతను కూడ తెలుగు అనువాద మొనరించిరి.

12 సం॥ల తపస్సిద్ధి అనంతరం గురుదేవులు వారికి సన్న్యాసదీక్షనొసగి, శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి, అను నూతన నామధేయమునిడి, అంతరార్థమును తెలిపిరి. విద్యాప్రకాశ-అనగ, ఆత్మ విద్యను లోకమున వ్యాప్తి చేయువారు, గిరి- అనే పదము, గురుసాంప్రదాయమును తెలుపునట్టిది, ఆనంద అనే పదము- ఎల్లప్పుడు ఆత్మానందము ననుభవించువారు అని తెలిపి ఆశీర్వదించిరి. తక్కిన సంన్యాసప్రకరణము పీఠికలో తెలియజేయబడినది.

తదుపరి కొంతకాలమునకు వారు ఆశ్రమమును స్థాపించ దలచినవారై, పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కాళహస్తికి దగ్గర స్వర్ణముఖి తీరాన శ్రీ శుకబ్రహ్మాశ్రమము పేరిట ఆశ్రమమునకు 1950, విరోధినామ సం॥ మాఘశుద్ధ విదియనాడు శ్రీశ్రీశ్రీ మలయాళ గురుదేవుల పవిత్ర హస్త కమలముతో ప్రారంభోత్సవము జయప్రదముగ నిర్వహింపజేసేది.

తదుపరి వారు భగవంతుని ఆదేశం మేరకు, శ్రీ గురుదేవుల కోర్కె ననుసరించి దేశదేశములు, వాడవాడల గీతాతత్త్వమును ప్రజలకు ప్రబోధించిరి.

వారు గీతాయజ్ఞమును రోజునకు ఒక అధ్యాయం చొప్పున 18 అధ్యాయములు 18 దినములు నిర్వహించెడివారు. కఠిన వేదాన్తమును సరళభాషలో ఉపమానకథలతో ప్రవచనములు జరుపుటచే, ప్రజలు మహదానందముతో వెల్లువలై పారెడివారు. ఈ కార్యక్రమమునకు బహిరంగ ప్రదేశములు, మైదానములు చాలకుండెడివి. రాజధానీ నగరములో ఆ సమయమునకు ప్రభుత్వంవారు సభాస్థలికి, రానుపోను స్పెషల్ బస్సులను "గీతాయజ్ఞం స్పెషల్ బస్సు" పేరిట అన్ని ముఖ్య మార్గములనుండి నడిపినారు.

చివరి రోజున(18 వ రోజు) ఉదయం గీతామాత పూజ, శ్రీ కృష్ణ పరమాత్మ ఆరాధన, నారాయణసేవ జరిగెడిది. సాయంకాలం ఉపన్యాసం తదుపరి ప్రజలు శ్రీ స్వామికి పాదాభివందనం, శ్రీ స్వామి గంగాజలముతో ప్రజలను సంప్రోక్షణ గావించుట ఆహ్వానితులకు వందన సమర్పణతో గీతాయజ్ఞకార్యక్రమము జయప్రదముగ పరిసమాప్తమయ్యెడిది.

వారు వేదాంతభేరి అను మాసపత్రికను నెలకొల్పి తద్వారా అధికబోధలు శాస్త్రప్రమాణముగ ప్రజలకు అందజేయుచున్నారు. భగవద్గీతకు వారు, టీకా, తాత్పర్య, ప్రతిపదార్థ, విశేషార్థ, మంత్ర ప్రభావములను విశదీకరిస్తూ(1100) పదునొకండు వందలపేజీలు గల ఎనలేని బృహద్గ్రంథరాజమును గీతామకరందమను పేరిట రచించి మరియు భారత, భాగవత, రామాయణ, ఉపనిషత్, యోగ వాశిష్ఠగ్రంథములను క్రోడీకరించి పంచరత్నాకరములను రచించారు. అవి మట్టిని మాణిక్యముగను, రాతిని

Scanned with CamS

రత్నముగను, మనిషిని మనీషిగను తీర్చిదిద్దు గ్రంథములు.

ఇవియే గాక ప్రతి వ్యక్తికీ, ఆబాల గోపాలురకు సహితం అర్ధమగురీతిలో వారు భగవద్గీత 18 అధ్యాయములను ప్రశ్నోత్తర సంభాషణరూపంలో సులభశైలిలో రచనచేసి యున్నారు. ఈ విధముగా వారు అనేక స్థాయిలలో అనేక గ్రంథములను రచించి సంఘ శ్రేయస్సుకు పాటుపడ్డారు.

పల్లె, పామరులు పనిపాటల నొనర్చుకొనుచు పదములుగా పాడుకొనుచు, ఆత్మతత్త్వమును అవగాహన చేసికొనుటకై వారు, "తత్త్వసారము" మరియు "మానసబోధ" అనెడి రెండు చిన్న పుస్తకములను రచన చేసియున్నారు. అవి చక్కగా హృదయస్థము గావించుకొని ఆచరించిన ఇక ఏ బృహద్గ్రంథములను చదువ పనిలేదు.

గీతా పాఠశాలను నెలకొల్పి విద్యార్థులకు సంస్కృత భాషయందు, గీతాతత్త్వము మొదలుగువాటియందు శిక్షణ నొసగినారు.

వేసవి తరగతుల నేర్పరచి అనేకమందికి యోగాసమునందు శిక్షణ యిచ్చినారు.

చాతుర్మాస్యవ్రతములలో అనేక ఆధ్యాత్మిక బోధలు చేశాను.

ఉచిత నేత్ర వైద్యాలయమును స్థాపించి దీన జన సేవ గావించారు.

మరియు గీతాసంచార రథము నేర్పరచి, వీడియోలద్వారా, శ్రీస్వామి గీతాప్రవచనములు, ఆధ్యాత్మికతత్త్వమును, పల్లె పల్లెలకు, పట్నములకు ఆహ్వానములను పురస్కరించుకొని ప్రచారము జరిపినారు. వారి గీతాప్రవచనము18 అధ్యాయాలు ఆడియో కేసెట్లుగా రికార్డుచేసి ప్రజలకు అందించుచున్నారు. మరెన్నియో కార్యములను తలపెట్టినారు.

ఈ విధముగా వారి జీవితమంతయు ప్రజాభ్యుదయమునకు, ఆధ్యాత్మికాభివృద్ధికి ధారపోసిన మహనీయులు, యోగి పుంగవులువారు.

ఆత్మతత్త్వమును లోకమున వెల్లడించి విద్యాప్రకాశ, అను నామ ధేయమును సార్థక పరచిన సద్గురుదేవులు వారు.

1951వ సం॥లో శ్రీ తండ్రిగారు తలచిన దేశసేవ, సంఘసేవా, కార్యక్రమములన్నియు పరిపూర్తి యైనవి. వారికి 60, సం॥ వయసు దాటిన కారణంగా సేవా కార్యక్రమములను ముగించి వానప్రస్థాశ్రమములో నివసించ తలచినవారై, శుకబ్రహ్మాశ్రమ సమీపంలోని, మామిడి తోపులో ఒక చిన్న కుటీరమునేర్పరచుకొని, దానికి ఆత్మారామ ఆశ్రమమని పేరిడి భగవద్ధ్యాన నిష్ఠులై కాలంగడుపుచుండిరి. వారి కార్యక్రమములన్నియు బ్రహ్మ సంబంధమైన స్థితిని తెలుపుచున్నవి.

ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ! నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాஉస్యామన్తకాలేஉపి బ్రహ్మ నిర్వాణమృచ్ఛతి॥ గీత 2-72

అర్జునా! ఇది అంతయు బ్రహ్మసంబంధమైన స్థితి. ఇట్టి బ్రహ్మ స్థితిని బొందినవాడు మఱల నెన్నటికిని విమోహమును జెందనేరడు. అంత్యకాలమునందు గూడ ఇట్టి స్థితియందున్నవాడు బ్రహ్మానందరూప మోక్షమును బడయుచున్నాడు అని గీతావాక్యం.

తత్త్వసారము

విద్యలెన్నియొ కలవురోరన్నా
అన్నింటిలోను, చావు తప్పే విద్య గొప్పన్నా
ఎన్ని చదువులు చదువ నేర్చిన
పుట్టి చచ్చిన నేమి ఫలము

Scanned with CamS

జన్మ మేమియు లేని పదవిని
కలుగ జేసెడి విద్య శ్రేష్ఠము
తత్త్వసారము తెలుసుకోరన్నా!
సద్గురుని చెంత నిజము కనుగొని లాభముందన్నా!

52 దేహమే యొక నావ
జీవుడద్దానిని
నడుపుచుండును ఓయి మనసా!
నావ బాగున్నపుడె
సంసార సాగరము
దాటి వేయుము ఓయి మనసా!

– మానసబోధ

ఒక ముఖ్య విషయము ఇక్కడ పాఠకులకు తెలుపవలసి యున్నది. వారు తమ నిర్యాణమునకు 34, సంవత్సరములకు పూర్వమే (అనగ వారు జీవించియుండగనె) తమ యొక్క మరియు తల్లిగారియొక్క సమాధులు ఆ తోటలో ఎక్కడెక్కడ, ఏ రీతిగ కట్టవలెనో, ఆ సమాధులమీద యే యే వేద వాక్యములు వేదశ్లోకములు వాటి అర్థముతో సహా నమూనాను గీచి, ప్రేమ కట్టించి భద్రపరచిరి.

ఇది ఎంతటి వైరాగ్య చింతన, స్థితప్రజ్ఞత్వం, ఆత్మార్పణ బుద్ధియో పాఠకులకు విశదం కాగలదు.

సామాన్యంగా జనులు తమ అవసానదశకి ముందుగనే ఆస్తిపాస్తులు వారసులపాలు కాకుండా, లాయర్‌ని పిలిపించి వీలునామా వ్రాయించి భద్ర పరచుట కద్దు.

ఇది, అట్లుగాక వారు తమ విత్తమును దేశాభ్యుదయ కార్యక్రమములకు వినియోగించి, ఆత్మధనమును కూడబెట్టుకొన్నారు. అదియే వెంటవచ్చు ధనము. అదియే జన్మరాహిత్య ధనము. తత్త్వసారములోని పదము ఇచ్చట ఉదాహరించుట ఉచితము.

జీవ బ్రహ్మము లేకమేయన్నా
వారి ఐక్యము తెలిసి బంధము తొలగద్రోయన్నా
పొట్టు ఉండిన వడ్లగింజ
పొట్టు ఊడిన బియ్యమేను
పాశబద్ధుడు జీవుడగును
పాశ ముక్తుడు పరమశివుడే
తత్త్వసారము తెలుసుకోరన్నా!
సద్గురుని చెంత నిజము కనుగొని లాభముందన్నా!

నిర్యాణ ఘట్టము

శ్రీ, తండ్రిగారికి భగవంతుని పిలుపు వచ్చినది. వారు 75 సం॥ కాలమే జీవించినారు.

1960 మార్చి–23, ఏకాదశి పవిత్రదినం. ఉదయం 8 గం, లకు స్నానమాచరించిరి. ధ్యాన నిష్ఠలో నిమగ్నమైరి. మూడు పర్యాయములు ప్రణవోచ్చారణతో వారి తుది శ్వాస ఆగిపోయి పరమాత్మ సన్నిధి కేగిన ధన్యజీవులు వారు.

సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణ మాస్థితో యోగధారణామ్॥
గీత 8–12

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్, మామనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాం గతిమ్ ॥
గీత 8-13

ఎవడు ఇంద్రియ ద్వారములన్నిటిని బాగుగా అరికట్టి మనస్సును హృదయమునందు (ఆత్మయందు) లెస్సగా స్థాపించి, శిరస్సునందు (బ్రహ్మరంధ్రమునందు) ప్రాణవాయువును ఉంచి ఆత్మను గురించి ఏకాగ్రచింతనము(యోగధారణ) గలవాడై, పరబ్రహ్మమునకు వాచకమైన'ఓమ్' అను ఒక అక్షరమును ఉచ్చరించుచు, నన్ను ఎడ తెగక చింతించుచు శరీరమును వదలునో అతడు సర్వోత్తమస్థానమును (మోక్షమును) బొందుచున్నాడు.

సాధిభూతాదిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।
ప్రయాణ కాలేఽపి చ మాం తే విదుర్యుక్తచేతసః ॥ గీత 7-30

ఆది భూత అధిదైవ ఆదియజ్ఞములతో కూడియున్న నన్నెవరు తెలును కొందురో వారు దేహవియోగ కాలమందును (దైవమందు) నిలుకడగల మనస్సు కలవారై(మనో నిగ్రహముకలవారై) నన్నెరుగ గలరు.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే॥గీత 18-65

నాయందు మనస్సు నుంచుము. నా యెడల భక్తి కలిగి యుండుము. నన్నారాధించుము. నాకు నమస్కరింపుము. అట్లు కావించెదవేని నీవు నన్నే పొందగలవు. నీవు నాకిష్టుడవై యున్నావు. కాబట్టి యథార్థముగ "ప్రతిజ్ఞ" చేసి చెప్పుచున్నాను.

శ్రీ తండ్రిగారి తదనంతరం తల్లి గారు 27 సం॥ల కాలం

జీవించినారు. వారు ఆ ఆశ్రమంలోనే భర్త అడుగుజాడల ఆదర్శ జీవితమును గడిపినారు. వారు 90, సం॥ కాలం జీవించారు.

పరమ సాధ్వీమతల్లి(సాధు) మాతృ సుశీలాదేవి
భర్త, ధర్మకార్యాలకెల్ల తోడునీడయై, త్యాగియై
విరాగియై, ఆదర్శియై వెన్నంటి సహధర్మ
చారిణి, నామమునకె, వన్నె తెచ్చె, శోభగూర్చె !!

వారు 1987 జూన్ 1వ తేది పంచమీ తిథి నాడు మధ్యాహ్నం 1 గం॥కు కృష్ణ, కృష్ణ, కృష్ణ నామోచ్చారణతో తమ భౌతిక దేహాన్ని విడనాడి, కృష్ణ చరణార విందముల యొద్దకు చేరి పోయినారు. ఆశ్రమవాసులందరికి తల్లియై, తగిన సలహాలు, బోధలు అందించు ఆ వృద్ధమాత సాధు జనని, మరణానికి ఆశ్రమ వాసులందరు తల్లడిల్లినారు. అచేతనులైనారు.

యం యం వాఽపి స్మరన్ భావం త్యజత్యన్తే కలేబరమ్ ।
తం తమేవైతి కౌన్తేయ సదా తద్భావ భావితః ॥ గీత 8-6

అర్జునా! ఎవడు మరణకాలమున ఏయే, భావమును (లేక రూపమును) చింతించుచు, దేహమును వీడునో వాడు భావము యొక్క స్మరణచే గలిగిన సంస్కారము గలిగి యుండుటవలన ఆ, యా రూపమునే బొందుచున్నాడు.

ఆ విధముగ ఈ పుణ్యదంపతులు గీతాప్రబోధములను ఆచరణయోగ్యం గావించుకొని, నిష్కామకర్మమార్గమున భగవత్కృపను పొందిరనుటకు వారి పవిత్ర మరణ దినములే తార్కాణము.

"ఏకాదశి మరణము ఎంతోవారీకినీ" ఒక కీర్తన వెనుకటి పెద్దలు పాడుచుండెడివారు.

Scanned with CamS

శ్రీ, గాంధి మహాత్ముడు గీతను ఆశ్రయించియే, కర్మమార్గమును చేపట్టి భగవత్కృపను పొందినారు. వారి తుది ఊపిరి, "హే రాం" అను రామనామస్మరణతో అంతమైనది. తుది క్షణంలో భగవన్నామస్మరణ పలుకుటతో, మోక్షద్వారము మోక్ష కవాటములు తెరచుకొన్నవి.

రామాయణ రత్నాకరం నుండి

రామ ఏవ పరబ్రహ్మ రామ ఏవ పరం తపః ।
రామ ఏవ పరం తత్త్వం శ్రీ రామో బ్రహ్మతారకమ్ ॥

శ్రీరామేతి వదన్ బ్రహ్మభావ మాప్నోత్యసంశయమ్. శ్రీరామయని పలుకు ప్రాణి నిక్కముగ పరబ్రహ్మమును చేరును.

గీతను ఆశ్రయించియే జనకుడు కర్మమార్గమున మోక్షమును పొందినట్లు గీత బోధించుచున్నది.

గీతా మాశ్రిత్య బహవో భూభుజో జనకాదయః ।
నిర్ధూత కల్మషా లోకే గీతా యాతాః పరమం పదమ్ ॥

గీ.మా. 20-11

ఈ ప్రపంచమున గీతను ఆశ్రయించిన జనకాదులగు రాజులనేకులు పాపరహితులై పరమాత్మ పదమును బొందగలిగిరి.

5. **గీత సతతము ఆశ్రయించన్నా!**
ఉపనిషత్తుల సారమే యది తెలిసికోరన్నా!
గీతమాతకు సేవ సలిపి
గీత తత్త్వము మదిని దాల్చి
గీత చెప్పిన కృష్ణదేవుని
పాద పద్మము నమ్మి కొలువుము ॥

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయో భూతి ర్ధ్రువా నీతి మతిర్మమ॥ గీత 18-78

ఎచట యోగేశ్వరుడగు శ్రీ కృష్ణుడున్ను, ఎచట ధనుర్ధారి అగు అర్జునుడున్ను ఉందురో అచట సంపదయు, విజయమున్ను, ఐశ్వర్యమున్ను, ధృఢమగు నీతియు ఉండునని నా అభిప్రాయము.

అట్టి జగద్రక్షకుడగు గీతాచార్యునకు, మహనీయులకు, పూజ్య జననీ జనకులకు వందన సహస్రముల నర్పించుచు చరిత్రను ముగించుచున్నాను.

ఓం తత్సత్

Scanned with CamS

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి చరిత్రలో కొన్ని విశేషాలు

శ్రీ ఆనందమోహన్ విజయవాడలో హైస్కూల్ విద్యనభ్యసించే రోజులలోనే హిందీలో ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాషలు ఉత్తీర్ణులైనారు. మరియు ఆనాటి స్వాతంత్ర్యోద్యమకాలంలో రాట్నము మరియు తకిలీలతో నూలు వడుకు పోటీలలోను వక్తృత్వ, రచనావ్యాసంగములలోను, స్వర్ణ, రజత పతకములను, బృహద్గ్రంథరాజములను బహుమతులుగ గెలుపొందినారు.

మరియు తండ్రిగారి సంఘసేవ, దేశసేవ, ఆధ్యాత్మికసేవలలో సహాయభూతులుగ దంటూ, కార్యాచరణ గావించేవారు. తండ్రిగారి ఆధ్యాత్మికసేవలో ఆనందమోహన్ గీతాశ్లోకములు పఠించగా తండ్రి ప్రజలకు అర్థభావములు తెలెపెడివారు. ఈ విధముగ ఆనందమోహన్‌కి చిన్ననాటి నుండియే గీతా పరిచయమేర్పడినది. తండ్రిగారి ఆధ్యాత్మికోపన్యాసములు వీరి భవిష్యత్ కార్యాచరణకు పునాదులైనవి.

ఆనందమోహన్‌కి తండ్రిగారు పదవయేటనే ఉపనయన సంస్కారము గావించినారు. తదాదిగవారు గాయత్రీ మంత్రోచ్చారణ గావిస్తూ పునీతులైనారు. ఈ క్రమములోనే వారు స్వయంకృషితో సంస్కృతము అభ్యసించినారు. తదుపరి తండ్రి వారికి కఠోపనిషత్తు, భగవద్గీత, యోగ దర్శనం మొదలగు గ్రంథాలను చదువ నియమించారు.

వీరికి వచ్చిన బహుమతి గ్రంథాలలో స్వామి రామతీర్థ, స్వామి వివేకానంద, రమణమహర్షి ఇత్యాది గ్రంథములున్నవి. వారి విదేశీ పర్యటనలలోని గంభీరోపన్యాసములు వీరిని అమితముగ ఆకట్టుకున్నవి,

ఆ వ్యాసాలలోని బి, ఫియర్లెస్ అనే వాక్యం వీరికి మంత్రము వలె పని చేసినది. ఆ వాక్యమునే వారు ఉత్తరోత్తర వ్యాసాశ్రమ కుటీరం గోడమీద వ్రాసుకొనినారు. మరియు శుకబ్రహ్మాశ్రమ స్థాపన తదుపరి మెయిన్ గేటు పై భాగంలో ఇంగ్లీషు వ్రాత అక్షరాలతో సన్నని ఇనుప,జాలీతో అతి సుందరముగా వ్రాయబడినది.

వారు స్కూల్ ఫైనల్ పరీక్ష ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనారు. అప్పుడు వారి వయస్సు 13 సం॥లు అనేకానేక పోటీ పరీక్షలలో గెలుపొంది విజయవాడలో విజయపతాకం ఎగురవేసి కాలేజీ విద్యాభ్యాసము కొరకు బందరు చేరినారు. ఆ రోజులలో విజయవాడ, గుంటూరులలో డిగ్రీ కాలేజీలు లేవు. బ్రిటీష్ వారి రేవు పట్టణముగా బందరు ప్రసిద్ధి చెందినది.

వారు 1928 ప్రాంతంలో ఉన్నత విద్యకై బందరు చేరినారు. వీరికి వయస్సు తక్కువైనందున కాలేజీ యాజమాన్యం సీటు ఇవ్వ నిరాకరించారు. తిరిగి వీరి స్కూల్ ఫైనల్ ప్రథమశ్రేణి మార్కులు గమనించి నోబుల్ కాలేజీ వారు చేర్చుకున్నారు. ఇంటర్‌మీడియెట్ రెండు సంవత్సరములు, బి.ఏ. రెండు సంవత్సరములు మొత్తం నాలుగు సంవత్సరముల కాలము బందరులో ఉన్నారు.

ఆ సమయములోనే వారు ఇతర భాషలైన ఉర్దూ, కన్నడ, తమిళ, భాషలను స్వయం కృషితో నేర్చుకొని, ఆ యా మతగ్రంథాలను పరిశీలించి, వాటి పోటీపరీక్షలలో సహితము బహుమతులు గెలుపొందినారు. శుకబ్రహ్మాశ్రమ స్థాపన తదుపరి ఆధ్యాత్మిక ప్రచార సందర్భమున బెంగుళూరు వెళ్ళినపుడు కన్నడములోను, మద్రాసు వెళ్ళిన సందర్భమున తమిళంలోను, వేదాంతోపన్యాసములు ఇచ్చి శ్రోతలను ఆశ్చర్య చకితుల నొనర్చారు. వారికి, తండ్రిగారికి మొదటినుంచి అపక్వాహార సేవనము అలవాటుగాన ఎచటికి

Scanned with CamS

వెళ్లినను భోజన సమస్య ఉండెడిది కాదు.

ఆనందమోహన్ బందరులో ఉన్నకాలంలోనే 1929 ప్రాంతాలలో శ్రీ మహర్షి మలయాళ స్వాములవారు ప్రచార సందర్భముగ బందరు వేంచేసి అచ్చటి అన్నపూర్ణ మఠంలో బసచేసినారు. విషయం తెలిసిన తండ్రిగారు గురుదేవులను తమ స్వగృహమున కాహ్వానింప బందరు వచ్చి అచటఉన్న ఆనందమోహన్‌ని తీసుకొని గురుదర్శనమునకు వెళ్ళినారు. ఆనందమోహన్‌కి గురుదర్శనం అదే ప్రథమం. గురువందనం తదుపరి తండ్రి పిల్లవాని విద్య, తదితర వివరాలు తెలియజేసినారు.

ఆనందమోహన్‌ని చూడగానే గురుదేవులు ఆనందపరవశులైనారు. నియమనిష్ఠలతో, గాయత్రీమంత్రోచ్చారణతో, పరిశుద్ధాంతరంగుడై, వామనమూర్తివలె తేజోమయుడై, నిరాడంబరుడైన, ఆపిల్లవానిని చూడగానే, ఇటువంటి పిల్లవాడే మన ఆశ్రమమునకు కావలసినవాడు, యోగవాశిష్ఠము గ్రంథము అనువాదము చేయగల సమర్థుడు, సకలవిద్యాపారంగతుడు, యువకుడు, బ్రహ్మచారి ఇత్యాది ఆలోచనాపరంపరలు సాగి ఒక సలహా ఇచ్చారు. తమ పిల్లవానికి హిందీలో పైకోర్సులు చెప్పించండి అని. శ్రీగురుదేవులకు హిందీకి సంబంధమేమిటని పలువురు తలంచవచ్చును. వారి వద్ద హిందీభాషలో ఆధ్యాత్మిక గ్రంథములున్నవి. అవి పఠించి ఆశ్రమవాసులకు అర్థభావములు బోధించాలి. ఈ విధమైన భవిష్యత్ కార్యాచరణలు మనసున మొదలైనవి. తదుపరి తండ్రి కోర్మామేర గురుదేవులు ఆనందమోహన్‌కి పంచాక్షరీ మంత్రోపదేశం చేసినారు. తదనంతరం తండ్రిగారు గురుదేవులను విజయవాడలోని తమ స్వగృహమున ఆతిథ్యం స్వీకరింప ప్రార్థించి, వందన సమర్పణ కావించి పిల్లవానిని తీసుకొని నిష్క్రమించినారు.

మరునాడు గురుదేవులు నలుగురు సాధువులతో విజయవాడలోని వారి స్వగృహమునకు వేంచేసినారు. నిరాడంబరముగ, ఆధ్యాత్మిక వాతావరణంతో విలసిల్లిన వారి గృహమును చూచి "నివృత్తరాగస్య గృహం తపోవనం" అని పలికి తమరు గృహస్థాశ్రమమును తామరాకుమీది నీటిబొట్టు చందమున జనకమహారాజువలె నడుపుచున్నారు అని శ్లాఘించినారు. కావుననే జనకుని పేరు గీతలో వినుతికెక్కినది. గురుదేవులు ఉద్యానవనమంతా కలియతిరిగారు. తులసికోటమీది వేదవాక్యాలు పఠించారు.

భోజన విశ్రాంతి తదుపరి సా॥4 గం॥కు కుటుంబ సభ్యులందరిని ఒకచోట సమావేశపరచి ఆధ్యాత్మిక బోధలు నలుపుచు మధ్యలో "రామస్వామిగారూ! తమకు ఐదుమంది పుత్రసంతానమున్నది. అందరినీ సంసారములోనే దించక ఏ ఒక్కరినైనా ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశింపచేసి లోకకళ్యాణమొనర్చండి. మా ఆశ్రమమునకు పంపిన తగిన శిక్షణ ఇవ్వగలము" అని మనసులోని మాట బైటపెట్టినారు.

వెంటనే తండ్రిగారు నేను అదే ఆలోచనలో యున్నాను. మా తృతీయ పుత్రుడు ఆనందమోహన్‌ని తమ ఆశ్రమమునకు పంపదలచాను అని మాట ఇచ్చారు. ఆ మాటవినగానే గురుదేవులు ఆనంద పరవశులైరి.వారి కంటి వెంట ఆనందబాష్పములు స్రవించినవి. ఆనాటి ఆ సమావేశములో ఆనందమోహన్ లేరు. బందరులో నున్నారు. తదుపరి గురుదేవులకు కార్యక్రమములున్నందున అటనుండి నిష్క్రమించినారు. కుటుంబ సభ్యులు వందన సమర్పణ గావించి వీడ్కోలు ఇచ్చినారు.

బి.ఏ. డిగ్రీ పూర్తి అయ్యేనాటికి ఆనందమోహన్ వయస్సు 18 సం॥లు. ఆ వయస్సులోనే అన్ని భాషలు నేర్చుకున్నారు. గురుదేవుల కోర్మామేర

Scanned with CamS

ఆనందమోహన్ విజయవాడలో హిందీలో రాష్ట్రభాషా ప్రవీణ కోర్సులు పూర్తి చేశారు. పై కోర్సు కొరకు కాశీ వెళ్ళి 'కోవిద' అనే డిగ్రీ కోర్సు పూర్తిచేశారు. తదుపరి తండ్రి ఇక విద్య ముగించి గృహమునకు రమ్ము, నిన్ను వ్యాసాశ్రమము పంపదలిచాను అని లేఖ వ్రాసినారు. మిత్రులు ఇంకా పై కోర్సులు చదువమని ప్రోత్సహించారు. ఈ సందిగ్ధంలో వారు గంగానదికి స్నానమునకు వెళ్లగ ఒక గడ్డికుప్పలో తామరాకులో పసుపు, కుంకుమ, పుష్పపూజిత గీతాగ్రంథం సంస్కృతలిపిది అలల తాకిడికి తమ వద్దకు వచ్చి చేరినది. ఆశ్చర్య, ఆనంద, సంభ్రమములతో ఆ గ్రంథరాజ్యాన్ని తమ దోసిట తీసి కనుల కద్దుకొన్నారు. భగవంతుడు తనను గీతాప్రచారం చేయమని ఆదేశమిచ్చారని భావించారు. వెంటనే వారు కాశినుండి బయలుదేరి విజయవాడ స్వగృహమునకు చేరుకొన్నారు. తండ్రి సంతసించారు. విజయవాడ చేరుకున్న ఐదు రోజులలోనే వ్యాసాశ్రమం గురుసన్నిధికి చేరుకున్నారు. ఆనందమోహన్‌రాకతో గురుదేవులు ఆనందభరితులైనారు. వారు ఆశ్రమం చేరిన తర్వాత తిరిగి ఇంట్లో అడుగు పెట్టలేదు. అఖండ దీక్షాపరులు ఆనందమోహన్ ఆశ్రమం చేరుకొన్నరోజు "ఏకాదశి" పవిత్రదినం. ఆరోజుననే గురుదేవులు మహావాక్యాలైన అహం బ్రహ్మాస్మి, అయమాత్మా బ్రహ్మ, తత్త్వమసి ఇత్యాది మహావాక్యాలు ఉపదేశం చేసినారు. వాటిని మననం చేయమన్నారు. తమ తలంపులు సఫలమైనవి. ఇది భగవత్సంకల్పం.తమ సంకల్పాలు నెరవేరబోవుచున్నవి. అప్పటికి ఆనందమోహన్ వయస్సు 23 సం॥లు మాత్రమే. అకుంఠిత దీక్షాపరులు. భగవత్సంకల్పం నెరవేరబోవుచున్నది.

మరునాడు ఆశ్రమ దినచర్యలలో భాగముగ కొన్ని కార్యక్రమములనిచ్చి నిర్వహించమన్నారు. ప్రార్థనా మందిరములో ఉదయం

సమష్టి ప్రార్థన, తదుపరి ప్రణవోచ్చారణ(ఓంకారం) గీతాపఠనం, మధ్యాహ్నం 12 గంటలకు గురుదేవులకు వచ్చే ఉత్తరాలు చదివి వినిపించి గురుదేవులు చెప్పుచుండగా జవాబులు వ్రాయుటము, సాయంత్రము 4 గం॥కు బృహత్ వేదాంత గ్రంథాలలోని ముఖ్యమైన భాగాలు ఆశ్రమ వాసులకు, భక్తులకు చదివి వినిపించి అర్థాలు, అంతరార్థాలు బోధించే పనిని అప్పగించారు. మిగిలిన సమయములోనే కొంత సాధన, విశ్రాంతి కొరకు ఏర్పరచుకున్నారు. ఆశ్రమమునకు కొంత దూరములో ఒక చిన్న కుటీరం వారికి ఇవ్వబడినది దాని పేరు గుహాశ్రమము.

ఈ బోధనా క్రమములోనే హిందీ భాషలో ఉన్న యోగవాశిష్ఠ గ్రంథమును చదివి ఆశ్రమవాసులకు అర్థాలు, అంతరార్థాలు తెలియజేయమనినారు. ఇది చాలా బృహద్గ్రంథరాజము కాన చాలాకాలము బోధింపబడినది. శ్రీ గురుదేవులు బహుక్రమశిక్షణాపరులు. ప్రతి కార్యమును పర్యవేక్షించుచుండెదరు. ఆనందమోహన్ బోధనాపటిమ గ్రహించిన గురుదేవులు తమ వద్దనున్న సంస్కృత యోగవాశిష్ఠ మూలగ్రంథానికి తెలుగు భాషలో అనువాదం చేయు పనిని అప్పగించినారు. ఈ బృహద్గ్రంథం 32000 వేల శ్లోకాలతో కూడియున్నది. రోజువారీ కార్యక్రమములలో సమయం తక్కువకాన ఈ అనువాదరచన 5,6 సం॥ల దీర్ఘకాలం పట్టినది. అప్పటి ఆనందమోహన్ వయస్సు 24 సం॥లు, తమ 30వ సం॥లోపే గ్రంథరచన పూర్తి చేసి గురుదేవులకు సమర్పించారు. అంత చిన్న వయసులో ఇంత బృహద్గ్రంథాన్ని తెలుగున అనువాదం కావించి ఘనకీర్తి పొందినారు. ఈ గ్రంథం యుగ యుగాలనాటిది.

ఈ యోగ వాశిష్ఠగ్రంథమును గురించి వ్యాసాశ్రమ ప్రచురణయైన స్తోత్రమంజరి అనే ప్రార్థనాపుస్తకం అట్ట వెనుకభాగాన ఈ విధముగా తెలుపబడినది.

Scanned with CamS

శ్రీ యోగవాశిష్ఠము

"ఈ గ్రంథమింతవరకు తెలుగుభాషలో ముద్రింపబడియుండలేదు. ఇది 32000 వేల శ్లోకములతో కూడియున్నది. శ్రీ వశిష్ఠమునీంద్రులవారు శ్రీరామచంద్రులకు ఉపదేశించిన సమస్త వేదాంత సారగర్భితములగు ఉపదేశములతో కూడియున్నది. దీనిని శ్రీ వాల్మీకి మహర్షి తన శిష్యుడగు భరద్వాజ మహర్షికి ఉపదేశించెను. శ్రీ మద్రామాయణము రచించిన ఆ వాల్మీకి మహర్షియే దీనిని కూడా రచించెను. ఈ మూలగ్రంథమునకు వాశిష్ఠమహారామాయణమనియు. యోగవాశిష్ఠమనియు పేర్లు కలవు. దీని నుండి గ్రహింపబడినదియే ఇపుడు తెలుగులో కల జ్ఞానవాశిష్ఠము. ఇది 6000 ల శ్లోకములతో కూడినది. ఈ పూర్తి గ్రంథమునకు హిందీ, మహారాష్ట్ర, గుజరాతీ, బెంగాలీ మొదలగు భాషలలో తర్జుమా కలదు. "ఆంధ్రభాషలోనికి త్రేతాయుగము నుండి నేటివరకు పూర్తి తర్జుమా కాలేదు. తెలుగుదేశస్థులు కూడ ఈ లోకోత్తమగ్రంథము చదివి దానిలోగల భగవద్రసామృతమును పానముచేసి తరింపవలెననెడి సదుద్దేశ్యముతో మహర్షులు కరుణచేతను, పరమేశ్వరుని అనుగ్రహముచేతను శ్రీవ్యాసాశ్రమమువారు తెలుగుభాషలో దీనిని అనువదించుచున్నారు.

పూర్వార్ధము పూర్తియైనది. ఉత్తరార్ధము జరుగుచున్నది. వలయువారు తెప్పించుకొనగలరు" అని ప్రచురించినారు. ఈ ప్రచురణ 1941 నాటిది. శ్రీ ఆనందమోహన్ 1944లోపే అనువాదం పూర్తిగావించి గురుదేవులకు సమర్పించినారు. శ్రీ గురుదేవుల చిరకాల కోరిక నెరవేరినది. యుగయుగాల చరిత్ర ఈ కలియుగములో, భగవానుని ఆదేశంతో, గురుదేవుల కృపాకటాక్షముతో ఆనందమోహనుని అకుంఠిత, అనన్యకృషితో తెలుగు ప్రజల హస్తముల నలంకరించినది. శుకబ్రహ్మాశ్రమస్థాపన తదుపరి,

ఈ గ్రంథ రచనాకాలములోనే శ్రీ ఆనందమోహన్ ఈ యోగ వాశిష్ఠ గ్రంథములోని అతిముఖ్యమైన శ్లోకాలను ఏర్చి, కూర్చి, వశిష్ఠగీతగ, యోగవాశిష్ఠరత్నాకరముగ ముద్రించి ప్రజలకు అందించినారు. పైగ్రంథ రచనాకాలము నాటికి (వ్యాసాశ్రమ) శ్రీ ఆనందమోహన్‌కి సన్యాసదీక్షా కార్యక్రమము జరుగలేదు.

శ్రీ ఆనందమోహన్ సన్న్యాస స్వీకారము

మొదటిరోజు - తీర్థయాత్ర- వ్యాసాశ్రమము నుండి శ్రీ కాళహస్తికి పాదచారియై భక్తులు వెంటరాగా హరేరామ మంత్రోచ్చారణతో, స్వర్ణముఖినదిలో స్నానమాచరించి దైవదర్శనము తదుపరి తిరిగి కాలినడకన వ్యాసాశ్రమము చేరుట.

రెండవ దినం - తల్లి అనుజ్ఞ

మూడవ దినం -దేవతలకు జరుపవలసిన హెూమాలు.

నాల్గవ దినం - పితృదేవతలకు పిండప్రదానాలు

ఈ విధముగ ఆనందమోహన్ గృహస్థుడుగ తను చేయవలసిన కర్మవిధులన్నీ పూర్తిగావించుకొని చివరకు తనకు కూడా తనే పితృకర్మ(తద్దినము) పెట్టుకున్నాడు. శాస్త్రమీరీతిగ యున్నదట. ఈ కార్యక్రమమును సభాసదులు అమిత ఆశ్చర్యముతో వీక్షించినారు.

ఐదవ దినం - నామధేయం మార్పు, సన్యాస నామధేయం శ్రీవిద్యా ప్రకాశానందగిరిస్వామి.

Scanned with CamS

ఈ నామమునకు గురుదేవులు అంతరార్థము (వివరణ) ఈ విధముగ తెలియజేసినారు. ఆత్మ విద్యను లోకమున ప్రచారముచేయుటను, సర్వవేళల నీకు జ్ఞప్తి చేయుటకొరకు నీకు ఈ పేరు నిర్ణయించబడినది. గిరి అనే నామం గురుసాంప్రదాయమును తెలుపునట్టిది అని తెలియజేసిరి. తదువరి కాషాయవస్త్రాలు, పాదుకాద్వయం, దండకమండలము ఇవ్వబడినవి. గురుదేవులు కమండలము గురించి ఈ విధముగా తెలియపరచినారు. ఈ కమండలము నాలుగు తరములనుండి పరంపరగ ఇవ్వబడుచున్నది. గురుదేవుల హస్తకమలములతో ప్రథమ సన్యాసికాన ఈ కమండలము నీకు ఇవ్వబడినది. అని పూర్వచరిత్ర తెలియజేసినారు గురుదేవులు.

ఈ ఆధ్యాత్మిక మార్గములో తల్లిపాత్ర అతి ముఖ్యమైనది. వేదములు (ఆధ్యాత్మికములో) నవమాసములు మోసి, కని పెంచిన, తల్లికే ప్రాధాన్యము నొసగినవి. కావుననే శంకరాచార్యులవారు తల్లిని ఒప్పించుట కొరకు అతిశ్రమపడినారు.

ఈ తల్లి అట్లుగాక మొదటినుండియు తండ్రి, తనయుల ఆధ్యాత్మికతకు దోహదమిచ్చినది. ఆ నాటి సన్న్యాసస్వీకార కార్యక్రమములో సభామధ్యమున నిలబడి తనయంగీకారమును హృదయపూర్వకముగ, మహానందముతో తెలియజేసినారు.

ఆనాటి ఆ దృశ్యం భారత చరిత్రలోనే సువర్ణాక్షరములతో లిఖించదగిన సన్నివేశమని శ్రీ మలయాళ గురుదేవులు ఆనాటి సభలో తెలియజేసినారు.

ఈ తల్లి తనమనసులో ఈ విధముగ తలచినది మరియు,

చదివి చదివి చదివి చావంగ నేటికి,
చావు లేని చదువు చదువ వలయు,

అని ఆనాటి ఆ సభాదృశ్యం అధ్యాత్మిక శిరోమణులైన గార్గి, మైత్రేయి, మదాలసలను స్ఫురణకు తెచ్చినది.

పరమ సాధ్వీమతల్లి మాతృశ్రీ సుశీలాదేవి భర్త ధర్మకార్యముల కెల్ల తోడు నీడయై త్యాగియై, విరాగియై, ఆదర్శియై వెన్నంటి సహధర్మచారిణి నామమునకే వన్నెతెచ్చె శోభకూర్చె. ఆనంద మోహన్ సన్న్యాస దీక్షాకార్యక్రమములో రెండవరోజు తల్లి అనుజ్ఞ.

రెండవదినము ఉదయము 9.30 గం॥నుండి 10.30 గం॥ మధ్య సింహలగ్నమున బ్రహ్మచారి ఆనందమోహన్ తమ గురుదేవులు, ఆచార్యులు, యతులు, పండితులు, భక్తులు భక్తురాండ్రు, సంస్కృత కళాశాల విద్యార్థులతో కూడిన సమావేశమునకు ప్రదక్షిణ నమస్కార మొనర్చి ఆ సభామధ్యమున నిలిచియున్న తన తల్లియగు సుశీలాదేవిగారికి సాష్టాంగ నమస్కారమొనర్చి ఆమె నిట్లు ప్రార్థించెను.

"మాతః సన్న్యాస మిచ్ఛామి, దేహ్యనుజ్ఞాం శుభాం హి మే
సన్న్యాసేనైవ నిర్వాణమితి, వేదాంత నిశ్చయః ।

ఈ ప్రార్థనకు తల్లి తనయంగీకారమును ఈ విధముగ తెలియజేసెను.

1. సాధు వత్స త్వయా ప్రోక్తం యథేచ్ఛసి తథా కురు ।
   యతః సన్న్యసనాత్తాత!సఫలం జన్మ మామకమ్ ॥

2. పితరం మాంశ్చ లోకాంశ్చ స్వాత్మానం వంశమేవ చ ।
   పితౄన్ దేవాంస్తథా సర్వాన్ ఉద్ధర త్వం గుణాంబుధే ॥

Scanned with CamS

ఓ పరిశుద్ధాత్మ స్వరూపులారా! నా పుత్రుడు ఆనందమోహన్ తాను సన్యాసాశ్రమమును స్వీకరింపనిచ్చగించి ఇందుకై విధిననుసరించి తల్లియైన నా అనుమతి కోరినందున అట్టి నా అనుమతిని నేనివుడు హృదయపూర్వకముగ మహానందముతో నొసగుచున్నాను. మాతా పితరులకు తెలియకగాని, వారి సమ్మతిలేకగాని వెడలిపోయి సన్యాసమును స్వీకరింపబోవువారి విషయముననే తల్లితండ్రుల యంగీకారము అవసరము కావచ్చును. గౌతమబుద్ధుడు, ఆదిశంకరులు, రమణమహర్షి ఇంక మరికొంతమంది మహనీయులు తమ జననీజనకుల యంగీకారమును బడయకనే గృహములనుండి వెడలిపోయిరి. వీరిలో ఆదిశంకరులు కొన్ని ఉపాయములు పన్ని ఎంతయో కష్టముతో తల్లిని మెప్పించవలసి వచ్చెను. కాన అట్టి విషయమై సన్యాసస్వీకారమునకు, వారి తల్లితండ్రుల స్వేచ్ఛాపూరక యనుమతి అవసరమని భావింపబడెను.

అయితే నాకుమారుని అనేక జన్మార్జిత పుణ్యకర్మ పరిపాక వశమున ద్వాదశ వత్సరముల క్రిందటనే తల్లిదండ్రులైన మేము మా కుమారుని స్వామి వివేకానందుని జీవిత రహస్యములను బోధించి బుద్ధిపూర్వకముగ వానిని సన్యాసమునకు ప్రేరేపించి గృహము నుండి సాగనంపితిమి.

న కర్మణా న ప్రజయా ధనేన
త్యాగేనైకే అమృతత్వమానశుః ।

అను శ్రుతి వాక్యములను బట్టి జీవన్ముక్తి సుఖము నిచ్చు సన్న్యాసము యొక్క మహిమను ఏనాడో మా బిడ్డకు మేము బోధించితిమి.

నేడు ప్రేషోచ్చారణ పూర్వకముగ జరుగు నా కుమారుని పరమహంస విద్వత్సన్యాస స్వీకార సమయమున పూర్వము ద్వాదశాబ్దముల

క్రిందట మేమొసగిన యనుమతిని తిరిగి ఈ సుదినమున బ్రహ్మానందముతో ధ్రువపరచి మేము కృతకృత్యులగుచున్నాము.

ధన్యా మాతా పితా ధన్యో గోత్రం ధన్యం కులోద్భవః ।
ధన్యా చ వసుధా దేవీ యత్ర స్యాద్గురుభక్తతా ॥

ఈ వాక్యము మా యందు సార్థకమైనదని ఎవరైన భావించినచో ఆ యోగ్యత మా సద్గురుసార్వభౌమ, సకల చరాచర సుఖాభిలాషి ప్రేమానందస్వరూప పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీ వ్యాసాశ్రమ స్థాపక, ఉపనిషదుద్యానవన కేళీకలకంఠ శ్రీ అసంగానందగిరి మలయాళ స్వాములవారి నిర్హేతుక అసమాన కరుణా కటాక్ష లబ్ధము గాక అన్యమేమై నుండనోపు!

హరిః ఓం తత్సత్

శ్రీ స్వామి విద్యాప్రకాశానంద
ఆధ్యాత్మిక ప్రచారమునకు-
శ్రీ తిరుమల వేంకటేశ్వరుడు మెచ్చి
శేష వస్త్రము కప్పె.

కాళహస్తీశ్వరుడు మెచ్చి
అభయహస్తమెత్తి ఆశీర్వదించె

భక్త కన్నప్ప మెచ్చె తనపేరు
జగత్ విఖ్యాత మైనదటంచు

సద్గురు మలయాళదేవులు మెచ్చి
తమ సనాతన జ్ఞాన సభలకు
ఆజన్మాధ్యక్ష పదవిచ్చి గౌరవించె

Scanned with CamS

శ్రీ సత్యసాయీశ్వరుడు మెచ్చి
ప్రీతితో శివలింగము సృష్టించి యిచ్చె

1987, సాధు సమ్మేళన సందర్భమున పుట్టపర్తి
ప్రశాంతి నిలయములో

తల్లితండ్రులు సంతసించిరి
ఏకేనాపి సుపుత్రేణ విద్యాయుక్తేన సాధునా।
ఆహ్లాదితం కులం సర్వం యథా చంద్రేణ శర్వరీ ॥

వంశము సంతసించె
పున్నామనరకము తప్పెనటంచు

మాతా ధన్యా పితా ధన్యో గోత్రం ధన్యం కులోద్భవః।
ధన్యాచ వసుధా దేవి యత్ర స్యాద్గురుభక్తతా ॥

ప్రజలు సంతసించిరి "గీతా గంగోదకం పీత్వా పునర్జన్మన విద్యతే" ముక్కోటి దేవతలు సంతసించి పుష్పవృష్టి కురిపించిరి. తథాస్తు దేవతలు పల్కిరి శతమానం భవతు యనుచు.

ఓం తత్సత్ హరిః ఓం

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి జీవిత సంగ్రహము

1. గీతామృత సుబోధలన్ జగతిని చాటగ
సర్వమత సమన్వయము అవని బోధింపగ
అరుదెంచె, ఈ విశ్వ జగన్నాటక రంగమునకు
జన్మించె, సుశీలారామ తనయుడై, ఆనందమోహనుడై.

గేయరచన –బుర్రకథరాగం

2. విజయవాడ నగరాన – ఘనవిద్యలు నేర్చి
మచిలీపట్నాన – పట్టాను చేపట్టి
కాశీపట్నాన 'కోవిద' – డిగ్రీని పొంది
బహుమతు లెన్నెన్నొ బడసె – ప్రథమశ్రేణిలో
స్వర్ణపతకాలు – రజత పతకాలు
బృహద్గ్రంథరాజాలు – ఎన్నెన్నో
విజయమును పొందెను మనస్వామి
దిగ్విజయమును పొందెను మనస్వామి.

3. తండ్రికోరిక మేరకు – వ్యాసాశ్రమము చేరి
శ్రీ మలయాళగురుసన్నిధి – ఆత్మవిద్యలు నేర్చి
ద్వాదశ వర్షములు కఠిన – తపశ్చర్య గావించి
అపక్వాహారము సేవించి – ఆత్మసంయమము పొంది
అరిషడ్వర్గాల ఘనవిజయుడై – సన్న్యాసదీక్షను పొంది
కాళహస్తి క్షేత్రాన – శుకబ్రహ్మాశ్రమము స్థాపించి
గీతామందిరము నెలకొల్పె స్వామి
ఈశ్వరాలయమును నిర్మించె స్వామి.

Scanned with CamS

4. వేదాంతగ్రంథాలు - వేలువేలుగ రచియించి
వేదాంతతత్త్వంబు - వాడ వాడల చాటి
గీతోపదేశంబు - పల్లె పట్టణముల చాటి
అష్టోత్తర శత - గీతాయజ్ఞాలు గావించి
కఠిన వేదాంతము - తేట తెల్లముగ బోధించి
అంతర్జ్యోతిని వెల్గించి - ఆత్మానుభూతి కల్గించి
భక్తి జ్ఞాన మార్గాలు - బోధించె స్వామి
ముక్తికి త్రోవను - చూపెన్ మనస్వామి

5. భౌతిక నేత్ర చికిత్సకు - ఆసుపత్రిని కట్టించి
బీద సాదలకు నిత్యాన్న - దానము గావించి
ఆ కృష్ణయ్య శంఖారావమ్ము - విరివిగా వినిపింప
గీతాప్రచార రథము - సిద్ధపరచి
మానవత్వమునుండి - మాధవత్వమునకు చేర్చి
సంఘసేవలో తరించె స్వామి
సత్యధర్మాలు బోధించె మనస్వామి
జ్ఞాననేత్రమును తెరిపించె స్వామి.

6. ఆ ప్రేమకు రూపమే మనస్వామి
విద్యాలయముల పోషించె స్వామి
వైద్యాలయముల స్థాపించె స్వామి
మాధవత్వమును చూపెనే మనస్వామి

దివ్యత్వమును పొందెను మనస్వామి

ఓం తత్సత్

శ్రీ గురుసార్వ భౌములు మహర్షిమలయాళ
స్వాములవారి పాద పద్మములకును
ప్రియశిష్యులు
శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి
చరణ కమలములకును
నమస్సుమము లర్పించుచు
శ్రీమతి వై. ఓంకారం, పుట్టపర్తి

ఈ ఆధ్యాత్మిక నాటకరంగంలో
1. ఆదేశించిన భగవంతునకు
2. తీర్చిదిద్దిన గురుదేవులకును
3. సహకరించిన మాతృదేవికి
4. మార్గము చూపిన తండ్రికి
5. ఆచరించిన పుత్రునకు
ఈ శతజయంతి శుభ సందర్భమున
నమ స్సుమములర్పిస్తూ
శ్రీమతి ఓంకారం

శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి
వారి సన్యాస స్వీకార షష్ట్యబ్ది
2007, జూలై 25 మొదలు-28 గురుపూర్ణిమ వరకు

అది శ్రీ ఆనందమోహన్ ఏర్పేడు వ్యాసాశ్రమంలో శ్రీ మహర్షి మలయాళస్వాములవారి చరణ సన్నిధిన 12 సం॥ తపశ్చర్య నియమ నిష్ఠలతో, అపక్వాహార దీక్షతో పూర్తిగావించుకొని సన్యాస స్వీకారమునకు గురుదేవులచే సుముహూర్తము నిశ్చయింపబడిన శుభసమయము.

అది 1947 జూన్ 29, ఆదివారం మొదలు జూలై3వతేదీ గురువారం వరకు తెలుగు సం॥ "సర్వజిత్ నామసంవత్సరం" ఆషాడ శుద్ధశయనైకాదశి మొదలగు గురు పూర్ణిమవరకు-

ఐదు దినములు పంచాహ్నిక విధానమున సశాస్త్రీయముగ కాశీ వేదపండితుల పౌరోహిత్యముతో, గురుదేవుల చరణ కమలములతో, జననీ జనకుల అనుజ్ఞతతో వారి సమక్షమున దివ్యముగ అతి పవిత్రముగ జరుపబడినది.

ఈ సన్యాసక్రతువులోని విశేషమేమనగ, తల్లిదండ్రులు ఇష్టపూర్వకముగ పుత్రునకు సన్యాస మిప్పించుటయే. శంకరాచార్యులవారి మొదలు, ఇప్పటి వరకు తల్లి, తండ్రుల అనుజ్ఞ ఎవరికిని లభించలేదని, ఇది జగత్ ప్రసిద్ధి చెందిన సన్నివేశమని, ఇది సువర్ణాక్షరములతో లిఖించవలసిన విశేషమని, ఆనాటి సన్యాసక్రతువు అంతిమోపన్యాసములో గురుదేవులు మలయాళయతీంద్రులు భావావేశంతో కంటి వెంట ఆనంద బాష్పములు రాల ప్రవచించినారు. మరియు తమకు ఇటువంటి భాగ్యము కలుగనందున తల్లితండ్రులకు చెప్పకనే ఇల్లు వీడి వచ్చితినని తెలిపినారు.

ఆనాటి సన్యాస స్వీకార కార్యక్రమమునకు వ్యాసాశ్రమ భక్తకోటి అంతయు తరలివచ్చిరి. వారి కాహ్వానములు "యథార్థభారతి" పత్రికా ముఖమున తెలియపరిచిరి. ఆ, అపూర్వమైన సన్యాసస్వీకార కార్యక్రమమును తిలకించిన చక్రవర్తులు హర్షరోమాంక పులకితులై ఇటువంటి సన్నివేశము నభూతో న భవిష్యతి అని శ్లాఘించుచు మలయాళ గురుదేవులకు వందనమాచరించి, విద్యాప్రకాశానందులకు ఆశీస్సులందించి గృహోన్ముఖులైరి.

"ఇది, అరవై, (60) సం॥ నాటి మాట"

ఈ కాలచక్రంలో 60 సం॥ పూర్తయి తిరిగి, సర్వజిత్ నామ సంవత్సరం, శయనైకాదశి గురుపూర్ణిమ వచ్చినది. ఆనాటి జ్ఞాపకములు నామదిన మెదలి ఆనంద పరవశనై, ఆ ఆనందమును భక్త కోటితో పంచుకొన నెంచి ఈ రచన వ్రాయుటయైనది. ఈ షష్ట్యబ్ది శుభసమయములో వారి చరిత్ర పునశ్చరణ చేసుకొనుట ధర్మమని భావించుచున్నాను.

శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారి ఆనాటి సన్యాస స్వీకార ఘట్టములు మంత్రములు మంత్రార్థములు భక్తకోటికి తెలుపుటయే నారచనయొక్క ముఖ్యోద్దేశ్యము. ఈ 60 సం॥ చక్రభ్రమణములో శ్రీవిద్యాప్రకాశానందస్వామివారి ఆధ్యాత్మిక ప్రచారమంతయు ఇమిడి యున్నది.

వారి సన్యాసస్వీకారం తదుపరి 3 సం॥లకు గురుదేవుల సమ్మతితో 1950 జనవరి 20వ తేది కాళహస్తిలోని స్వర్ణముఖి తీరాన "శుకబ్రహ్మాశ్రమాన్ని" స్థాపించినారు. తదుపరి బృహత్ వేదాన్త గ్రంధరచనలు, ఆధ్యాత్మిక ధర్మప్రచారం, 108 గీతాజ్ఞానయజ్ఞాలు, గీతాసప్తాహాలు, విగ్రహప్రతిష్ఠలు, గీతామందిర ఆవిష్కరణలు, సభలు, సమావేశాలు, ఆశ్రమ వార్షికోత్సవ, మౌక్తికోత్సవ, రజతోత్సవాలు, త్రినేత్ర వైద్యాలయస్థాపన,

Scanned with CamS

ఆనందవైద్యాలయము, గీతామందిరము, "శివ" దేవాలయము, అన్నశాల, గోశాల స్థాపనలు, మరెన్నియో విశేషములు జరిగి నిత్యకళ్యాణమై యొప్పిన వేదాన్తభేరి మాసపత్రిక వెలసినది.

కఠిన వేదాన్తం పండిత పామర జనరంజకమై యొప్పినది. బృహత్ గీతామకరందం మొదలు మానసబోధ అనే గేయరచన వరకు దాదాపు 40 గ్రంథములు ఆడియోలు, వీడియోలు, అందరికీ కరతలామలకమైనవి. భగవద్గీత ఇంటింటా వెలసినది. శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి భగవంతుడు గీతాప్రచారమునకు ఎన్నుకొన్న దైవదూత. కావుననే వారికి గంగానదిలో(కాశీలో) సంస్కృత లిపి భగవద్గీత లభించినది. అదియే భగవంతుని ఆదేశం.

చివరికి వారి 84వ ఏట, భగవదాజ్ఞతో వారు తనువు చాలించుట భక్తవరుల నందరిని దుఃఖాబ్ధిని ముంచివేసినది. అందరి మనసులు బాధాతప్తమైనవి. వారి స్మృతి చిహ్నంగా శుకబ్రహ్మాశ్రమంలో అధిష్ఠాన మందిరం వెలసి నిత్యపూజలందుకొనుచున్నది.

భౌతికముగ వారు లేనప్పటికిని, వారి ఆధ్యాత్మిక సుబోధలు భక్తుల హృదయాంతరాళములలో మారుమ్రోగుచునేయున్నవి. వారి ఆధ్యాత్మిక గ్రంథములు దేశవిదేశములలో ఖ్యాతిగాంచినవి. గీతామకరందము మొదలు మానసబోధవరకు ఇది సర్వజన విదితమే. గీతామకరందం వంటి విపులమైన వ్యాఖ్య ఇంతవరకు వెలువడలేదు. అమెరికాలోని ఫిట్స్‌బర్గ్ వేంకటేశ్వర ఆలయంలో గీతామకరంద నిత్యపారాయణం జరుగుతుంది. ఒక ప్రముఖ సినిమా దర్శకుడు ఈ గీతామకరందాన్ని తన సినిమాలోని కోర్టు సన్నివేశములో ప్రమాణగ్రంథంగా చూపించినాడు. ఈ విధంగా గీతామకరందం ప్రముఖ స్థానాన్ని సంపాదించుకొన్నది. వీరి

వేదాన్తగ్రంథములు చదివి, ఖైదీలుకూడ సత్ప్రవర్తకులైనారు.

ఆషాఢమాసం శయనైకాదశి మొదలు గురుపూర్ణిమ వరకు ఐదుదినములు ఆధ్యాత్మికమునకు హిందువులకు అతి పవిత్రమైనదినములు. ఆనాటినుండియే సాధనావరులు చాతుర్మాస్య వ్రతములను ప్రారంభించెదరు.(4) నెలలు.

మరియు తెలుగు సంవత్సరములలో ప్రభవ, విభవ, మొదలు అక్షయ నామ సంవత్సరం వరకు గల అరవైసంవత్సరములలో "సర్వజిత్ నామసంవత్సరం" ఆధ్యాత్మికతకు అతిప్రధానమైనదని, హిమవత్ పర్వతరాజు పుత్రి ఉమ(పార్వతి) శివుని గూర్చి అఖండ తపస్సుచేసి శివుని కృపకు పాత్రురాలైనది ఈ సర్వజిత్ నామసంవత్సరమేనని, ఆ సంవత్సరమునకు ఆపేరు పార్వతియే పెట్టినదని, "భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు వారి ఉగాది దివ్యోపన్యాసంలో ప్రవచించినారు."సర్వజిత్" అనగా" అన్ని ములను కలుగచేయునది అని నుడివినారు.

మరియు 1947 వ సంవత్సరములోనే మన భారతదేశం, పరదేశ దాస్య విముక్తి కలిగి స్వతంత్ర భారతంగా వెలుగొందినది. కాన వీరు సన్న్యాసం తీసుకొన్న తెలుగు సంవత్సరము, ఇంగ్లీషు సంవత్సరము, తెలుగుమాసం, పక్షం, తిథులు, అతిపవిత్రమైనవిగా లభించుట, భగవత్కృప, గురుదేవుల ఆశీర్వాదం, ఆనందమోహనుల జన్మజన్మల సుకృతఫలంగా భావించుచున్నాను. కావుననే వారు ఆధ్యాత్మిక మార్గంలో మణిపూసవలె రాణించగలిగినారు.

శ్రీ మహర్షి మలయాళస్వాములవారు 1913 సం॥ చివరలో తిరుమలలోని గోగర్భంలో తపశ్చర్యకుపక్రమించినారు శ్రీఆనందమోహనులు

1914, ఏప్రిల్‌లో జన్మించినారు. కాన వారి తపఃకాంతిరేఖలు ప్రియశిష్యునిలో ఆనాడే ప్రవేశించినవి. ఇది దైవనిర్ణయం, గురుదేవులు ప్రియశిష్యుని ఎన్నుకొనుట ఆనాడే జరిగిపోయినది. ఎవరు ఎక్కడ ఎప్పుడెప్పుడు ఏమేమి చేయవలెనో అంతా భగవద్విదితం. దానిని పురస్కరించుకొనియే సర్వము జరిగిపోవుచుండును.

మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే చరాచరమ్ ।
హేతునాఽనేన తు కౌంతేయ జగద్విపరివర్తతే ॥ గీత 9-10

తదుపరి సూత్రధారుడు జగన్నాటకరంగంలో తెరను దించివేయును.

ఆనందమోహనుల జననీజనకులు జన్మతః వేదాన్తులు. తండ్రిగారు రామస్వామి బి.ఏ బి.యల్, వేదవిజ్ఞానమునందు సునిశిత పండితులు. కావున తన పంచపుత్రులలో ఒకరినైనా ఆధ్యాత్మికమార్గంలో ప్రవేశపెట్టి లోక కళ్యాణమొనర్చవలెనని తలపు కలదు. ఆ అభిప్రాయమునే వారు వారి వంశ చరిత్ర 8 తరములవారివి సేకరించి ప్రచురించిన సందర్భంలో ఆ వంశచక్రం మీద ఈ విధముగ ముద్రించినారు. ఈ వంశ చక్రం 1933 వ సం॥లో ముద్రించినారు. అప్పటికి ఆనందమోహన్ విద్యార్థి దశలోనున్నారు.

ఏకేనాపి సుపుత్రేణ విద్యాయుక్తేన సాధునా ।
ఆహ్లాదితం కులం సర్వం యథా చంద్రేణ శర్వరీ ॥

ఒక్క చంద్రుడు ఆకాశమునంతను ప్రకాశింపచేయునట్లు, సాధుసంపన్నుడైన సుపుత్రుడు ఒక్కడైనను వంశము నంతను ప్రకాశింపచేయును అని అర్థం. వంశమునేకాదు లోకమంతా ప్రకాశింపజేయును. ఉత్తరోత్తరా ఆ అదృష్టం ఆనంద మోహన్‌కి దక్కినది.

వారిని 1934 లో గురుదేవుల సన్నిధికి వ్యాసాశ్రమం పంపినారు. శ్రీరామస్వామిగారు మలయాళస్వాముల వారి భక్తకోటిలోని ప్రముఖులు.

ఆధ్యాత్మిక విద్య సామాన్య విద్యలవలె కంఠస్థం చేసి వ్రాసెడి విద్య కాదు. మొదలు పూర్వజన్మ సుకృతం, భగవత్కృప, ఆత్మానుభూతి, క్రమశిక్షణ, గురుదేవులకృప, విశ్వాసం వున్ననే కాని లభించనేరవు. పూర్వజన్మసుకృతం వలన ఆనందమోహనులు ఆధ్యాత్మిక సోపానముల నధిగమించి గీతా సుబోధలను దేశదేశముల వాడవాడలా ప్రబోధించినారు.

1923 లో రామస్వామి (బి.ఏ.బియల్) గారు దేశసేవ, సంఘసేవ, ఆధ్యాత్మిక సేవ చేయతలచిన వారై, తమప్రఖ్యాతివహించిన న్యాయవాద వృత్తిని అవలీలగ త్యజించి సేవామార్గంలో ప్రవేశించినారు.

తండ్రిగారి ఆధ్యాత్మికశిక్షణలో మాతృదేవి అపరశారదాదేవివలె, పరిపూర్ణత చెందినారు. కావుననే తమపుత్రుని ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశపెట్టుటకును, సన్యాసస్వీకారమునకును, అమందానందముతో అనుజ్ఞనిచ్చిన మహనీయురాలామె. ఆమెయే పుత్రుని ఆధ్యాత్మికతకు ఒప్పుకొననిచో, శ్రీ, విద్యాప్రకాశానందస్వామి, సామాన్యమానవునివలె, ఉద్యోగం, సంసారం చేసికొనుచు నుండెడివారు. భార్య అంగీకరించనిచో తండ్రి, ఏమి చేయలేకపోయెడివారు. దైవాంశ సంభూతులైన దశరథమహారాజే ఏమి చేయలేక పోయినారు. ఇక మానవ మాత్రులెంత, ఆ మహాతల్లి మనసులో తలచినది. "చదువులన్నియు చదివి, చావంగ నేటికి చావులేని చదువు చదువవలయు"నని కావుననే తండ్రిగారి అభీష్టము నెరవేరి లోక కళ్యాణం జరిగినది.

" పరమ సాధ్వీమతల్లి, మాతృ సుశీలాదేవి
భర్త ధర్మకార్యములకెల్ల, తోడునీడయై

Scanned with CamS

త్యాగియై, విరాగియై, ఆదర్శియై, వెన్నంటి
సహధర్మచారిణీ నామమునకె, వన్నె తెచ్చె, శోభగూర్చె"

కాన, ప్రతి కుటుంబములోని తల్లియు, ఎంతో కొంత ఆధ్యాత్మికతను అలవరచుకొన్నచో, తన కుటుంబమే కాక, సంఘము, తద్వారా దేశము పవిత్రతచెంది, భారతదేశము వెనుకటి ఔన్నత్యమును పొందగలదని విశ్వసించుచున్నాను. ఈ సందర్భములో భగవాన్ సత్యసాయి బాబావారు రచించిన ఒక కవిత స్ఫురణకు వచ్చి ఇచట తెలుపుటయైనది.

కౌసల్య వరశుక్తి గర్భమౌటను కదా
రాముడు దేవుడై రమణ గాంచె,
సీతామహాసాధ్వి చెలగిపెంచుట కదా
కవలు కుశలవులు ఘనులు అగుట
జిజియా లలామయు చెలగి పెంచుటకదా
వీర శివాజియు పేరుగాంచె,
పుతలీబాయి రంజిల్లి పెంచుటకదా
గాంధి మహాత్ముడై పేరుగాంచె,
ఈశ్వరాంబా సాధ్వి ఎత్తి పెంచుటకదా
సత్యన్నారాయణకు విశ్వఖ్యాతి కలిగె,

అహరహంబును బ్రోచెడి అమ్మకంటె
ఆదరంబగు వ్యక్తులు ఈ అవని కలరె?
అమ్మ ప్రథమాక్షరంబు ఆద్యక్షరంబు
ప్రాణికోటికి అమ్మయె, ప్రాణసమము

శ్రీ భగవాన్ బాబా, ప్రశాంతి నిలయము

కావున వేదములు "మాతృదేవో భవ" అని కన్న తల్లికి ప్రథమస్థానమునిచ్చి గౌరవించినవి. కాన తల్లులందరు తమ తమ

తనయులకు ధర్మములు బోధించి వేదములను గౌరవించవలెను. కన్న తల్లిని గురువుకంటె మిన్నగ శాస్త్రములు తెలిపినవి.

"మాతృదేవో భవ, పితృదేవో భవ"
ఆచార్యదేవో భవ
అతిథిదేవో భవ॥ అని తెలియజేసినవి.

సన్న్యాసస్వీకారం తదుపరి ఐదవరోజు కార్యక్రమంలో మలయాళగురుదేవులు శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామిని ప్రథమంగా కన్న తల్లికి సాష్టాంగ వందనం ఆచరించమని సెలవిచ్చిరి. తదుపరి కన్న తండ్రిచేత సన్న్యాస పుత్రునకు సాష్టాంగ వందనము ఆచరింపచేసిరి. శాస్త్రమీరీతిగయున్నదట. ఆహా! పుత్రుడు ఎదిగిపోయెను తండ్రి కంటెను మిన్నగ అని వేనోళ్ల పొగడుచు భక్తవరులెల్లరు గురుదేవులకు వందన మర్పించి గృహోన్ముఖులైరి. ఈ సన్నివేశమునకు భక్తకోటి అంతయు హర్షరోమాంకపులకితులైరి.

1952లో విద్యాప్రకాశానంద జననీజనకులు దేశసేవ, సంఘసేవ, ఆధ్యాత్మికసేవ తదుపరి వానప్రస్థాశ్రమంలో నుండ తలచినవారై, శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి తీరాన ఐదు ఎకరాల మామిడితోటను సొంత వ్యయముతో కొని అందు కుటీరము ఏర్పరచుకొని నిష్ఠాగరిష్ఠులై, భగవద్ధ్యాన తత్పరులై, భక్తజనులకు ఆధ్యాత్మిక బోధలు గరవుచు కాలమును సద్వినియోగము చేసిరి. తండ్రిగారు వానప్రస్థంలో 10 సంవత్సరముల కాలం జీవించి వారి 75 వ యేట పవిత్ర ఏకాదశినాడు ఉదయం 8 గంటలకు ప్రణవోచ్చారణతో తనువును చాలించి, ఆ పరమాత్మలో లీనమైన పుణ్యాత్ములు. వారి ఏకాదశి మరణమే వారి పవిత్రతను తెలుపుతున్నది.

వారి తదనంతరం మాతృదేవి ఆ ఆశ్రమములోనే 27 సం॥ కాలం కృష్ణ నామోచ్చారణతో, వైరాగ్యముతో, ధైర్యముగ, ఆదర్శముగా, ఒంటరి

Scanned with CamS

కాలంగడిపి తమ 87వ ఏట పంచమీతిథి నాడు పగలు 12గం॥కు, ఆ కృష్ణపరమాత్మపాదారవిందములలో చేరిపోయిన ధన్యజీవి. 1987-సం॥జూన్1 తేదీన వారి సమాధి ఆ ఆశ్రమంలోని మామిడి తోటలో చేయబడినవి. పితృదేవులు ముందుగానే ఆ సమాధులమీద ఏ ఏ శ్లోకములు వ్రాయవలెనో నమూనా వ్రాసిపెట్టియున్నారు. కాన ఆ రీతిగ సమాధులు వాటిమీద శ్లోకములు వ్రాయించుటయైనది.

"అందరి మాతయై భూమాత ఒడిలోన ఒదిగిపోయె,
ఆశ్రమవాసుల గళములు మూగబోయె
భక్తుల కన్నీరు కాల్వలాయె":

ఆ దృశ్యము భరించలేని భాస్కరుడు అస్తమాద్రికి ఒరిగిపోయె,

37 సం॥ల కాలం ఆశ్రమవాసం చేసిన ఆ, మహాతల్లి శాశ్వత సమాధికి చేరిపోయె, మహిళాలోకం కన్నీటి తర్పణము లర్పించినది.

యం యం వాపి స్మరన్ భావం త్యజత్యన్తే కలేబరమ్ ।
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥ గీత 8-6

శ్రీ మలయాళగురుదేవులు ప్రప్రథమంగా తమ పవిత్ర హస్తములతో సన్న్యాస దీక్షనిచ్చిన అదృష్టం, శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామికే దక్కినది. కావుననే తమ గురుపరంపరగా వస్తున్న పవిత్రకమండలమును ప్రీతి పూరకముగ సమర్పించి ఆశీర్వదించి తమ తపః శక్తిని కొంత ధార పోసినారు.ఆ, కమండలము కాళహస్తిలోని, శుకబ్రహ్మాశ్రమములో పూజా మందిరములో భద్రపరచబడినది.

మరియు గురుదేవులు తమ సనాతనజ్ఞాన మహాసభలకు శ్రీవిద్యాప్రకాశానందకు, ఆజన్మ అధ్యక్ష పదవినిచ్చి తమప్రీతిని, సంతృప్తిని

వెల్లడించి గౌరవించిరి. శ్రీ విద్యాప్రకాశానందస్వామియు తమ తనువు చాలించువరకు అధ్యక్ష పదవిని చేపట్టి గురు ఆజ్ఞను సంతృప్తిగ నెరవేర్చిరి. అధ్యక్షపదవి అనగా సామాన్యమైనది కాదు. సభకు కిరీటమువంటిది.

గీతామృత సుబోధలన్ జగతిని చాటగ
సర్వమత సమన్వయము అవని బోధింపగ
అరుదెంచె ఈ విశ్వజగన్నాటక రంగమునకు
జన్మించె "సుశీలారామతనయుడై, "ఆనందమోహనుడై.

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి నిర్యాణం తదుపరి ద్వితీయ పీఠాధిపతిగ, శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు శుకబ్రహ్మాశ్రమ నిర్వహణ చేపట్టి చాలా అభివృద్ధి పరచినారు. వారు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి పవిత్రహస్తములతో సన్యాసదీక్ష స్వీకరించినారు. వారు మలయాళస్వాముల వారి ఆశ్రమంలోని సంస్కృత పాఠశాలలో పూర్వవిద్యార్థి పూర్వనామధేయం "గోపాల్". శుకబ్రహ్మాశ్రమస్థాపన తదుపరి, శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిని వీడలేక వ్యాసాశ్రమంలో చదువు చాలించి వారివెంట వచ్చేవారు. శుకబ్రహ్మాశ్రమ నిర్వహణ పనులన్నీ వారే నిర్వహించారు. తదుపరి ఆశ్రమ మేనేజరుగా, వేదాన్తభేరి మాసపత్రిక ఎడిటర్‌గా వ్యవహరించి అభివృద్ధి పరచినారు. తదుపరి కొంతకాలం తపస్సిద్ధికొరకు హిమాలయాలకు వెళ్ళివచ్చి శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి వారినుండి సన్న్యాసం స్వీకరించి ద్వితీయ పీఠాధిపతిగా నెలకొన్నారు.

శ్రీ సముద్రాల లక్ష్మణయ్యగారు - వీరు కూడా మలయాళస్వామి ఆశ్రమ సంస్కృత పాఠశాలలో పూర్వ విద్యార్థియే. వ్యాసాశ్రమ విద్యాభ్యాసం

తదుపరి, తిరుపతి సంస్కృత కళాశాలలో ఇంకా ఇతరత్రా విద్యనభ్యసించి శ్రీమలయాళ స్వామివారి చరిత్ర, శ్రీ విద్యాప్రకాశానందగిరి జీవిత చరిత్ర రచించిరి. శ్రీ స్వామి జీవితచరిత్రను విపులముగా చదవదలంచువారు శ్రీ లక్ష్మణయ్యగారి రచనలను పఠించండి! వ్రాసిన ధన్యజీవులు, వ్యాసాశ్రమము మరియు శుకబ్రహ్మాశ్రమ సేవలు ఒనరించిన ధన్యాత్ములు, సంస్కృత భాషాకోవిదులు, పండితులు. ఇటీవలనే సంస్కృతవిశ్వవిద్యాలయంవారు వీరికి 'మహామహోపాధ్యాయ' బిరుదునిచ్చి సత్కరించినారు.

శ్రీ ఈశ్వర్ 12 సం॥ల ప్రాయంలో శుకబ్రహ్మాశ్రమ పాఠశాలకు వచ్చారు. గోపాలస్వామి తదుపరి ఆశ్రమం పనులు నిర్వహించారు. వేదాన్తభేరి మాసపత్రిక పనులు కూడ నిర్వహించారు. కొంతకాలం ఆశ్రమం మేనేజ్ మెంట్ చేశారు.

శ్రీ విజయానందకు శ్రీ స్వాములవారి పరిచర్య చేస్తూ వెంట జంట వుండి, సేవచేసే భాగ్యం లభించింది. శ్రీ స్వాముల వారి నిర్యాణం తదుపరి కూడ ఆశ్రమంలోనే వుండినారీ బ్రహ్మచారి.

ఈ విధముగ శ్రీ శుకబ్రహ్మాశ్రమం అభివృద్ధి చెందుచు, భక్తవరులతో, యాత్రికులతో నిత్యకళ్యాణమై యొప్పుచున్నది.

హరిః ఓం తత్సత్, లోకాస్సమస్తాః సుఖినో భవంతు ॥

ఆనందమోహన్‌ల సంగ్రహ చరిత్ర - గేయరచన

సద్గురుభ్యో నమః

"ఆనందనామ సంవత్సరంలో
ఆనంద కమలం ఒకటి
విశ్వంలో వికసించినది".

దేశదేశముల(గీతా) కాంతులు విరజిమ్మినవి
వాడవాడలా (గీతా) సుగంధములు వ్యాపించినవి
అష్టదిక్కుల (గీతా) మకరందము వెదజల్లినది
పానము చేసిరి, పండిత పామర జనులెల్లరును

"కృష్ణుని కోర్కె మేరకు " జన్మించె నొక కారణజన్ముడు
సుశీలా, రామస్వాముల నోముల పంటగ
జన సంతతి, పుణ్య ఫలంబుగ
జన్మించెను, "ఆనందమోహనుడు"
(లోకకల్యాణమునకై, భువిని)

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత!
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥

ఎప్పుడైతే ధర్మమునకు హాని కల్గునో అపుడు నాకు నేనే సృష్టించుకొందును (అవతరింతును) అనునట్లుగ కృష్ణుడు పంపెను "తన ప్రతినిధిని"(ఆనందులను భువికి లోక కళ్యాణమునకై).

దినదినాభివృద్ధి చెందెను, -"శుక్ల పక్ష చంద్రుని రీతి"
తృటిలో నేర్చెను లౌకిక విద్యలనెల్ల
బహుమతులు పొందెను ప్రథమశ్రేణిలో
రజతపతకములు, స్వర్ణపతకములు,

Scanned with CamS

బృహద్గ్రంథ రాజము లెన్నెన్నియో
పట్టభద్రుడాయె, మచిలీపట్టణమున (బందరు)
ఉన్నత విద్యకై వెడలెను బనారస్ పట్టణమునకు(కాశి)
ఆనందమాయె అధ్యాపకులకు ఆనందుల చూచి
తన విద్యలెల్ల చదువుచుండె, శ్రద్ధాసక్తులతో ఆనందమోహనుదు
ఒక దినము వర్తమానమంపిరి తండ్రి, తనయునకు(లేఖ)
నిను అర్పించితి సద్గురు మలయాళగురుదేవులకు (వాగ్దానమొసంగి)
విద్య ముగించి త్వరగ రమ్ము గృహమున కనుచు
నిశ్చేష్టులయిరి ఆనందుడు (లేఖను చూచి)

ఒక దినము వ్యాహ్యాళికి వెడలిరి, గంగాతీరమునకు (కాశీలో)
యోచన చేయుచుండిరి – తన ధ్యేయమును గూర్చి

(అలలతాకిడి) అంతలో వచ్చె "గంగలో ఒక గీతాగ్రంథము "తామ్రపత్రమున
పసుపు, కుంకుమ, గంధాక్షత, పుష్పపూజిత గ్రంథరాజము
ఆశ్చర్యచకితులైరి. ఆనందమోహనులు
ఆనందమున తన దోసిటతీసె, గ్రంథరాజమును
తన ధ్యేయమును(కర్తవ్యమును) ఈరీతిగ తెలిపె
(భగవంతుడు) గీతాచార్యుడు అటంచు
సంతసమున చేతులు జోడించె, (నమస్కరించె)
"కాశి విశ్వేశ్వరుల సందర్శించె",
తన విద్య ముగియగ పయనమాయె స్వగృహమునకు(విజయవాడ)
తండ్రి సంతసించె, తనయుల చూచి
సద్బోధ లెన్నెన్నియొ తెలిపె, పంపెను
మలయాళ సద్గురు దేవుల కడకు(వ్యాసాశ్రమము)
ఆనంద పరవశులైరి సద్గురువులు ఆనందుల చూచి
ప్రీతితో నేర్పె ఆత్మవిద్యలనెల్ల

కఠిన నియమములెన్నొ, ఆచరింపచేసిరి
మౌనవ్రతము "ఆచరించిరి
అపక్వాహార నియమము పాటించిరి
యోగవాశిష్ఠ మహాగ్రంథమును ఆంధ్రీకరించిరి
కఠిన తపశ్చర్య గావించిరి ద్వాదశ వర్షములు (12 సంగి)
కరతలామలకమాయె, ఆత్మవిద్యలెల్ల (అవగాహన ఆయె)

ఒక దినమున వర్తమానమంపిరి సద్గురువులు తండ్రికడకు తమ తనయులు
ఆనందమోహనులు పరిపూర్ణపక్వస్థితికి వచ్చిరి.

సన్న్యాస దీక్షాక్రతువు ఆచరింపచేతు
బయలుదేరి రమ్ము వ్యాసాశ్రమమున కనుచు
ఆనందపరవశులైరి తండ్రి –పుత్రుని పూర్ణస్థితిని చూచి
పయనమాయిరి వ్యాసాశ్రమమునకు –తల్లితండ్రులు
సద్గురు మలయాళ గురుదేవుల కడకు(ఏర్పేడు)
ఆహ్వానములంపిరి, సద్గురువులు భక్తకోటికెల్ల
తరలివచ్చిరి, భక్తులు తండోపతండములుగ
ఇటువంటి సన్న్యాసక్రతువు ఇది వరకెన్నదు
చూడలేదటంచు –
సద్గురువులు జరిపిరి క్రతువు పంచ దివసములు
అగ్నిహోత్రవిధిన –
పూజలు, హోమములు జరిపిరి యథావిధిన
పాదచారియై పంపిరి కాళహస్తి క్షేత్రమునకు
స్నానమాచరించిరి ఆనందులు పావన స్వర్ణముఖిలో
భక్తితో సేవించిరి, ఆనందులు "కాళహస్తీశ్వరుని"
తిరిగి వెడలిరి, పాదచారియై భక్తబృందముతోడ
వ్యాసాశ్రమమునకు

సద్గురువులు తెల్పిరి ఆనందులతో, తల్లి, ఆజ్ఞ కోరమనుచు
సన్యాసమునకు - నిండు సమావేశములో (సభలో)

తల్లిని కోరిరి ఆనందమోహనులు ఈ విధముగ
"మాతః సన్యాసమిచ్ఛామి,
దేహి తవ ఆజ్ఞాం మమ। తల్లి చెప్పెను,
"పుత్ర! అహం దదామి ఆజ్ఞాం తవ ।"
తథాస్తు, అని చెప్పెను.

తరువాత గురుదేవులకు సాష్టాంగ దండ ప్రణామంబులాచరించిరి ఆనందులు

తదుపరి సద్గురువులు, కాషాయంబులు, దండకమండలంబులు పాదుకా ద్వయము నొసంగిరి - మరియు "శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి" అని నూతన నామధేయము నిచ్చి, ఆశీర్వదించిరి. నామధేయము యొక్క అంతరార్థమును ఈ విధముగ దెల్పిరి. విద్యాప్రకాశ అనగ, ఆత్మ విద్యను లోకమున ప్రకాశింపచేయువాడు. ఆనంద- బ్రహ్మానందమును సదా అనుభవించువాడు గిరి, అనే పదము గురు సాంప్రదాయమును తెలుపునట్టిది అని శెలవిచ్చిరి - ఆనందమోహనులు

(సన్న్యాసనామధేయ) శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి - తరువాత స్వామి గురుదేవులకు దండప్రణామంబులిడిరి. తదుపరి తల్లి చరణ కమలములకు ప్రణమిల్లిరి. స్వామి ఆ తదుపరి, గురుదేవులు ఆజ్ఞమేరకు "తండ్రి", తనయుని, పాదపద్మములకు సాష్టాంగ దండ ప్రణామం బాచరించిరి. తనయుడు "సద్గురు" వాయె నటంచు.

శాస్త్ర మీరీతిగ యుండెనట

అనగ తల్లి స్థానము అటువంటి పవిత్రమైనదని తెల్పుట ।
అందువలననే శాస్త్రములలో "మాతృదేవో భవ" అని

తల్లికి మొదటి స్థానముగా, ఉదాహరింపబడియున్నది.
ఆహా, పుత్రుడు ఎదిగిపోయె తండ్రికంటె మిన్నగ
ఎటువంటి దివ్యసన్నివేశమిది అని, వేనోళ్ళ పొగడిరి భక్తవరులెల్లరు

ఏకేనాపి సుపుత్రేణ విద్యాయుక్తేన సాధునా ।
ఆహ్లాదితం కులం సర్వం యథా చంద్రేణ శర్వరీ ॥

ఒక్క చంద్రుడు ఆకాశమునంతను ప్రకాశింపచేయు విధమున ఒక్క సుపుత్రుడు వంశమునంతను ప్రకాశింపచేయును అనుచు తల్లిదండ్రులు మిగుల సంతసించిరి.

భక్తకోటి అంతయు ఈ సన్న్యాసక్రతువును తిలకించి ఆశ్చర్యచకితులైరి. ఇటువంటి సన్న్యాసక్రతువు ఇంతకు పూర్వము ఎచటను తిలకించలేదని, తల్లితండ్రులు ఇష్టపూర్వకముగ తనయునకు సన్న్యాసమిప్పంచుట ఇదియే ప్రథమమని చరిత్ర ప్రసిద్ధి చెందిన ఈ సన్నివేశమును తిలకించి జన్మ ధన్యమాయె నంచు వేనోళ్లబొగడుచు తీర్థప్రసాదములు సేవించి ఆశీస్సులందించి, సద్గురు మలయాళ గురుదేవులకు వందనము లాచరించి సద్గురు ఆజ్ఞమేరకు గృహోన్ముఖులైరి.

సద్గురు కటాక్షములతో, తల్లితండ్రులు పుత్రుని దీవించి స్వగృహమునకు విజయవాడ పయనమైరి. కండ్లు మూసినను, తెరచినను ఈ క్రతువే కళ్లకు కట్టినట్లు అగుపించుచున్నదని భక్తకోటి అంతయు మది తలంచుచుండిరి, పంచ దివస సన్న్యాసక్రతువు ఈ రీతిగ పరి సమాప్తమాయె.

ఆనందమోహనులు, శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి అయినారు.

హరిః ఓం

తదుపరి

Scanned with CamS

"వ్యాసపుత్రునిగ వెలసె, శుకబ్రహ్మాశ్రమము, శ్రీ కాళహస్తి క్షేత్రమున"
రెపరెపలాడెను, కాషాయజండా "అభయకుటీరమున"
రెపరెపలాడెను గీతాజండా
స్థాపిత మాయెను కపిధ్వజము
ఈశ్వరాలయము వెలసె గీతామందిరము వెలసె
అన్నశాల వెలసె, గోశాలవెలసె, గోపబాలకులు వెలసిరి
గ్రంథాలయము వెలసె, మాసపత్రిక వెలసె
భక్తులు వెలసిరి, సాధుపుంగవులు చేరిరి
గోపాలమందిరమున, ఆనందవైద్యాలయము వెలసె
మిడిల్ స్కూలు వెలసె, వేదపాఠశాల వెలసె,
తపాలాశాఖ వెలసె (పోస్టాఫీసు) సమాచార కేంద్రము వెలసె,
సద్గురువులు ఇచ్చిరి తన "పాదుకాద్వయమును"
భక్తితో పూజించిరి స్వామి "భరతుని" వోలె
ఆలయమున జరుగుచుండె పూజలు భజనలు
భక్తబృందములు తరలివచ్చుచుండిరి.

"నిత్య కళ్యాణము, పచ్చుతోరణముగ నుండె,
"శ్రీ శుకబ్రహ్మాశ్రమము"
గురు ఆశీస్సులతో -

తదుపరి -

నడుం కట్టిరి స్వామి, గీతోద్యమమునకు
గీతా దండము చేత బూని అపర వివేకానందుని వోలె
కృష్ణుడు ఊదెను, "పాంచజన్యమును"
విజయభేరీలు మ్రోగెను దేవలోకముల

కర్పూర హారతులు వెలిగించిరి ఈశ్వరాలయమున
స్వామి దండప్రణామం బాచరించిరి, "గురుపాదుకలకు"
జయ విజయీభవ అనుచు బయలుదేరిరి గీతోద్ధరణకు
భక్తవరులతో
బి-ఫియర్లెస్, ధైర్యముగా నుండుడు, భగవంతుడు
సర్వదా మిమ్ము కాపాడును
వాడల వాడజరిగె-గీతా మహాయజ్ఞములు
పల్లెపల్లెల జరిగె -గీతా మహోత్సవములు
దశదిశల జరిగె-గీతా సప్తాహములు
స్పెషల్ బస్సులు నడిచె, ఆటోరిక్షాలు నడిచె

రాజధానిలో, అన్ని దిక్కుల
గీతాసారమెల్ల - సరళరీతిని బోధించిరి
కఠిన వేదాంతమెల్ల పిట్ట కథలతో పోల్చి చెప్పిరి
వక్తృత్వ పోటీలు జరిగె -రచనా వ్యాసంగములు నిర్వహింపబడి
పిన్నలు, పెద్దలు ఉరకలు వేసిరి ఉత్సాహమున
గీత యన విశదమాయె, ఆబాలగోపాలురకు
గీతా ప్రబోధాలు జరిగె పండిత పామర జనరంజకముగ
పరుగు పరుగున వచ్చిరి ప్రజలు వేదాంతమహాసభలకు
ఈ వింత ఎచటైన కలదా యని విస్తుపోయిరి ప్రజలు

వేలకు వేలుగ ముద్రితమాయెను గీతా మహాగ్రంథములు
కుప్పలు తెప్పలుగ అచ్చాయె బృహత్ వేదాంత గ్రంథరాజములు
గుట్టలు గుట్టలుగ ప్రింటాయె గీతామకరందములు
ఆడియోలు, వీడియోలు నిర్మితమాయె।

Scanned with CamS

వాడవాడల వెలసె గీతా భవనములు
దేశదేశముల వెలసె గీతామందిరములు
దశదిశల జరిగె కృష్ణ ప్రతిష్ఠలు
గీతామహిమలు పొంగి పొరలె
అవని ఈనినట్లుండె జనసందోహములు

ఇది ఒక గీతా మహా ఉద్యమం
ఇది ఒక ప్రభంజనం (మెడిటేషను)
ఇది గీతాయుగం, ఇది గీతాశకం
శ్రీస్వామి 80 వసంతములు, "మోక్షఫలములను" అందించిన
ఆనంద-నందన వనంబిది
కృష్ణుని మోహన – మురళీ రవళి ఇది
'ఆనందమోహన్'
ఇది, ఆనందయుగం, మోహనశకం
స్వామి ప్రవచించిరి గీతను పారాయణ చేయుటయే
కాదు, సర్వులు చేయవలయును 'నిష్కామ సత్ కర్మాచరణ'
అదే యోగమనగ
పరోపకారార్థ ఇదం శరీరం అని చాటిచెప్పిరి, చేసిచూపిరి-
నెలకొల్పిరి స్వామి, ఉచిత నేత్రవైద్యాలయమును
దీన జనసేవకై, త్రినేత్ర భక్త కన్నప్ప పేరిట

మానవసేవయే మాధవసేవ యనుచు
నరుని సేవయె, నారాయణసేవ యనుచు
దీన జనసేవయే, పరమాత్మసేవ యనుచు

ఆలయమనగ-వైద్యాలయమయా!
దీనజనులే -భగవత్స్వరూపులయా!
దీనజనుల దీవెనలే -కర్పూరహారతులయా!
ఆర్తజనుల ఆనందమె -శరగోపమయా!
"వైద్యో నారాయణో హరిః"

"దేహో దేవాలయః ప్రోక్తో, జీవో దేవస్సనాతనః"
ప్రజలు ప్రణతులర్పించిరి, నేత్రదాతకు
భవవైద్యునకు -భౌతిక వైద్యునకు
శ్రీ విద్యాప్రకాశానందగురుదేవులకు
ప్రజలు తలంచిరి ఆనందుల చూచి
కృష్ణుని – ప్రతినిధిగ
వ్యాస – పుత్రునిగ
శంకరాచార్య – మేధస్సుగ
బుద్ధభగవానుని – అనుచరునిగ
ఏసుప్రభు – దూతగ
వివేకానందుని – ధైర్యసాహసములుగ
రామతీర్థుల – వాక్ ప్రతిభగ

భగవంతుడు ఏరికోరి పంపెను, లోక కళ్యాణమునకై ఆణిముత్యమును, ముని మాణిక్యమును, నవరత్నమును శ్రీ స్వామి విద్యాప్రకాశానందులను

భువికి – 1993 సం॥ ఏప్రిల్ 13న
శ్రీ స్వామికి వచ్చెను 80 వసంతము

గంటలు మ్రోగెను గణగణమనుచు దేవాలయముల కర్పూరహారతులు వెలిగించిరి. తిరుమల వేంకటేశ్వరులకు క్షీరాభిషేకములు చేసిరి.

Scanned with CamS

కాళహస్తీశ్వరునకు భక్తులు చేసిరి భజనలు, ఏకాహములు శుక బ్రహ్మాశ్రమమున అన్నదానములు, వస్త్రదానములు జరిపిరి దీనజనులకెల్ల నివాళులర్పించిరి ప్రజలు, శ్రీ విద్యాప్రకాశానంద గురుసార్వభౌమునకు

తన కోర్కెలీడేరెనటంచు

"కృష్ణుడు ఊదెను పాంచజన్యమును"
తిరుమల వేంకటేశ్వరుడు మెచ్చె -శేష వస్త్రము కప్పె
కాళహస్తీశ్వరుడు మెచ్చె అభయహస్తమెత్తి ఆశీర్వదించె
భక్త కన్నప్ప మెచ్చె - తనపేరు జగద్విఖ్యాత మైనదనుచు

తన సనాతన వేదాంత జ్ఞాన మహాసభలకు -

తల్లితండ్రులు సత్యసాయీశ్వరుడు మెచ్చె, శివలింగము సృష్టించి ఇచ్చె -
పుత్రుడు సార్థక నామధేయుడాయె ననుచు

పితృదేవతలు సంతసించిరి - పున్నామ నరకము తప్పెననుచు
వంశము సంతసించెను - యథా చంద్రేణ శర్వరీ, అనుచు
ప్రజలు సంతసించిరి - గీతా గంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే, అని
ముక్కోటి దేవతలు సంతసించిరి - పుష్పవృష్టి కురిపించిరి
తథాస్తు దేవతలు పల్కిరి -శతమానం భవతు
ప్రజలు స్తుతించిరి స్వామిని

జయము జయము - వేదాంతవేద్యునకు
" " - భవ బంధ విమోచనకునకు
" " - మలయాళ యతీంద్ర ప్రియతమ శిష్యునకు
" " - విద్యా ప్రకాశానందగురు సార్వభౌములకు
" " - విశ్వకళ్యాణమయ మూర్తి దిగంతరకీర్తి
ఆనందమోహనమూర్తికి -

1994 ఏప్రిల్ 13న స్వామికి నిండెను 80 వసంతము

కీర్తన ఆనందరూపా దేవాదిదేవా బృందవిహారా ఆనందచంద్ర
నిత్యానంద ఆత్మానందా కేశవా గోవిందా
గోవింద గోపాల జైజై ఆనంద ముకుందా
గోవింద గోపాల జైజై ఆనందముకుందా । (4)

మంగళం గురుదేవాయ మహనీయగుణాత్మనే,
అసంగానంద శిష్యాయ సార్వభౌమాయ మంగళమ్
సర్వలోక శరణ్యాయ సాధురూపాయ మంగళమ్ ।

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః ।
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ।

భవిష్యత్ వాణి నాడీ గ్రంథము భృగునాడీ గ్రంథము.

1900 శతాబ్దంలో భారతదేశము యొక్క పుణ్యము క్షీణదశకు వచ్చును. అత్తరి ఆంధ్రదేశమున భగవంతుడు శ్రీ సత్యసాయిబాబా పేరున అవతరించి పునరుద్ధరణ జరుపును. ఆ తరుణములోనే ఆంధ్రదేశమున కొందరు మహనీయులు లోకోద్ధరణకై అవతరింతురు. వారిలో శ్రీవిద్యాప్రకాశానంద స్వామి పేరిట ఒక కారణజన్ముడు జన్మించి గీతాపునరుద్ధరణ కార్యము చేపట్టి, ప్రజలను భగవదున్ముఖుల గావించును, అని ఉండెనని ఒక భక్తాగ్రేసరుడు పుట్టపర్తి క్షేత్రమున మరి యొక భక్తవరేణ్యునితో నుడివెనట.

సర్వే జనాః సుఖినో భవంతు.

- వందన సమర్పణ -

ఏ విద్యనేర్చుకొన్నచో లేవో
భవబంధములు క్లేశములు లేవో
ఆ విద్యనిచ్చు గురుదేవునకు
దైవంబే యనుచు మ్రొక్కెద సతతంబున్ ।

(సనాతన సారథి నుండి సేకరణ)

ఆనందరూపులు - ఆత్మతేజులు
మోహనరూపులు - ముక్తిప్రదాతలు
త్రిగుణాతీతులు - తత్త్వబోధకులు
భవార్తిహరులు - భవబంధవిమోచకులు

గీతాప్రచారకులు - సద్గ్రంథ రచయితలు

(108) "అష్టోత్తరశత గీతాయజ్ఞ కర్తలు"
శ్రీమలయాళ యతీంద్ర ప్రియతమశిష్యులు
శ్రీ సుశీలా రామస్వాముల ప్రీతిపుత్రులు
వేదవిదులు, కరుణామయులు
శ్రీ విద్యాప్రకాశానంద గురుసార్వభౌములకు
నే, ప్రణతుల నర్పింతున్
మ్రొక్కెద నే దివ్య చరణంబులన్
భక్తిపూర్వక నమోవాకంబులన్.

ఇట్లు
ప్రేమపూర్వక సమర్పణ - 81వ జన్మదిన సందర్భంగా
ఓంకారం 13-4-94
అమెరికా నుండి



శ్రీ స్వాములవారికి గంగానదిలో దొరికిన భగవద్గీత.

శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారి కుటుంబసభ్యులు.

Scanned with CamS

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారితో శ్రీస్వాములవారు



శ్రీ సముద్రాల లక్ష్మణ్యాయగారితో శ్రీస్వాములవారు

శ్రీమలయాళస్వాములవారు,
శ్రీవిద్యాప్రకాశానందగిరి
స్వాములవారు



శ్రీ స్వాములవారి అధిష్ఠాన మందిరం, శ్రీశుకబ్రహ్మాశ్రమం

Scanned with CamS

తల్లిగారి సమాధివద్ద ఈ
గ్రంథ రచయిత్రి
శ్రీమతి వై. ఓంకారం



శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి స్మారకమందిరం వద్ద
రచయిత్రి శ్రీమతి వై. ఓంకారం.

Scanned with CamS